జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 08 అక్టోబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 212 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , భాద్రపద మాసము , తిథి: షష్టి - 10:17:05 వరకు నక్షత్రంమృగశిర - 26:55:46 వరకు కరణంవణిజ - 10:17:05 వరకు, విష్టి - 21:08:34 వరకు పక్షంకృష్ణ యోగంవ్యతీపాత - 18:17:27 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

**జాబితాలో పలువురు భారతీయులు!**

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద

మిగతా 2లో..

### భారత్‌లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

**సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిలో అమ్మకాలు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్‌తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్

మిగతా 2లో..



### రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్సో సోయికి నోబెల్



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): వైద్యశాస్త్రంలో చేసిన సేవలకుగానూ 2026 సంవత్సరానికి నోబెల్ బహుమతి ముగ్గురు శాస్త్రవేత్తలను వరించింది. సైంటిస్టులు కార్ల్ డిస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్‌లకు అత్యున్నత పురస్కారం నోబెల్ లభించింది. కాంతి- నియంత్రిత అయాన్ ఛానెల్స్, ఆప్టోజెనెటిక్స్ పై వారి ఆవిష్కరణలకు ఈ అవార్డు అందుకుంటున్నారు. సజీవ మెదడులోని నాడుల కణాలు (న్యూరాన్లు)

మిగతా 2లో..

## విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించం

- అలంటి ఆలోచన ప్రభుత్వానికి లేదు
- రాజకీయ లబ్ధి కోసం దుష్ప్రచారం
- తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరువ
- 19,892 మెగావాట్లకు చేరిన డిమాండ్
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): తెలంగాణలో విద్యుత్ డిమాండ్ చరిత్రలోనే అత్యధిక స్థాయికి చేరుకుంది. రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినట్లు ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. దాదాపు 20 వేల మెగావాట్లకు చేరువైన డిమాండ్ ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించామని చెప్పారు. ప్రజా భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణలో విద్యుత్ డిమాండ్ పొరుగు రాష్ట్రాలతో

మిగతా 12లో..

## దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు..

- దిల్లీలో మరోసారి ఉద్రిక్త వాతావరణం
- జంతర్‌మంతర్ వద్ద విపక్ష ఎంపీల ఆందోళన!
- రాహుల్, ప్రియాంక సహా విపక్ష ఎంపీలు అరెస్ట్
- నేలపై పడుకొని ప్రియాంక గాంధీ నిరసన



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): దిల్లీలో మరోసారి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. విపక్ష ఎంపీల సమావేశం అనంతరం, ఈసీ కార్యాలయానికి వెళ్లడానికి ప్రతిపక్ష ఎంపీలు సిద్ధంకావడంతో ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తీరును ఖండిస్తూ, ఆయన రాజీనామా డిమాండ్‌తో విపక్ష ఇండియా కూటమి ఎంపీలు జంతర్‌మంతర్ వద్ద ఆందోళనకు దిగారు.జంతర్ మంతర్ నిరసనలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి

మిగతా 2లో..

### ఈసి నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

**పిటిషన్ ను స్వీకరించిన సుప్రీంకోర్టు**

న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): సీఈసీ, ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి సంబంధించిన 2023 చట్టంపై దాఖలైన పిటిషన్ల విషయంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం జరిగింది. ఈ అంశంపై సెప్టెంబర్ 23న వెలువడిన

మిగతా 2లో..

### పోరాటం ఆపేది లేదు

- బీజేపీని దేశ ప్రజలు క్షమించరు..
- మోదీ, అమిత్ షా నిరంకుశత్వం
- ప్రజాస్వామ్యయుత ఆందోళనకు అడ్డు
- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌తో వైదొలగాలి
- ప్రధాని మోదీ రాజీనామా చేయించాలి
- ఢిల్లీ పోలీసులపై సీఎం రేవంత్ ఆగ్రహం



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడే వరకు తమ పోరాటం ఆగదని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి ముఖ్య నాయకులను ఢిల్లీ పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకోవడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాఖంబ పోలీస్ స్టేషన్‌లో ఉన్న రాహుల్ గాంధీని కలిసేందుకు వెళ్లిన తనను కూడా పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కేంద్రంలోని

మిగతా 2లో..

### ప్రభుత్వ ఉద్యోగులకు దసరా బొనాంజా

- రెండు డీఏలు మంజూరు చేసిన ప్రభుత్వం
- రాష్ట్రంలో 6,91,000 మందికి ప్రయోజనం
- ఏటా రూ.2,500 కోట్లు అదనపు వ్యయం

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. రెండు డీఏలు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం నాడు 2 డీఏలు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ జీతంలో పెంచిన డీఏ ఉద్యోగుల ఖాతాల్లో జమ అవుతుందని స్పష్టం చేసింది. సీపీఎస్ ఉద్యోగులకు తొలి డీఏ 33 వాయిదాలలో, రెండో డీఏ 27 వాయిదాలలో చెల్లించనున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. 2024 జనవరి, జులై డీఏలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ డీఏ పెండింగ్ బకాయిలు జీపీఎఫ్ ఖాతాలో జమ చేయనున్నారు. 2024 జవనరి నుంచి ఉద్యోగుల డీఏ 37.31 శాతం, 2015 పే స్కేలు ఉద్యోగులకు డీఏ 81.72 శాతం , 2020 పేస్కేలు ఉద్యోగులకు డీఏ 40.04 శాతతం, 2016 పే స్కేలు ఉద్యోగులకు

మిగతా 12లో..



## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

### తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!

### ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది.ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా

మిగతా 12లో..

## నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

- కోట్లాది మంది విశ్వాసమే నా అతిపెద్ద బలం
- దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి
- విఘ్నహర్త ఆశీస్సులతో దేశం ప్రగతిపథంలో సాగాలి
- 25 ఏళ్ల ప్రస్థానంపై ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు.

మిగతా 12లో..

### శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయానికి నిధులు మంజూరు

- రూ.1108 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆరుగురు సభ్యులతో నిపుణుల కమిటీ నియామకం

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): మూసీ ఒడ్డున శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. ఆలయ నిర్మాణంతో పాటు అనుసంధాన రహదారి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1108 కోట్ల మంజూరు చేసింది. ఆలయ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు డిజైన్లు ఖరారు చేసేందుకు ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల ప్రత్యేక

మిగతా 2లో..

## 5.50 శాతానికి రెపో రేటు పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్



న్యూఢిల్లీ, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది.

మిగతా 12లో..

### పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి
- ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన

మిగతా 12లో..



# సంపాదకీయం

## అనుభవమే గొప్ప ఆస్తి

సీఎం, పీఎంగా 25 ఏళ్ల అధికార ప్రస్థానం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ తన రాజకీయ జీవితం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, తన జీవితంలోని ప్రతి క్షణం, ప్రతి సంఘటన తనకు ఎన్నో విలువైన పాఠాలు నేర్పించాయని తెలిపారు. సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు. తన చిన్నతనం రోజులను గుర్తుచేసుకుంటూ, గుజరాత్‌లోని వడ్నగర్‌ను ప్రస్తావించారు ప్రధాని మోదీ. తాను ఎప్పుడూ పాఠశాలకు అందరికంటే ముందుగా వచ్చే విద్యార్థులలో ఒకడినని తెలిపారు. నేర్చుకోవాలనే తపన తన జీవితంలో ఒక భాగమని, నేటికీ తాను ఎప్పుడూ ఒక విద్యార్థిగానే భావిస్తానని పేర్కొన్నారు. తన చదువు, నేర్చుకునే తపన ఎన్నటికీ తగ్గకూడదని దేవుడిని ప్రార్థించినట్లు వెల్లడించారు. జీవితంలో ఎదురైన కష్టాల నుంచి తాను ఎంతో నేర్చుకున్నానని చెబుతూ, "నన్ను కించపరిచిన వారు నాకు కోసం తిరిగి నిలబడటం నేర్పించారు. నన్ను వ్యతిరేకించిన వారు ప్రజాస్వామ్య శక్తిని నేర్పించారు. ప్రతి సంక్షోభం నా సహనానికి ఒక పరీక్షగా నిలిచింది" అని అన్నారు. బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు. మరోవైపు 25 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు ప్రభుత్వ అధినేతగా పనిచేసిన ప్రధాని మోదీ నాయకత్వాన్ని కేంద్ర కేబినెట్ మంగళవారం ప్రశంసించింది. తొలుత గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత భారత ప్రధానమంత్రిగా ఆయన చేసిన సేవలను కొనియాడింది. 'దేశమే ప్రథమం, పౌరుడే తొలి ప్రాధాన్యం' అనే సూత్రంతో ముందుకు వెళ్తున్నారని పేర్కొంది. విశేష జనాదరణ పొందుతూ మూడు లోక్‌సభ ఎన్నికల్లోనూ వరుసగా విజయాలు సాధించారని గుర్తు చేస్తూ, ఈ మేరకు కేంద్ర కేబినెట్ ఓ తీర్మానాన్ని ఆమోదించింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా వరుసగా మూడుసార్లు సేవలందించిన సమయంలో మోదీ పలు విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టారని కేబినెట్ పేర్కొంది. గుజరాత్‌లో అమలు చేసిన పథకాల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దార్శనికతతో ముందుకు సాగుతున్నారని తెలిపింది. చిన్నతనంలో తన తల్లి ఎదుర్కొన్న ఇబ్బందికర పరిస్థితులను, దేశంలో పేదరికాన్ని స్వయంగా చూసిన అనుభవం మోదీ విధానాలపై ప్రభావం చూపిందని పేర్కొంది. ఆ అనుభవాలతో ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నారని తెలిపింది. మహిళలు, రైతులు, యువతకు అవకాశాలను విస్తరించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని కేబినెట్ పేర్కొంది. దేశ అభివృద్ధికి అవసరమైన సంస్కరణలను ధైర్యంగా చేపడుతున్నారని తెలిపింది. మోదీ నాయకత్వంలో మూలధన వ్యయం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని వెల్లడించింది. హైవేల విస్తరణ, రైల్వేల ఆధునికీకరణ వేగంగా జరుగుతున్నాయని పేర్కొంది. అలాగే మోదీ పాలనలో డిజిటల్ సేవల్లోనూ విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని కేబినెట్ తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా అనేక సవాళ్లు, అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న సమయంలోనూ తన నాయకత్వ సామర్థ్యంతో దేశాన్ని సరైన దిశలో ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొంది. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రాధాన్యం మరింత పెరుగుతోందని తెలిపింది. దేశ భద్రత విషయంలోనూ ప్రధాని మోదీ రాజీపడని వైఖరిని అవలంబిస్తున్నారని కేబినెట్ తీర్మానంలో పేర్కొంది. సర్జికల్ స్ట్రైక్స్, బాలాకోట్ వైమానిక దాడులు, ఆపరేషన్ సిందూర్ వంటి చర్యలు ఇందుకు నిదర్శనమని తెలిపింది. 2047 నాటికి సుసంపన్న, అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలన్న ప్రధాని మోదీ దార్శనికతకు మద్దతుగా నిలుస్తూ తీర్మానాన్ని ఆమోదిస్తున్నట్లు కేబినెట్ వెల్లడించింది. ఇదిలా ఉండగా, ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్, లాజిస్టిక్స్ అథారిటీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రవాణా రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల పర్యవేక్షణలో ఈ సంస్థ కీలకంగా వ్యవహరించనుందని కేంద్ర ఐటీ, సమాచారశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వివిధ మంత్రిత్వ శాఖలు, ఏజెన్సీల మధ్య సమన్వయ లోపాలను తగ్గించి మౌలిక సదుపాయాల కల్పనలో వేగం పెంచేలా ఇట్లా పనిచేస్తుందని ఆయన వివరించారు. రూ.500 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టే మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల సాంకేతిక అర్హతలను ఇట్లా మదింపు చేస్తుందని తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.10 వేల కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేసే ప్రతిపాదనకూ కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ గ్రోత్ ఫండ్ ద్వారా ఎంఎస్ ఎంఈ లకు దీర్ఘకాలంలో అవసరమైన పెట్టుబడులు అందుబాటులోకి వస్తాయని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. దీంతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరించుకోవడంతో పాటు నూతన సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు అవకాశం కలుగుతుందని చెప్పారు. మొత్తంగా ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపిస్తూ కేబినెట్ తీర్మానం చేయడంతో పాటు రవాణా మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్ రంగంలో సమన్వయం, ఎంఎస్ ఎంఈలకు పెట్టుబడుల లభ్యతను పెంచే కీలక నిర్ణయాలను సమావేశంలో తీసుకుంది.

## రసాయన శాస్త్రంలో హెన్రీ కాగన్, కెన్నో సోయికి నోబెల్

మొదటిపేజీ తరువాయి..

మన జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనను ఎలా ప్రభావితం చేస్తాయో చూపించడం వీరు చేసిన ప్రయోగం ద్వారా సాధ్యమైంది. పీటర్ హెగెమాన్, జార్జ్ నాగెల్ ఒక ఏకకణ నాచు (శైవలం)లో ఛానెల్ రోడాప్సిన్ అనే అద్భుతమైన ప్రోటీన్ ఉన్నట్లు కనుగొన్నారు. కార్ల్ డిస్సెరోత్ ఈ ప్రోటీన్‌ను నరాల కణాల కోసం కాంతితో నియంత్రించగలిగే ఒక 'స్విచ్' విధానం తీసుకొచ్చారు. ప్రముఖ శాస్త్రవేత్త జార్జ్ నాగెల్ 1953లో జన్మించారు. ఆయన 1988లో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. జార్జ్ నాగెల్ ప్రస్తుతం యూనివర్సిటీ ఆఫ్ వుర్జ్‌బర్గ్ (జర్మనీ) మాలిక్యులర్ ప్లాంట్ ఫిజియాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నారు. ఈ పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని 'మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోఫిజిక్స్'లో చేసి చూపించారు. వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతికి ఎంపికైన పీటర్ హెగెమాన్ 1984లో జర్మనీకి చెందిన మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ విభాగం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. జర్మనీలోని హంబోల్ట్ యూనివర్సిటీ ఆఫ్ బెర్లిన్‌లో 'హర్టీ సీనియర్ ప్రొఫెసర్ ఆఫ్ న్యూరోసైన్స్'గా పీటర్ హెగెమాన్ చేస్తున్నారు. ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికైన పరిశోధనను ఆయన జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్స్టిట్యూట్ ఫర్ బయోకెమిస్ట్రీ లో చేసి నిరూపించారు. నోబెల్ బహుమతి విజేతలకు అందించే మొత్తం నగదు బహుమతి 1.2 కోట్ల స్వీడిష్ క్రోనర్ (దాదాపు 11 లక్షల 96 వేల డాలర్లు). ఒకరు విజేతగా నిలిస్తే వారికే మొత్తం నగదు లభిస్తుంది. ముగ్గురు విజేతలు కనుక ఈ మొత్తాన్ని ఆ ఏడాది విజేతలకు సమానంగా పంచుతారు. నోబెల్ అసెంబ్లీ 1977 ఏడాదిలో స్థాపించారు. వైద్య రంగంలో నోబెల్ బహుమతిని అందజేసే కరోలిన్స్కా ఇన్స్టిట్యూట్‌కు ఇది ప్రధాన సంస్థ.

# దేశవ్యాప్తంగా 'సర్' ప్రకంపనలు..

మొదటిపేజీ తరువాయి..

అమిత్‌షాలు జ్ఞానేశ్ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడితే తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారని, వాటిని తాను మెడల్స్ భావిస్తానని తెలిపారు. ఇప్పటి వరకు తనపై 45 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయని, 100 మెడల్స్ సాధించడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలు ఈసీని కలుద్దామని 300 మంది వెళితే మాకు అనుమతి నిరాకరించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు పదవిలో కొనసాగే అర్హత లేదు. మా దృష్టిలో ఆయన చట్టబద్ధమైన అధికారి కాదు. దేశద్రోహులపై చర్యలు తీసుకునే వరకు మా పోరాటం ఆగదు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. సీఈసీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే సహా విపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్‌మంతర్‌కు బయలుదేరగా, వారిని అడ్డుకోవడానికి వందలాది మంది భద్రతా బలగాలు మోహరించాయి. ఈ క్రమంలో జంతర్‌మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది.

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. దిల్లీ పోలీసుల తీరుపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "ఎంపీలతో ప్రవర్తించే తీరు ఇదేనా? ఎంపీలను కొడతారా? ఈడ్చి పడేస్తారా? ఈసీని కలుద్దామని ఎంపీలు అడగడం నేరమా?" అంటూ మండిపడ్డారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, విపక్ష ఎంపీలను పోలీసులు అరెస్టు చేశారు. మల్లికార్జున ఖర్గేమంగళవారం ఆకాశవాణి భవన్ ప్రాంగణంలోకి అనుమతి లేకుండానే ప్రవేశించారనే ఆరోపణలపై రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ఎంపీలపై దిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై స్పందించిన కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ్య ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టినా తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. 'మాపై ఎన్ని కేసులు పెట్టినా, ఎంతలా బెదిరించాలని చూసినా మేం భయపడేది లేదు. నవ్వుతూనే ముందుకెళ్తాం. ప్రజల హక్కుల కోసం మా పోరాటం కొనసాగుతుంది' అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ కూడా కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లాలనుకుంటున్నా పోలీసులు ఎందుకు అడ్డుకుంటున్నారని, వారు గూండాయిజానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతోందని మండిపడ్డారు. ఇదే అంశంపై స్పందించిన మరో కాంగ్రెస్ ఎంపీ పవన్ ఖేరా- శాంతియుతంగా నిరసన వ్యక్తం చేయడం తమ ప్రజాస్వామ్య హక్కు అని తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19 ని ప్రస్తావిస్తూ జంతర్ మంతర్ నిరసన ప్రదేశమైనప్పుడు అక్కడికి కూడా ఎంపీలను అనుమతించకపోతే ఎక్కడ ఆందోళన చేయాలని ప్రశ్నించారు. ఇక సీఈసీ జ్ఞానేశ్ కుమార్ సహా కేంద్ర ప్రభుత్వంపైనా తమ పోరాటం కొనసాగుతుందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా వ్యాఖ్యానించారు.

వరుసగా రెండో రోజు ప్రతిపక్షాల ఆందోళనసర్ ప్రక్రియపై ప్రతిపక్షాల ఆందోళన వరుసగా రెండో రోజు కొనసాగింది. మంగళవారం రోజు పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు వెళ్లిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. తర్వాత రాహుల్, ప్రియాంక గాంధీ సహా కొందరు ఆకాశవాణి భవన్ ప్రాంగణంలో నిరసన కొనసాగించారు. దాదాపు 9 గంటల పాటు ఆందోళన తర్వాత పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇక బుధవారం మధ్యాహ్నం ఖర్గే నేతృత్వంలో ఇండియా కూటమి ఎంపీలు సమావేశపై తదుపరి కార్యాచరణపై చర్చించారు. అనంతరం జంతర్ మంతర్‌వైపు ర్యాలీగా బయల్దేరారు. ఈ నేపథ్యంలోనే దిల్లీలోని జంతర్ మంతర్ పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనేది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది.

## పోరాటం ఆపేది లేదు

మొదటిపేజీ తరువాయి..

బీజేపీ ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కాలని చూస్తోందని ఆరోపించారు. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే దేశ ప్రజలు బీజేపీని ఏమాత్రం క్షమించరని ఘాటుగా హెచ్చరించారు. ఈ పోరాటం కేవలం కాంగ్రెస్ పార్టీకి సంబంధించినది కాదని, యావత్ దేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసమని రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. అక్రమ నిర్బంధాలు, పోలీసుల దౌర్జన్యాలతో కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీయలేరని, లాఠీలు, అరెస్టులతో పోరాటాలను ఆపడం ఎవరి వల్లా కాదని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు వ్యవహారంలో కేంద్ర ఎన్నికల సంఘం తీరు అత్యంత వివాదాస్పదంగా మారిందని, నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమైన చీఫ్ ఎలక్షన్ కమిషనర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర పాలకుల్లో పెరిగిపోతున్న అసహనానికి ఈ అక్రమ అరెస్టులే నిదర్శనమని, ప్రజల హక్కులను కాపాడే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

మరోవైపు రాహుల్‌గాంధీకి మద్దతుగా దీక్ష చేపడతానన్న కాంగ్రెస్ పార్టీ నేత జగ్గారెడ్డి తెలిపారు. బీజేపీ, ఈసీకి వ్యతిరేకంగా రాహుల్ పోరాటం చేస్తున్నారన్న జగ్గారెడ్డి రాహుల్‌కు మద్దతుగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ ఎన్ని రోజులు పోరాటం చేస్తే అన్ని రోజులు దీక్ష చేపడతాని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.



## ఈసి నియామకాల తీర్పు రికాల్‌పై పిటిషన్

మొదటిపేజీ తరువాయి..

సెప్టెంబర్ 23న వెలువడిన భిన్నమైన తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. ప్రధాని, లోక్‌సభ విపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీ చేసే సిఫార్సుపై సీఈసీ, ఈసీల నియామకాలను రాష్ట్రపతి చేస్తారని 2023 మార్చి 2న ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. సీజేఐ బదులు కేంద్ర మంత్రికి అవకాశమిస్తూ ఆ ఏడాది డిసెంబరులో పార్లమెంటులో చట్టాన్ని రూపొందించడంతో దాని రాజ్యాంగబద్ధ చెల్లుబాటును పలువురు సవాల్ చేశారు. ఈ పిటిషన్లను విస్తృత రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించాలా? అనే అంశంపై సెప్టెంబర్ 23న జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే ఈ అంశంపై ఇద్దరు న్యాయమూర్తులు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. ఫలితంగా భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి. ఈ కేసును మరింత విస్తృతమైన రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలని కేంద్రం కోరింది. అయితే జస్టిస్ దీపాంకర్ దత్తా ఈ అభ్యర్థనను తిరస్కరించారు. ఎంపిక కమిటీలో ఒక క్యాబినెట్ మంత్రిని చేర్చడం వల్ల దాని తటస్థ స్వరూపం పోతుంది. 2023 చట్టం కార్యనిర్వాహక వర్గానికి ఎక్కువ అధికారాన్ని కట్టబెడుతుందని అభిప్రాయపడ్డారు. విపక్ష నేత ఉనికి నామమాత్రం అవుతుందని, కమిటీలో ఆయనను చేర్చిన ఉద్దేశం అలంకారప్రాయంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు. కానీ, జస్టిస్ దత్తా వ్యాఖ్యను వ్యతిరేకిస్తూ, కేంద్ర వాదనను జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ మాత్రం ఏకీభవించారు. ఆర్టికల్ 145(3) ప్రకారం ఈ అంశాన్ని రాజ్యాంగ ధర్మాసనం అధికారికంగా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై విస్తృత ధర్మాసనం పరిశీలించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో తదుపరి చర్యల కోసం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వద్దకు పరిపాలనా పరంగా పంపాలని ద్విసభ్య ధర్మాసనం నిర్ణయించింది. తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, అంశంపై సమర్థవంతమైన, తుది నిర్ణయం తీసుకునేలా చేయాలని సూచించింది.

## ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు

**కొత్తగా 2 పోలీస్‌స్టేషన్లు, 3 శాంతి భద్రతల డివిజన్లు ఏర్పాటు**

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ మార్పులు చేపట్టింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్ పరిధిలో మార్పులు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. 3 కొత్త శాంతి భద్రతల డివిజన్లు, 2 కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు రెండు ట్రాఫిక్ జోన్లుగా ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌ను




పునర్వ్యవస్థీకరించింది. 3 ట్రాఫిక్ డివిజన్లు, 3 ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్‌ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలోని మహేశ్వరం జోన్‌లోకి మార్చింది. మొయినాబాద్, ఆమనగల్, కొత్తూరు పేర్లతో కొత్త శాంతిభద్రతల డివిజన్లను ఏర్పాటు చేసింది. అజీజ్‌నగర్‌లో కొత్త పీఎస్, మహేశ్వరం, షాద్‌నగర్, చేవెళ్ల పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ డివిజన్లు ఏర్పాటు చేసింది. శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పేరును పెదషాపూర్‌గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఠాణా పరిధిలోని కొన్ని ప్రాంతాలూ మారాయి. పెదషాపూర్ స్టేషన్‌ను షాద్‌నగర్ జోన్ కొత్తూరు డివిజన్, షాద్‌నగర్ జోన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో శంషాబాద్, ఆర్జీఐఏ పేర్లతో రెండు పీఎస్‌లు ఉండేవి. ఇప్పుడు ఆర్జీఐఏ పీఎస్‌ను శంషాబాద్‌గా పేరు మార్చింది. గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను మీర్‌ఖాన్‌పేట్ పీఎస్‌గా మార్చింది. ఫ్యూచర్‌సిటీలో ఉన్న ట్రాఫిక్ జోన్‌ను ట్రాఫిక్-1, ట్రాఫిక్-2 పేర్లతో రెండు ట్రాఫిక్ జోన్లుగా ఏర్పాటు చేసింది. మొయినాబాద్, కొత్తూరు, ఆమనగల్ పేర్లతో 3 కొత్త ట్రాఫిక్ పీఎస్‌లు ఏర్పాటు చేసింది. షాబాద్, మొయినాబాద్, అజీజ్‌నగర్ ఠాణాలు మొయినాబాద్ ట్రాఫిక్ డివిజన్ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నూతనంగా అజీజ్‌నగర్ ఠాణా ఏర్పాటైంది. మొయినాబాద్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను ఈ ఠాణా పరిధిలోకి తీసుకొచ్చారు. జోన్‌కు ఒకటి చొప్పున మహేశ్వరం, చేవెళ్ల, షాద్‌నగర్ పేర్లతో మూడు మహిళా పోలీస్‌స్టేషన్లకు అంకురార్పణ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణా ప్రస్తుతం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో ఉంది. దాన్ని ఫ్యూచర్‌సిటీ పరిధిలోని మహేశ్వరం జోన్‌లోకి తీసుకొచ్చింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధి పూర్తిగా మారింది. గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్‌కు మీర్‌ఖాన్‌పేటగా పేరు పెట్టారు.

## శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయానికి నిధులు మంజూరు

మొదటిపేజీ తరువాయి..

కమిటీని నియమించింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద నది ఒడ్డున శ్రీ ఓంకారేశ్వర స్వామి దేవాలయం పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.1108 కోట్లు మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో నదిని శుద్ధి చేసి మళ్లీ వినియోగంలోకి తీసుకురావడంతో పాటు పరిసరాల్లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని కూడా అభివృద్ధి చేసేలా ప్రభుత్వం ప్రణాళిక చేస్తోంది. అందులో భాగంగానే మంచిరేవుల వద్ద శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయనుంది. ఈ ఏడాది మార్చి 28న చరిత్రాత్మక, పురాతన శ్రీ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధితో పాటు అనుసంధాన రహదారి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఆర్కిటెక్చర్‌కు రూ.599 కోట్లు



సివిల్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ ఇతర పనులకు మరో రూ.350 కోట్లు మంజూరు చేసింది. మంచిరేవులలోని ఇస్తానా విల్లాస్ నుంచి కీర్తి వెస్ట్ విండ్ విల్లాస్ వరకు గ్రేహౌండ్స్, యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ పక్కనుంచి ఆలయానికి చేరుకునేలా రెండున్నర కిలోమీటర్లు ఆరు లేన్ల వందడుగుల రహదారి నిర్మించేందుకు మరో రూ.160 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. శ్రీ ఓంకారేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి కోసం సాంకేతిక నిపుణుల కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఛైర్మన్‌గా, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ఈ ఇన్ సీ కో ఛైర్మన్‌గా, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్ కన్వీనర్‌గా ఉండే ఈ కమిటీలో దేవదాయ శాఖ సీఈ, ఆలయ నిర్మాణ నిపుణుడు శిల్పి డాక్టర్ ఇ.శివంగి రెడ్డి, ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆలయ అభివృద్ధి కోసం సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు డిజైన్లు, ధరలను ఖరారు చేస్తుంది.

## అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

మొదటిపేజీ తరువాయి..

'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు. అమెరికా అధికారుల ప్రకారం బల్విందర్ సింగ్ రెండు వేర్వేరు గుర్తింపులను ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 1992లో ఒక గుర్తింపుతో ఇమ్మిగ్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న ఆయన 2003లో మరో గుర్తింపుతో శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెంట్) పొందినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత 2009లో అదే రెండో గుర్తింపుతో అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే రెండు వేర్వేరు దరఖాస్తుల్లో నమోదైన వేలిముద్రలను పరిశీలించిన అధికారులు అవి ఒకే వ్యక్తివని గుర్తించినట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ జాబితాలో అమెరికా నౌకాదళ మాజీ సైనికుడు జిన్‌చావో వీ కూడా ఉన్నారు. చైనాకు గూఢచర్యం చేశారనే ఆరోపణలతో ఆయన ప్రస్తుతం 200 నెలల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. మిగతా వ్యక్తులపై హత్య, మనీ లాండరింగ్, లైంగిక నేరాలు, పన్ను ఎగవేత, వివాహ మోసం వంటి పలు ఆరోపణలు ఉన్నట్లు న్యాయశాఖ తెలిపింది. ఈ 40 మందిలో ఒక్క దేశానికి చెందిన వారు మాత్రమే లేరు. మెక్సికో, పాకిస్థాన్, చైనా, నేపాల్, ఇరాన్, నైజీరియా సహా 20కి పైగా దేశాలకు చెందిన వ్యక్తులు ఉన్నట్లు అమెరికా న్యాయశాఖ తెలిపింది. వీరిపై ఉన్న ఆరోపణలు, పౌరసత్వం పొందే సమయంలో వారు ఇచ్చిన సమాచారం ఇతర అంశాలను కోర్టులు పరిశీలించనున్నాయి. అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ నేషనాలిటీ చట్టం ప్రకారం.. మోసం చేసి లేదా కీలకమైన సమాచారాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందినట్లు కోర్టులో రుజువైతే, వారి సహజీకృత పౌరసత్వాన్ని రద్దు చేసే అవకాశం ఉంది. పౌరసత్వం రద్దైన తర్వాత సంబంధిత వ్యక్తులను అమెరికా నుంచి బహిష్కరించే డిపోర్టేషన్ ప్రారంభం కావచ్చు. అయితే ఈ 40 మందిపై నమోదైన కేసులన్నీ ప్రస్తుతం ప్రారంభ దశలోనే ఉన్నాయి. ఆరోపణలు కోర్టులో రుజువు కావాల్సి ఉంది.

## భారత్‌లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

మొదటిపేజీ తరువాయి..

సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ-డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ



మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి. అలాగే, ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు 94.56 శాతం పెరిగి 36,108 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ అమ్మకాలు ఆల్ టైమ్ హై స్థాయికి చేరడం విశేషం. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల విక్రయాలు 86,024 యూనిట్లుగా, కమర్షియల్ వాహనాల అమ్మకాలు 4,188 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ భారీ విక్రయాలతో దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా గతేడాది ఉన్న 10 శాతం నుంచి ప్రస్తుతం 13 శాతానికి పెరిగింది.



**శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానము**

**దేవాదాయ-ధర్మాదాయ శాఖ**

**గ్రా॥ ఇసన్నపల్లి / రామారెడ్డి, మం॥ రామారెడ్డి, జిల్లా: కామారెడ్డి**

**వేలం ప్రకటన**

ఇందు మూలముగా సమస్త గ్రామ ప్రజలకు భక్తులు మరియు వ్యాపారులకు తెలియజేయునది ఏమనగా, దేవస్థానములో దుకాణము టెంకాయలు, పూజా సామాగ్రి, కూల్ డ్రింక్స్, పూసవేర్లు దుకాణము నిర్వహించుకోనుటకు గాను తేది: **08/10/2026 గురువారము** దేవాలయ ప్రాంగణంలో **ఉదయం 11-00 గంలకు** బహిరంగ వేలము కలదు. **రూ.10,000/-లు** డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనగలరు. తేది: 01-11-2026 నుండి తేది: 30/10/2027 వరకు ఒక సంవత్సరమునకు మాత్రమే కాలపరిమితి వర్తించును. వేలము షరతులు వేలము ముందు తెలుపబడును.

ఇట్లు

కార్యనిర్వాహణాధికారి

ప్రభు రాంచంద్రం గుప్తా

# పత్తిలో ‘క్రాస్ స్పేసింగ్’తో అధిక దిగుబడులు

**శాస్త్రవేత్త డాక్టర్ డి.మోహన్ దాస్**





**నేరడిగొండ అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** మండలంలోని నాగమల్ల్యాల గ్రామంలో పత్తి పంటలో క్రాస్ స్పేసింగ్ విధానం, పంట యాజమాన్యం మరియు అధిక దిగుబడుల సాధనపై రైతులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ పరిశోధనా స్థానం అదనపు శాస్త్రవేత్త డాక్టర్ డి. మోహన్ దాస్ ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పత్తి పంటలో క్రాస్ స్పేసింగ్ పాటించడం వల్ల మొక్కలకు సరిపడా గాలి, సూర్యకాంతి లభించి ఎదుగుదల బాగుంటుందన్నారు. ఈ పద్ధతి ద్వారా ఎకరానికి సుమారు 30 వేల మొక్కల సాంద్రత సాధించవచ్చని తెలిపారు. నేల భూసారాన్ని పెంచేందుకు ప్రతి ఎకరానికి 5 టన్నుల పశువుల ఎరువును వాడాలని, రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. సస్యరక్షణలో భాగంగా పురుగులు, తెగుళ్లను ప్రారంభ దశలోనే గుర్తించి, అధికారుల సూచనల మేరకే క్రిమిసంహారకాలు వాడాలన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటించడం వల్ల సాగు ఖర్చులు తగ్గి రైతులు ఆర్థికంగా లాభపడతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె. కృష్ణవేణి, ఏఈఓ బి.సాయిప్రణీత్, గ్రామ సర్పంచ్, వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# సోలార్ వినియోగం పెంచుకోండి విద్యుత్ బిల్లుల మోత తగ్గించుకోండి



**దిలావర్ పూర్, అక్టోబర్ 7, (ప్రజాజ్యోతి) :** పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద దేశవ్యాప్తంగా సౌర గృహ రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్లు) అమర్చడం జరుగుతుంది . సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు ఈ రోజు చిట్యాల్ లో సోలార్ వ్యవస్థను అమర్చినట్లు వెండర్ వినోద్ తెలిపారు. సోలార్ ఏర్పాటు చేసు కొనే వారు ఇంటి పైకప్పుపై నీడ పడని తగినంత స్థలం మరియు విద్యుత్ గ్రిడ్ కనెక్షన్ ఉండాలన్నారు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచే దిశగా పీఎం సోలార్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ అవసరాలను కొంతవరకు తీర్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు. భారతదేశంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద దేశవ్యాప్తంగా సౌర గృహ రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్లు) అమర్చిన కుటుంబాల సంఖ్య 50 లక్షల మార్కును దాటింది. దీని ద్వారా దేశంలో మొత్తం రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యం సుమారు 14.8 గిగావాట్లకు (+ఔ) చేరింది అన్నారు. సోలార్ పెట్టుకోవడానికి వెండర్‌ను ఎంచుకుని ఇన్‌స్టాలేషన్ చేయించ్చుకోవాలి ఇన్‌స్టాలేషన్ పూర్తయిన తర్వాత నెట్ మీటర్‌ను ఏర్పాటు చేస్తాం దీని ద్వారా మీరు వాడగా మిగిలిన అదనపు విద్యుత్ గ్రిడ్‌కు బదిలీ అవుతుంది మరియు మీకు బిల్లులో క్రెడిట్స్ వస్తాయి. అని తెలిపారు.. మరియు సబ్సిడీ జమ అవుతున్నది అధికారులు తనిఖీ చేసిన తర్వాత నేరుగా సబ్సిడీ డబ్బులు మీ బ్యాంక్ ఖాతాలో జమ చేయబడుతుంధన్నారు

# బడి పిల్లలకు టై, బెల్టులు అందజేసిన - సర్పంచ్ వినేష్



**నేరడిగొండ అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** మండలంలోని బోరిగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం సరఫరా చేసిన టై, బెల్టులను విద్యార్థులకు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు టై, బెల్టులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవరచుకుని చదువుపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులందరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. టై, బెల్టులు అందుకోవడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, గ్రామ యువకులు రాజేష్, నరేష్, గ్రామస్థులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# సదరం సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం

**సరైన పరీక్షలు లేక ‘ఫెయిల్’.. సరెండర్ చేసినా పునఃపరీక్షకు నోచుకోని దివ్యాంగులు.**



**నిర్మల్ టౌన్, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** నిర్మల్ నిర్మల్ జిల్లాలో సదరం (SADAREM) సర్టిఫికెట్లకు సంబంధించిన సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయని దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కొంతమందికి తాత్కాలిక సదరం సర్టిఫికెట్లు జారీ చేయగా, మరికొంతమంది అర్హతలు ఉన్నప్పటికీ సరైన వైద్య పరీక్షలు నిర్వహించకుండానే ‘ఫెయిల్’ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సదరం ధ్రువీకరణలో వైకల్యం తీవ్రత, శారీరక పరిస్థితి, సంబంధిత వైద్య ప్రమాణాలను సక్రమంగా పరిశీలించి అర్హత మేరకు శాతం నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే కొంతమంది దివ్యాంగులకు తగిన పరీక్షలు నిర్వహించకుండానే తక్కువ శాతం లేదా ‘ఫెయిల్’గా నమోదు చేయడంతో వారు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని బాధితులు చెబుతున్నారు.

**సరెండర్ ఆప్షన్‌తో కొత్త సమస్యలు :** గతంలో జారీ చేసిన సదరం ఫలితాల్లో వైకల్యం పెరిగిందని భావించిన వారు లేదా తమ వైద్య పరిస్థితికి అనుగుణంగా పునఃపరిశీలన అవసరమని భావించిన వారికి సరెండర్ చేసుకునే అవకాశం మీ సేవా వ్యవస్థలో అందుబాటులో ఉంది. దీంతో పలువురు దివ్యాంగులు గతంలో వచ్చిన ఫెయిల్/తక్కువ శాతం సదరం ఫలితాలను సరెండర్ చేసి, తిరిగి వైద్య పరీక్షలకు అవకాశం వస్తుందని ఆశతో దరఖాస్తు చేసుకున్నారు.

అయితే సరెండర్ అనంతరం సంబంధిత వైద్య అధికారులు త్వరితగతిన పరిశీలించి, అవసరమైన పునఃపరీక్ష లేదా తదుపరి సదరం క్యాంపు ప్రక్రియకు అనుసంధానం చేయాల్సి ఉన్నప్పటికీ నిర్మల్ జిల్లాలో ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు.

**కొత్త ఆపరేటర్‌తో మరింత గందరగోళం :** ఇటీవల నిర్మల్‌లో సదరం/సంబంధిత ఆన్‌లైన్ ప్రక్రియను నిర్వహించే కొత్త ఆపరేటర్ రావడంతో, వ్యవస్థపై పూర్తి అవగాహన లేకపోవడం వల్ల దివ్యాంగులు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపణలు ఉన్నాయి. సరెండర్ చేసిన దరఖాస్తుల స్థితి, తదుపరి క్యాంపు వివరాలు, పునఃపరీక్ష ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందకపోవడంతో బాధితులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు.



**పెన్షన్ దరఖాస్తుల సమయంలో సమస్య మరింత తీవ్రం :** గత నాలుగు సంవత్సరాలుగా పెన్షన్ దరఖాస్తులకు సంబంధించిన అవకాశాలు లేకపోవడంతో చాలామంది దివ్యాంగులు ఎదురుచూశారు. ఇటీవల పెన్షన్ దరఖాస్తులకు అవకాశం రావడంతో, అర్హత ఉన్నప్పటికీ గతంలో సదరం ఫలితాల్లో సమస్యలు ఎదుర్కొన్న పలువురు దివ్యాంగులు తమ సమస్య పరిష్కారమవుతుందనే ఆశతో సదరం సరెండర్ చేసుకుని పునఃపరీక్ష కోసం ముందుకు వచ్చారు. అయితే పెన్షన్ దరఖాస్తుల గడువు సమీపిస్తున్న సమయంలో సదరం ప్రక్రియలో జాప్యం జరగడంతో అర్హులైన దివ్యాంగులు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజా ఫిర్యాదు విభాగంలో పలుమార్లు ఫిర్యాదులు :** ఈ సమస్యలపై నిర్మల్ జిల్లా స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసాఖ్ అలీ పలుమార్లు ప్రజా ఫిర్యాదు విభాగంలో ఫిర్యాదులు చేసినప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని తెలిపారు.

సదరం సర్టిఫికెట్ల సమస్య కేవలం ఒక ఆన్‌లైన్ సమస్య కాదని, దాని ప్రభావం నేరుగా దివ్యాంగుల పెన్షన్, సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలపై పడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేకంగా సదరం పరిష్కార శిబిరం ఏర్పాటు చేయాలి. నిర్మల్ జిల్లాలో సదరం సమస్యలతో ఉన్న దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సదరం గ్రీవెన్స్/పరిష్కార శిబిరం నిర్వహించాలని దివ్యాంగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సరెండర్ చేసిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి, అర్హులైన వారికి వీలైనంత త్వరగా పునఃపరీక్షకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

అలాగే గతంలో ‘ఫెయిల్’ అయిన కేసుల్లో వైద్య పరిస్థితిని పూర్తిగా పరిశీలించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ల సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు. సదరం ప్రక్రియలో జాప్యం కారణంగా ఒక్క అర్హుడైన దివ్యాంగుడు కూడా పెన్షన్ లేదా ఇతర ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలను కోల్పోకుండా జిల్లా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఇసాఖ్ అలీ కోరారు.

# ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి





**-ఆర్టీసీ సంస్థను పరిరక్షించాలి**
**- ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు ఓటు వేయాలి**
**- ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య**

**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు ఆర్టీసీ సంస్థను పరిరక్షించి మరింత బలోపేతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. బుధవారం మంచిర్యాల ఆర్టీసీ డిపో గేట్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్‌కు గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు అండగా నిలవాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రత, వేతనాలు, సంక్షేమం కోసం నిబద్ధతతో పనిచేస్తున్న ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. అలాగే టీఎంయూ యూనియన్ నిచ్చెన గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా రకరకాల పార్టీల వైపు మారుతూ, స్వప్రయోజనాల కోసం పనిచేసే వారిని గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు ఓడించాలని అన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నిబద్ధతతో పనిచేసే సంఘాలకు మద్దతు ఇవ్వాలని సూచించారు. ఆర్టీసీ ప్రజా రవాణా వ్యవస్థలో కీలకమైన సంస్థ అని, దానిని ప్రైవేటీకరణ వైపు నెట్టకుండా బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం ద్వారా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు సంస్థను మరింత పటిష్టం చేయవచ్చని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తుకు ఓటు వేసి గెలిపించి కార్మిక ఐక్యతను చాటాలని వాసిరెడ్డి సీతారామయ్య కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, ఎస్.కే. బాజీ సైదా, కలిందర్ అలీ ఖాన్, జోగుల మల్లయ్య, లింగం రవి, సలేంద్ర సత్యనారాయణ, భీమనాదుని సుదర్శన్, దాగం మల్లేష్, ధోనికేన సమ్మయ్య, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షులు మామిడిపల్లి శ్రీనివాస్, డిపో అధ్యక్ష, కార్యదర్శులు రాజేశం, గోలి శంకర్, బొట్టు లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

**- వాస్తవ లాభాలు ప్రకటించి 36 శాతం లాభాల వాటా చెల్లించాలి**
**- లేకుంటే సింగరేణి భవన్, ప్రజాభవన్ ముట్టడిస్తాం**
**- టిబిజికేఎస్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మిర్యాల రాజిరెడ్డి, కేతిరెడ్డి సురేందర్‌రెడ్డ**



**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి) :** సింగరేణి కాలరీస్‌లో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల ఎన్నికల కాల పరిమితి ముగిసినందున వెంటనే ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికలు నిర్వహించే వరకు సింగరేణిలోని అన్ని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పించాలని కోరారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 గనిలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎల్‌సీ, సింగరేణి యాజమాన్యం జారీ చేసిన ఎన్నికల నియమావళి, సర్క్యులర్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఎన్నికల ముందు ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ప్రశ్నిస్తున్న తమ సంఘానికి సమాధానం చెప్పకుండా తమపై, బీఆర్ఎస్‌పై చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు అన్నింటినీ గమనిస్తున్నారని, సరైన సమయంలో స్పందిస్తారన్నారు. వాస్తవ లాభాలు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశించారు .2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను ఎందుకు ప్రకటించడం లేదని వారు ప్రశ్నించారు. దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో కార్మికుల తరపున గత రెండు రోజులుగా సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్పందించి వాస్తవ లాభాలను ప్రకటించడంతో పాటు వాటిలో 36 శాతం లాభాల వాటాను కార్మికులకు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్, ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సింగరేణిలో గతంలో ఏఐటీయూసీ గెలిచిన సమయంలో వారసత్వ ఉద్యోగాల విషయంలో తీసుకున్న నిర్ణయాలు, గోల్డెన్ సెకండ్ పేరుతో జరిగిన చర్యలపై వారు తీవ్ర విమర్శలు చేశారు. అలాగే ఎల్పీజీ విధానాలకు మద్దతు, సింగరేణిలో ప్రైవేటీకరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై జాతీయ కార్మిక సంఘాలను ప్రశ్నించారు. కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌లో ప్రైవేట్ సర్ఫేస్ మైనర్‌కు స్వాగతం పలికింది ఎవరని ప్రశ్నించారు. సింగరేణిలో స్కూల్ బస్సులు, జీపులు, అంబులెన్సులు, గనులపై క్యాంటీన్లను ప్రైవేటీకరించేందుకు గతంలో ఎవరి హయాంలో నిర్ణయాలు జరిగాయో చెప్పాలని డిమాండ్ చేశారు. 72 హక్కులు సాధించామని తెలిపారు . తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులకు సంబంధించిన పీఎంఈ, స్పోర్ట్స్ మస్టర్‌తో పాటు వృత్తి పన్ను రద్దు, మ్యాచింగ్ గ్రాంట్, తెలంగాణ ఇంక్రిమెంట్, జీతంలో ఒక శాతం ఎలక్ట్రికల్ చార్జీల రద్దు, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, ఏసీ సౌకర్యం, గృహ నిర్మాణానికి రూ.10 లక్షల వడ్డీ లేని రుణం, ఐఐటీ, ఐఐఎం వంటి ఉన్నత విద్యను అభ్యసించే కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు తదితర ప్రయోజనాలతో కలిపి 72 హక్కులను సాధించామని నాయకులు తెలిపారు. ఏఐటీయూసీ సమ్మె నోటీసు ఇచ్చి 24 డిమాండ్లు సాధించామని, తాము సంతకాలు చేశామని చెబుతున్నప్పటికీ ఆ ఒప్పందానికి సంబంధించిన 12(3) అగ్రిమెంట్‌ను కార్మిక వర్గానికి చూపించాలని డిమాండ్ చేశారు. తాము సంతకాలు చేసిన రోజే ఇద్దరు మైనింగ్ సూపర్‌వైజర్లకు మెడికల్ బోర్డు ద్వారా అండర్‌గ్రౌండ్ అన్‌ఫిట్, ఫిట్ ఫర్ జనరల్ అసిస్టెంట్‌గా యాజమాన్యం నిర్ణయం తీసుకుందని పేర్కొంటూ, ఇదేనా వారి అగ్రిమెంట్ అని ప్రశ్నించారు. గనుల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. గనులు, వివిధ విభాగాల్లో కనీస మౌలిక వసతులు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. రోజువారీగా కార్మికులు ఉపయోగించే పీపీఈ కిట్లు కూడా అందని పరిస్థితి ఉందని ఆరోపించారు. కోల్‌కట్టర్, టింబర్‌మెన్ ఉపయోగించే బిట్లు, రాడ్లు, లైన్‌మెన్ కీల్స్, సిమెంట్, రెజిన్ క్యాప్సూల్స్ వంటి అవసరమైన సామగ్రిని యాజమాన్యం సమకూర్చకపోతే ప్రశ్నించాల్సిన గుర్తింపు సంఘాలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామని చెప్పే సంఘాలు హక్కులు హరించబడుతున్న సమయంలో ఎందుకు స్పందించడం లేదని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నాయకులు ప్రశ్నించారు. రూ.60 వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. తమ సంఘానికి సింగరేణి కార్మికుల్లో పెరుగుతున్న ఆదరణను చూసి కొన్ని సంఘాలు చౌకబారు ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. వాటిని కార్మిక వర్గం గమనించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పోరాటాలకు ఆకర్షితులై ఆర్కే-7 గనిలో పనిచేస్తున్న వివిధ సంఘాలకు చెందిన 37 మంది కార్మికులు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘంలో చేరారు. వారికి ముఖ్య అతిథులు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జాయింట్ సెక్రటరీలు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేష్, సెంట్రల్ కార్యవర్గ సభ్యులు నీలం సదయ్య, శ్రీరాంపూర్ ఏరియా కార్యదర్శులు వెంగళ కుమార్‌స్వామి, తొంగల రమేష్, రామిడి మహేందర్‌రెడ్డి, ఫిట్ సెక్రటరీ బానోతు రాజునాయక్, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ పాదం శ్రీనివాస్, డివిజన్ నాయకులు చిలుకూరి జగదీష్, బిరుదు శ్రీనివాస్, రవీందర్, సుప్పరాజు, దుర్గం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయిలో మెరుస్తున్న నాగభూషణ విద్యాలయం విద్యార్థులు

**రాష్ట్ర స్థాయి యోగ పోటీలకు ఎంపికైన విద్యార్థులు**




**బాసర అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లా సోన్‌లో జరిగిన SGF జోనల్ స్థాయి యోగ పోటీలలో నాగభూషణ విద్యాలయం విద్యార్థులు జోనల్ స్థాయి యోగ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎం.చరణ్, ఎం.చంద్రతేజ్, సిఎచ్ అవంతి, ఎస్.సుశాంత్, ఎ.దీపక్, జి. మనీష్, డి.అవినాష్, బి.సాయి సిద్దిపేటలో జరిగే రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికైనట్లు యోగ కోచ్ మల్లేష్ తెలిపారు. విద్యార్థులను సర్పంచ్ వెంకటేష్ గౌడ్‌తో పాటు నాగభూషణ విద్యాలయం ప్రిన్సిపాల్ బాబురావు, పిటి నవీన్, రాజేశ్వర్ ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# రెండు విద్యుత్ సబ్ స్టేషన్లకు ఐదు కోట్ల 90 లక్షల రూపాయల నిధులు

**- ఎమ్మెల్యే రామరావ్ పటేల్**



**బాసర అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** నియోజకవర్గంలో రెండు విద్యుత్ సబ్ స్టేషన్ లకు ఐదు కోట్ల 90 లక్షల 18 వేల రూపాయల నిధులు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే రామరావ్ పటేల్ తెలియజేశారు.. లో వోల్టేజీ సమస్య వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో సమస్యను పరిష్కరించేందుకు ఈ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తానూరు మండలంలోని భామ్ని గ్రామంలో 33/ 11 కెవి సబ్ స్టేషన్ నిర్మాణానికి రెండు కోట్ల 87 లక్షల 98 వేలు నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. కుబీర్ మండలంలోని వాయి లింగి గ్రామంలో 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మూడు కోట్ల రెండు లక్షల 20వేల రూపాయలు నిధులు వెచ్చించడం జరిగిందన్నారు. సమస్యను గత నెల11 న సంబంధిత శాఖ మంత్రి కి విన్నవించడంతో వెంటనే నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల కు కృతజ్ఞతలు చెప్పారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.


CORPORATE OFFICE : WARANGAL
ABSTRACT
TGNPDCL/WGL - Proposal for erection of 33/11KV Substation at Wai Lingi (V) ... Kubeer (M) of Bhainsa Division of Operation Circle Nirmal - Administrative Approval and Technical Sanction under T&D - Orders issued
N.O.O (CE/Projects) Ms.No.609 Dt.06.10.2026
Read the following:
(1) N.O.O. Cs.Ms.No.461, Dt.07.01.2015
ORDER:
1. It is reported from the field that the consumers of Wai Lingi are getting more number of interruptions due to lengthy loaded feeders because of increasing in loads, day to day demand and loads are increasing day by day.
2. In view of the above, it is proposed for erection of 33/11KV Substation at Wai Lingi ...

## ఇరిగేషన్ భవన నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):
మఖ్తల్ పట్టణంలో రూ.4 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న ఇరిగేషన్ శాఖ భవన నిర్మాణానికి రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మత్స్య శాఖ క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి





బుధవారం భూమిపూజ చేశారు. అధికారులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కార్యాలయాలు, సిబ్బంది విధుల నిర్వహణకు మెరుగైన వసతులు కల్పించేందుకు నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మఖ్తల్ పట్టణంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలాల్లో గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించినట్లు మంత్రి తెలిపారు. గోదాముల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంకకు సూచించారు. అదేవిధంగా మక్తల్ పట్టణంలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి అవసరమైన మున్సిపల్ స్థలాన్ని కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి సూచించారు. మఖ్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. సాగునీరు, రహదారులు, విద్యుత్ తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.
ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస,జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, నీటి పారుదల శాఖ ఈ ఈ గోపాల చారీ, డీ ఈ ఈ లు సురేష్,మహేశ్, శివుడు, వెంకట రమణ, శేఖర్, ఏ.ఈలు , వార్డు కౌన్సిలర్, తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్

–సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి: కలెక్టర్ ప్రియాంక

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):
మఖ్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని పదో తరగతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. వారి విషయ పరిజ్ఞానం,చదువుపై ఆసక్తి, భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి







అనంతరం ఏం చదవాలని అనుకుంటున్నారని విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నించారు. డాక్టర్లు, ఇంజనీర్లు,పోలీసు అధికారులు కావాలనుకునే విద్యార్థులు ఎంతమంది ఉన్నారో తెలుసుకున్నారు. ఐఏఎస్ కావాలంటే ఏ విధంగా చదవాలి, సివిల్స్ పరీక్షల్లో ఎలాంటి అంశాలు ఉంటాయనే విషయాలను విద్యార్థులకు వివరించారు. సివిల్స్ పరీక్షల్లో ప్రాథమిక విషయ పరిజ్ఞానానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, 8, 9, 10వ తరగతుల్లో చదివే సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లోని ప్రాథమిక అంశాలపై అవగాహన అవసరమని కలెక్టర్ తెలిపారు. కేవలం బట్టీ పట్టి చదవడం కాకుండా విషయాన్ని అర్థం చేసుకుని చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. పోటీ పరీక్షల్లో లక్షలాది మంది పాల్గొన్నప్పటికీ తమ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇతరులు చదవడం లేదనే కారణంతో తాము చదువును నిర్లక్ష్యం చేయవద్దని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. చదువుతో పాటు ఆటలు ఆడాలని, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 5, 6వ తరగతి విద్యార్థులు రాస్తున్న ఎస్‌ఏ–1 పరీక్షను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాల వంటగదిని సందర్శించిన కలెక్టర్ కూరగాయల నిల్వలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ వివరాలను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను పరిశీలించి అక్కడ పాఠశాల యూనిఫాంలు, బెడ్‌షీట్లు నిల్వ ఉంచడంపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తహసిల్దార్ సతీష్ కుమార్, పాఠశాల హెచ్ ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 'దుష్ప్రచారాలతో నా వెంట్రుక కూడా పీకలేరు.. దమ్మంటే బహిరంగ చర్చకు రండి!'

- మూడేళ్లుగా ఆరోపణలు చేస్తున్నా ఆధారాలు చూపలేదన్న నిరంజన్‌రెడ్డి.. చట్టపరంగా ఎదుర్కొంటామని హెచ్చరిక
- పంపులు నడపక.. రైతులను అరిగోస పెడతారా?
- నార్లపూర్ పంపులు వెంటనే ప్రారంభించాలి.. లేకుంటే 12న వేలాది మంది రైతులతో ముట్టడి
- నీటి లభ్యత ఉన్నా పంటలకు అందించడంలో ప్రభుత్వ వైఫల్యం: మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, అక్టోబరు 7 (ప్రజాజ్యోతి):
కేఎల్ఐ పంపులను నిర్విరామంగా నడిపి, జూరాల నుంచి నీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జూరాలలో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఈ నెల 12వ తేదీలోగా నార్లపూర్ పంపులను ప్రారంభించకపోతే వేలాది మంది రైతులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. వనపర్తిలోని తన నివాసంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఎల్ఐ, జూరాల ఎడమ, కుడి కాలువలు, భీమా పరిధిలో ప్రస్తుతం సుమారు 6–7 లక్షల ఎకరాల్లో పంటలు సాగులో ఉన్నాయని నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. పంటలు తుది దశలో ఉన్న సమయంలో నీరు అత్యవసరమని, పంపులు సక్రమంగా నడపకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. కరెంటు కోతల కారణంగా పంపుల మోటార్లు, బేరింగ్లు, థ్రస్ట్ ప్యాడ్లు దెబ్బతింటున్నాయని, నిర్వహణ లోపాలే ఇందుకు కారణమని ఆరోపించారు. కేఎల్ఐలో నీటి లభ్యత ఉన్నప్పటికీ పంపులను ఎందుకు నడపడం లేదని ఆయన ప్రశ్నించారు. తాగునీటి అవసరాలకు కొంత నీటిని కేటాయించిన తర్వాత కూడా సాగునీటికి నీరు అందించే అవకాశం ఉందన్నారు. కేఎల్ఐలోని మూడు పంపులను నడిపితే పంటలను కాపాడటంతో పాటు చెరువులు, వాగులు నింపే అవకాశం ఉంటుందని తెలిపారు. నిపుణుల సూచనలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు.
తనపై వ్యక్తిగతంగా నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని నిరంజన్‌రెడ్డి మండిపడ్డారు. తన ఆస్తులన్నింటి వివరాలను బహిరంగంగా వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని



తెలిపారు. తన ఆస్తుల్లో ఒక్క అరగుంట భూమిని ఆక్రమించినట్లు అధికారులు, మీడియా సమక్షంలో నిరూపిస్తే ప్రభుత్వానికి తన ఆస్తి ఇస్తానని, తనపై చేస్తున్న ఆరోపణలు నిరూపించకపోతే ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని సవాల్ చేశారు. పానగల్‌లోని వ్యవసాయ క్షేత్రం తన కష్టార్జితమని, తనపై వందల ఎకరాల భూముల ఆక్రమణ ఆరోపణలు చేసినా ఇప్పటివరకు నిరూపించలేకపోయారని అన్నారు. 90 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించారంటూ చేసిన ఆరోపణలు చివరకు 19 గుంటలకు పరిమితమయ్యాయని పేర్కొన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనై అధికారులు తప్పుడు నివేదికలు ఇస్తే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.
మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు తమ కలెక్టర్లు, అధికారులను, రాష్ట్ర మీడియాను తీసుకుని బహిరంగ చర్చకు రావాలని నిరంజన్‌రెడ్డి సవాల్ చేశారు. తన భూములపై ఉన్న ఆరోపణలను ఆధారాలతో నిరూపించాలని కోరారు. తన వ్యవసాయ క్షేత్రంలోనే టెంట్లు వేసి చర్చకు ఏర్పాట్లు చేస్తానని, ముందస్తుగా సమాచారం ఇస్తే తానే భోజన ఏర్పాట్లు కూడా చేస్తానని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయంలో తనపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైతులకు విద్యుత్, సాగునీరు, యూరియా, రుణమాఫీ, రైతుభరోసా వంటి అంశాల్లో ఇబ్బందులు ఉన్నాయని, వాటిపై ప్రశ్నిస్తే తనపై దుష్ప్రచారం చేయడం చేతకానితనానికి నిదర్శనమని విమర్శించారు.
నార్లపూర్ పంపులను ఈ నెల 12లోగా ప్రారంభించి సాగునీరు అందించాలని నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే వేలాది మంది రైతులతో కలిసి ముట్టడి కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. రైతుల పంటలను కాపాడేందుకు నీటి నిర్వహణపై నిపుణుల సూచనలను అమలు చేయాలని కోరారు. సమావేశంలో గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, లక్ష్మారెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణానాయక్, మాణిక్యం, ఉగ్గమ్ తిరుమల్, వనం రాములు, రాళ్ల కృష్ణయ్య, గంధం పరంజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల తొలగింపుపై అఖిలపక్షాల ఆందోళన

– 45 వేల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది: శివసేనరెడ్డి

– ఓటు హక్కును కాపాడే వరకు ఉద్యమం కొనసాగిస్తాం

వనపర్తి, అక్టోబరు 7 (ప్రజాజ్యోతి):
ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇండియా కూటమి, అఖిలపక్ష పార్టీల నాయకులు హక్కుకు హామీ ఇస్తోందని, ఓటు హక్కు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని శివసేనరెడ్డి తెలిపారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా పరిశీలన జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడే







బుధవారం వనపర్తిలో ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి సమీకృత కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసి 'బీజేపీ హటావో.. దేశ్ బచావో' అంటూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు శివసేనరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీకి ఓటు వేయని వారి పేర్లను ఫామ్–6 పేరుతో ఓటర్ల జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గంలో సుమారు 2.75 లక్షల ఓట్లు ఉండగా.. 45 వేల ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని అన్నారు. బతికున్న అర్హులైన పౌరుల ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్–326 వయోజన ఓటు వరకు ఉద్యమం ఆగదన్నారు. అనంతరం సీఈసీ జ్ఞానేశ్వర్‌కుమార్, బీజేపీ నాయకుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎన్నికల వ్యవస్థలో మార్పులను అడ్డం పెట్టుకుని బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండేందుకు ప్రయత్నిస్తోందని అఖిలపక్ష నాయకులు ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం ఐక్యంగా పోరాడతామని ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి జయరాములు, తెలంగాణ జన సమితి జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, సీపీఎంఎల్ జిల్లా కార్యదర్శి అరుణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు తిరుపతయ్య, రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి రమేష్, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుఖ్‌దేవ్ భగత్ రాకతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం..!

ఆలంపూర్ అక్టోబర్ 7(ప్రజా జ్యోతి డివిజన్ ప్రతినిధి):
ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ నూతన ఇన్‌చార్జ్, ఎంపీ సుఖ్‌దేవ్ భగత్ జీ ఛత్తీస్‌గఢ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాయ్‌పూర్‌లోని స్వామి





వివేకానంద విమానాశ్రయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జ్ డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ,ఆరాష్ట్ర పీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సుఖ్‌దేవ్ భగత్ జీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ ఆత్మీయంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.ఏ. సంపత్ కుమార్ మాట్లాడుతూ సుఖ్‌దేవ్ భగత్ జీ ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనకు హృదయపూర్వక స్వాగతం పలికారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాటం చేస్తామని అన్నారు అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని డాక్టర్.ఎస్.ఏ.సంపత్ కుమార్ పిలుపునిచ్చారు అలాగే సుఖ్‌దేవ్ భగత్ జీ రాకతో ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది.

## కొల్హూర్ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి శ్రీహరి

మాగనూరు, ప్రజా జ్యోతి (అక్టోబర్ 07):
కొల్హూర్ గ్రామ సర్పంచ్ ముద్ద రాములు ఇటీవల మృతి చెందడంతో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి బుధవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముద్ద రాములు మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



## రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

–రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలి:మంత్రి వాకిటి శ్రీహరి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి):
రైతులు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్న దానిని వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో పండించే స్వల్పకాలిక మరియు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.



బుధవారం నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణ కేంద్రంలోని మఖ్తల్ సహాయక వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో మఖ్తల్ మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ నూనె గింజల పథకం (నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ – ఆయిల్‌సీడ్స్) ద్వారా రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడల యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని ఈ పథకం ద్వారా ఎంపిక చేసిన రైతులకు విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటిపోయే పరిస్థితి నెలకొంటున్నందున రైతులు నీటి ఎద్దడి, వాతావరణ మార్పులు కారణంగా కలిగే నష్టాల నివారణకు వరి మరియు పత్తి వంటి ప్రధాన పంటలకు బదులుగా తక్కువ నీటితో పండించే స్వల్పకాలిక మరియు లాభదాయకమైన ప్రత్యామ్నాయ పంటలు వేరుశనగ,పెసర్లు,మినుములు,అలసందలు వంటి నీటితో మంచి దిగుబడి ఇచ్చే పంటలను సాగు చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. ,నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు వ్యవసాయ రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి తెలిపారు. నూనె గింజల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి కోరారు.
అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మఖ్తల్ మండలాని 500 కింటాలు మంజూరయ్యాయని మండలంలో రైతు మిత్ర సభ్యత్వం ఉన్నవారిలో ఎంపిక చేసిన రైతులకు ఆరుతడి పంటలు సాగు చేసుకోవడానికి వేరుశనగ విత్తనాలను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చక్రి నాయక్,మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానసా హనుమంతు,మండల వ్యవసాయ అధికారి మిథున్ చక్రవర్తి,సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

★ అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

గద్వాల అక్టోబర్ 07(ప్రజా జ్యోతి ప్రతినిధి):
పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు



పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.పత్తి కొనుగోలులో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటు చేయనున్న పత్తి కొనుగోలు కేంద్రాల నిర్వహణపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు.గద్వాల నియోజకవర్గంలో రెండు, అలంపూర్ నియోజకవర్గంలో ఒక పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినప్పటికీ రైతులు ఎంతో కష్టపడి పత్తి పంటను సాగు చేస్తున్నారని,వారికి ఎలాంటి అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటాల్ పత్తికి రూ.8,667 మద్దతు ధర చెల్లించాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో ఎలాంటి మోసాలకు తావులేకుండా తూనికలు,కొలతల శాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.అగ్ని ప్రమాదాల నివారణకు పత్తి కొనుగోలు కేంద్రాలు,మిల్లుల్లో ఫైర్ సేఫ్టీ చర్యలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తరలించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా రవాణా,పోలీస్,విద్యుత్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు.ఇతర రాష్ట్రాల నుంచి పత్తిని జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు తరలించకుండా చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పత్తి తేమ శాతం,ధర,తూకాలు



తదితర అంశాలను సీసీఐ ప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు.కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు,అవకతవకలకు పాల్పడినా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సమావేశంలో అదనపు ఎస్పీ శంకర్,జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప,జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ,ఆర్డీవో రాధిక,జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అశోక్,సీసీఐ ప్రతినిధులు అనీషా,రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్..

## ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలి..





**పరకాల, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** బతుకమ్మ, దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పరకాల పట్టణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్ కుమార్ బుధవారం పరిశీలించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మ ఆడుకునే అంగడి మైదానం, బతుకమ్మలను నిమజ్జనం చేసే దామెర చెరువు వద్ద చేయాల్సిన ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా దసరా ఉత్సవాల సందర్భంగా బొడ్రాయి ప్రాంతం, గడి ప్రాంతం, రథాన్ని తీసుకెళ్లే చెన్నకేశవస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లపై మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను చైర్మన్ ఆదేశించారు. భక్తులు, మహిళలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నల్లెల్ల కుమార్, గూడెల్లి సదన్న, బండి శ్రీధర్, కొయ్యడా శ్రీనివాస్, పాలకుర్తి శ్రీను, సుదమల్ల రమేష్, అల్లె దశరథం, కుక్కల విజయ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రవణ్ కుమార్, ఏకు విద్యాసాగర్, పోరండ్ల వేణు, పసుల రమేష్, బొచ్చు సల్మాన్, గొడుగు నాగరాజు, బొచ్చు బాబురావు, ఆకుల శ్రీధర్, జాఫర్ రిజ్వి, టౌన్ ప్లానింగ్ అధికారి రాజకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యువత నీ పయనం ఎటు..



**నల్లబెల్లి అక్టోబర్ 07(ప్రజా జ్యోతి) :** క్రమశిక్షణకు మారుపేరుగా ఉండే పాఠశాలల్లో విద్యార్థుల హెయిర్ స్టైల్ పై, వారి నడవడికపై ఎన్నిసార్లు హెచ్చరించినా, వారిప్రవర్తనలో మార్పు రావడం లేదు. ఉపాధ్యాయులు చూస్తూ, ఏమిచేయలేని నిస్సహాయ స్థితిలో ఉంటున్నారు. తల్లిదండ్రులకు తమ పిల్లలపై శ్రద్ధ, నియంత్రణ లేకపోతే ఇలానే తయారవుతారు. క్రమశిక్షణ మాటలతో రాదు. కొద్దిపాటి దండన, భయభక్తులు ఉంటేనే వస్తుంది. పిల్లలకి బడిలో భయంలేదు. ఇంట్లో భయం లేదు. అందుచేతనే సమాజం ఈరోజు భయభ్రాంతులకి గురి అవుతున్నది. వాళ్ళే ఈ రోజుల్లో రౌడీలుగా తిరుగుతున్నారు. అభం శుభం తెలియని వాళ్ళని పొట్టన పెట్టుకుంటున్నారు. ఆ తర్వాత పోలీసు వారి చేతుల్లో పడి కోర్టులలో శిక్షలకి గురవుతున్నారు. గురువుని గౌరవించని సమాజం వినాశకాలానికి గురవుతుంది. ఇది నిజం. గురువంటే భయం లేదు మరియు గౌరవం లేదు. ఇక చదువు, సంస్కారం ఎట్లా వస్తుంది. కొట్టొద్దు!తిట్టొద్దు! బడికి రానివాడ్ని ఎందుకు రావట్లేవు అని అడగొద్దు! చదవాలని, హోమ్ వర్క్ అని, కొట్టినా తిట్టినా టీచర్లదే తప్పు

5వ తరగతి నుండే కటింగు స్టైలు, చినిగిన జీన్స్ గోడల మీద కూర్చోవడం. వెళ్ళే వారిని వచ్చే వారిని కామెంట్స్ చేయడం. అరేయ్ సార్ వస్తున్నారురా! అని అంటే, వస్తే రానియ్ అనే పరిస్తితి

దరిద్రం ఏంటంటే, కొంతమంది తల్లి దండ్రులే మావాడు చదవకున్నా ఏమి కాదు, మావాడిని మాత్రం కొట్టవద్దు అంటున్నారు.

ఇంకొక విషయం ఏమిటంటే ఎవరు బాబు నీకు కటింగ్ చేయించినది అంటే మా నాన్న సార్ అంటున్నారు.

పెన్ను ఉంటే పుస్తకం ఉండదు, పుస్తకం వుంటే పెన్ను వుండదు. కొనరు, తెచ్చుకోరు. భయం ఉండాలని రెండు దెబ్బలు వేద్దామంటే ఎటునుంచి పోయి ఎటువస్తాదో అని భయం.

ఇవన్నీ చూస్తుంటే పిల్లల కంటే సార్లకే భయం ఎక్కువగా వుంది. కొట్టకుండా, తిట్టకుండా, భయం లేకుండా చదువు వస్తుందా...

భయం లేని కోడి బజారులో గుడ్డు పెట్టిందంట!

అలానే ఉంది నేటి పిల్లల వ్యవహారం

స్కూల్లో తప్పుచేసినా కొట్టకూడదు, తిట్ట కూడదు, కనీసం మందలించ కూడదు ప్రేమతో చెప్పాలట.

ఇదెలా సాధ్యమ. మరి సమాజం ఎందుకు అలా చేయదు? మొదటి తప్పేకదా అని ఊరుకుంటుందా

మంచి నేర్పేవాళ్ళకి (స్కూల్లో) హక్కులుండవు. ప్రవర్తన మార్చుకో అని టీచర్ చిన్నప్పుడే కొడితే నేరం. వాడు పెద్దయ్యాక అదే తప్పు చేస్తే మరణం.

తల్లిదండ్రులకు నా మనవి. పిల్లల్లో మార్పు కేవలం ఉపాధ్యాయుల తోనే జరుగుతుంది. ఎక్కడో ఒకటో అరో ఒకరిద్దరు టీచర్లు చేసిన తప్పులకు, అందరి ఉపాధ్యాయులకు ఆపాదించవద్దు.

90 శాతం టీచర్లు పిల్లలు బాగుండాలనే వ్యవహరిస్తారు. ఇది యదార్థం. ఇకనైనా ప్రతీ చిన్న విషయానికి టీచర్లను నిందించవలదు.

మేము చదువుకునే రోజుల్లో కొంతమంది టీచర్లు మమ్మల్ని కొట్టేవారు.

అయినా ఏనాడు మా పేరెంట్స్ వచ్చి టీచర్లను నిలదీయలేదు. మా బాగు కోసమే అని అనుకునేవారు.

ముందుగా తల్లి దండ్రులు టీచర్ అంటే గౌరవం, భయం ఉండేటట్లు పిల్లలకు మానసిక తర్ఫీదు ఇవ్వాలని మనవి. తల్లి తండ్రులు ఒక్కసారి మీ పిల్లల భవిషత్ పై ఆలోచించండి..పిల్లలు చెడిపోవడానికి స్నేహితులు, ఫోన్లు, మీడియా 60 % , కానీ 40% మాత్రం తల్లి దండ్రులే..!

పిల్లల్ని గారాబం శృతిమించితే మొత్తానికే నష్టం వస్తుంది.. పిల్లల పట్ల మనం పాటిస్తున్న అజ్ఞానం, మూఢ నమ్మకాలు, స్వార్థం, అతి ప్రేమ వారిని చాలా వరకు బద్ధకస్తుల్ని చేస్తూ వారిని నాశనం చేస్తున్నారు. ఇప్పటి తరం 70% పిల్లలు..తల్లిదండ్రులు కారు, బండి శుభ్రం మంటే తుడవరు. మంచి నీళ్ళు, పాలు, కిరాణా సరుకుల కోసం బయటికి వెళ్ళమంటే వెళ్లరు.

లంచ్ బ్యాగ్‌లు, స్కూల్ బ్యాగులు శుభ్రం చేసుకోరు, కనీసం ఇంటి దగ్గర చిన్న చిన్న పనులలో సహాయం చేయరు.

రాత్రి 10 గంటలలోపు పడుకుని, ఉదయం 6 లేదా 7 గంటలలోపు నిద్ర లేవరు. గట్టిగా మాట్లాడితే ఎదురు తిరగబడి సమాధానం చెబుతారు. తిడితే వస్తువులను విసిరి కొడతారు. ఎప్పుడయినా దాచుకోమని డబ్బులు ఇస్తే మనకు తెలియకుండా ఐస్ క్రీమ్స్, కూల్ డ్రింక్స్ , నూడుల్స్, ఫ్రెండ్స్ కి పార్టీలు, ఫ్రెండ్స్ కోసం గిఫ్ట్ లు కొనుగోలు చేస్తున్నారు. మైనర్ పిల్లలకి బైక్లు ఇవ్వడం ,వారు ఆక్సిడెంట్లకు చేయడం కేసులలో ఇరుక్కోవడంఆడపిల్లలు అయితే తిన్న కంచం కూడా కడగటం లేదు.,ఇల్లు ఊడ్చమంటే కోపాలు వచ్చేస్తున్నాయి. అతిథులు వస్తే కనీసం గ్లాసెడు మంచి నీళ్ళు ఇవ్వాలన్న ఆలోచనలేని అమ్మాయిలు కూడా ఉన్నారు. 20 సంవత్సరాలు దాటినా చాలామంది ఆడపిల్లలకు వంట చేయడం రాదు.,బట్టలు పద్ధతిగా ఉండాలంటే ఎక్కడలేని కోపం వీరికి.

కల్చర్, ట్రెండ్, టెక్నాలజీ పేరిట వింత పోకడలు,వారిస్తే వెర్రి పనులు,మనమే పిల్లలచేత అవన్నీ చేయించడం లేదు. పై వాటికి కారణం మనమే. ఎందుకంటే మనకు అహం,పరువు మరియు ప్రతిష్టలు అడ్డొస్తున్నాయి.

చూసేవాళ్లకు మనం మంచి హోదాలో ఉండాలి. రిచ్ లుక్, స్టేటస్ మెయింటైన్ చేయాలి అని భ్రమలో ఉన్నాం.

గారాబంతో పెరిగిన వారు మధ్యలో మారమంటే మారడం అస్సలు జరగదు..వారిని కష్ట పెట్టమని కాదు ఇక్కడ చెప్పేది కష్టం గురించి తెలిసేలా పెంచండి. కష్టశీ, డబ్బు, సమయం, ఆరోగ్యం విలువ తెలియకపోతే.. వారికి జీవితం విలువ తెలియదు. ప్రేమతో, గారాబంగా మనం చేస్తున్న తప్పుల వలన కొందరు యువత 15 ఏళ్లకే ప్రేమ – దోమ అనటం, సిగరెట్స్, మందు, బెట్టింగ్, డ్రగ్స్, దొంగతనాలు, రేప్ లు, హత్యలు చేస్తున్నారు.

మరికొంతమంది సోమరిపోతులా తయారవుతున్నారు..అభినయాలు కనపడడం లేదు, అణకువగా ఉండటం రాదు, సంస్కృతి, సంప్రదాయాలు పట్టించుకోవడం లేదు. ఇలాగే ఉంటే కొంత కాలానికి తల్లి దండ్రులను గౌరవించే పద్ధతి కూడా లేకుండా పోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు..

భార్యకు వంట వండటం సరిగా రాదని నేటి యువత బిర్యానీలు, కర్రీ పాయింట్ల వెంట పడుతూ చిన్న వయసులోనే గ్యాస్టిక్ అల్సర్, గాల్ బ్లాడర్ స్టోన్స్, కిడ్నీ స్టోన్ ల బారిన పడుతున్నారు.

మరొక ఫ్యాషన్ ఏమిటంటే పెరుగు మజ్జిగ తీసుకుంటే వాంతులు చేసుకోవడం. కొన్ని ఆహార పదార్థాలు ఎంత ఆరోగ్యకరమైన కూడా వాళ్లకు అనవసరం.

కాలేజీ పిల్లలయితే సరిగ్గా ఒక పిడికిలి పట్టేంత టిఫిన్, లంచ్ చిన్న బాక్సు రైస్.. చాలామంది ఫ్రూట్స్ అసలు తినరు. గర్భవతులైన తరువాత వారి బాధలు వర్ణనా తీతం. టోటల్ మెడిసిన్ మీద డిపెండ్ అవడం, 100 లో 90 మంది సిజేరియన్ ద్వారా పిల్లల్ని కంటున్నారంటే వారి శారీరక పటుత్వం ఎంత పడిపోయిందో ఆలోచించండి. అలా ఉంటే పుట్టే పిల్లలు కూడాఏదో ఒక జన్యులోపంతో పుడుతున్నారు..

03వ తరగతి పిల్లాడికి సోడాబుడ్డి లాంటి కళ్ళద్దాలు. 05వ తరగతి వారికి అల్సర్, బీపీలు., 10వ తరగతి దాటేలోపు ఎన్నో ఆరోగ్య సమస్యలొస్తున్నాయి. వీటన్నికి కారణం మనం. మన పిల్లలను సరైన పద్ధతిలో పెంచక పోవడమే. అందుకే తల్లి దండ్రులు మారాలి.

రేపటి సమాజానికి ఏమి నేర్పుతున్నామో ఒక్కసారి ఆలోచన చేయండి. సంస్కృతి సాంప్రదాయం అంటే ఏమిటి...? : కేవలం గుడికి, దర్గాలకు వెళ్లి పూజలు, ప్రార్థనలు చేసి మన సంస్కృతి సాంప్రదాయం అని పిల్లలకు అలవాటు చేస్తున్నాము. అది మాత్రమే కాదు. సాంప్రదాయం అంటే అలా అనుకోవడం కొంత పొరపాటు.. పిల్లలకు.. బాధ్యత, మర్యాద, గౌరవం, కష్టం, నష్టంఓర్పు, సహనం, దాతృత్వం, ప్రేమ, అనురాగం, సహాయం, సహకారం, నాయకత్వం, మానసిక ధృఢత్వం, కుటుంబ బంధాలు, అనుబంధాలు దైవ భక్తి, దేశ భక్తికొంచెం కష్టమైనా సరే ఇవి తప్పక చిన్న వయసులోనే పిల్లలకు అలవాటు చేయాలి.. మంది కోసం బ్రతకద్దు మన ఆరోగ్యం, మన ఆనందం కోసం బ్రతుకుదాం. ఇవన్నీ అలవాటు అయితే ఆరోగ్యం, మానసిక పరిస్థితి, సామాజిక స్పృహ, ఉత్తమ జీవన విధానం వారికి అందించిన వారమవుతాం..భావితరాల పిల్లల కోసం, పిల్లలను మార్చే బాధ్యత మన అందరిపై కలదు.

# రాహుల్ గాంధీ అరెస్ట్‌పై కాంగ్రెస్ ఆందోళన

**– హనుమకొండలో భారీ నిరసన**

**– అమిత్ షా దిష్టిబొమ్మ దహనం..**

**– కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించిన డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి**





**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీల నిరసన సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండలో బుధవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నేతృత్వంలో డీసీసీ కార్యాలయం చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఇండియా కూటమి చేపట్టిన నిరసనను పోలీసులు అడ్డుకోవడం, రాహుల్ గాంధీతో పాటు కూటమి నేతలను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. సర్ ప్రక్రియ, ఓటర్ల జాబితాలపై ప్రతిపక్షం లేవనెత్తుతున్న అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, టీపీసీసీ నాయకులు, వివిధ కార్పొరేషన్ల జిల్లా చైర్మన్లు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల నాయకులు, మండల, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్హతే ప్రామాణికంగా మైనారిటీ మహిళలకు సంక్షేమ ఫలాలు..

**– స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి..**

**– కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది..**

**– 200 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ..**

**– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన 200 మంది అర్హులైన ముస్లిం మైనారిటీ మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ పేదలు, మహిళలు, రైతులు, కార్మికులు, మైనారిటీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు అర్హత ఆధారంగా సంక్షేమ పథకాలు అందేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

**55 మంది ఒంటరి మహిళలకు రూ.50 వేలు :** ఇందిరా మహిళా మైనారిటీ యోజన కింద వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 55 మంది ఒంటరి ముస్లిం మైనారిటీ మహిళలకు 100 శాతం సబ్సిడీతో ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే దూదేకుల, ఫకీర్ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు 100 శాతం రాయితీతో ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని మహిళలు స్వయం ఉపాధికి వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని నాయిని సూచించారు.

సంక్షేమ పథకాల ద్వారా అందుతున్న సహాయం తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఉపయోగపడే అవకాశంగా మలుచుకోవాలని కోరారు. మైనారిటీ వర్గాల సమస్యలు, అవసరాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా దరఖాస్తుల స్వీకరణ నుంచి లబ్ధిదారుల ఎంపిక వరకు అవసరమైన సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మైనారిటీ మత పెద్దలు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పాఠశాలలో వసతులను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్..

**– విద్యార్థులు సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి..**





**హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని వసతులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం పరిశీలించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, సీసీ కెమెరాల పనితీరు, కిచెన్ షెడ్, కిచెన్ గార్డెన్‌లో పెంచుతున్న మొక్కలు, పాఠశాల పైకప్పుపై ఏర్పాటు చేసిన సమావేశ ప్రదేశం, యోగా శిక్షణకు ఏర్పాటు చేసిన షెడ్‌ను పరిశీలించారు. ఆయా సదుపాయాలకు సంబంధించిన వివరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు కళాశాలకు క్రమం తప్పకుండా హాజరై, క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బి. శేషాద్రి, డీఈవో ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్ కుమార్, ఎంపీడీవో సుమన వాణి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కౌశల్ బోధతో విద్యార్థుల నైపుణ్యాలకు పదును



**హసన్‌పర్తి, అక్టోబరు 7 (ప్రజాజ్యోతి) :** విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, దానికి తగిన ప్రోత్సాహం అందించడమే కౌశల్ బోధ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. గిరిరాజ్ గౌడ్ అన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసంతో జీవించగలుగుతారని తెలిపారు.

హసన్‌పర్తి మండలంలోని స్కిల్ స్టార్స్ పాఠశాలలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కౌశల్ బోధ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్‌తో కలిసి శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలు, నైపుణ్యాలను నిశితంగా గమనించి గుర్తించాలని సూచించారు. గుర్తించిన నైపుణ్యాలను సరైన దిశలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలన్నారు. తద్వారా విద్యార్థుల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించగలమనే ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాలను గుర్తించడం, వాటిని మెరుగుపరచడం, భవిష్యత్తులో జీవనోపాధి అవకాశాలతో అనుసంధానం చేసేలా శిక్షణ ఇవ్వడం కౌశల్ బోధ కార్యక్రమ లక్ష్యమని డీఈఓ వివరించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ వారిలో దాగి ఉన్న సామర్థ్యాలను వెలికితీయాలని సూచించారు.

అనంతరం శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశంసాపత్రాలు, పాల్గొన్న ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# యాదవరెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**దేవరుప్పుల, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** అనారోగ్యంతో గుండెకు స్టంట్ వేయించుకుని కోలుకుంటున్న దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడెం మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బిల్లా యాదవరెడ్డిని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. బుధవారం హైదరాబాద్ మేడిపల్లిలోని యాదవరెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన..ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు తూచాతప్పకుండా పాటించాలని మనోధైర్యంతో ఉండాలని భరోసా కల్పించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్ రాంరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, బిల్లా వెంకటేశ్వర్ రెడ్డి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, కామారెడ్డిగూడెం సర్పంచ్ చింత రవి,యువజన నాయకులు ఇప్ప పృథ్వీరెడ్డి,కత్తుల ప్రదీప్‌రెడ్డి,మహేశ్వరం శేఖర్‌రెడ్డి,తాటిపెల్లి కుమార్,కంచర్ల హరీష్, పులి యాకస్వామి,చింత శ్రీరాం,బస్వ మల్లేష్, శ్రీకాంత్,వంగాల ఐల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా జ్యోతి యాత్రలో బీజేపీ శ్రేణుల సందడి

**బైక్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు**



**పరకాల, అక్టోబర్ 07, (ప్రజా జ్యోతి) :** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి యాత్ర-- బైక్ ర్యాలీ'లో పరకాల పట్టణ బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, యువత బైక్‌లపై హనుమకొండకు తరలివెళ్లి అంబేద్కర్ జంక్షన్ వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం అక్కడ వికసిత్ భారత్ యాత్రలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో పరకాల పట్టణ శ్రేణులు ఐక్యత, క్రమశిక్షణతో పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయమన్నారు. సేవా సంకల్పంతో ప్రజా సేవలో నిరంతరం పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆకుల లావణ్య శ్రీధర్, నాయకులు మిడిదొడ్డి నరేష్, సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, ఆకుల రాంబాబు, బాసాని సోమరాజు, ముత్యాల దేవేందర్, రేవంత్ సిద్దు, కక్కు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాంలో భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేయాలి

**– నెలవారీ తనిఖీలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు**



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవిఎంల) భద్రత విషయంలో ఎలాంటి అలసత్వానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ములుగు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బోర్ఖడే హేమంత్ సహదేవ రావు సంబంధిత అధికారులను, భద్రతా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని ఈవిఎం గోదాంను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ రావు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నెలవారీగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవీఎం గోదాం ప్రధాన ద్వారానికి ఏర్పాటు చేసిన సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, నిరంతర నిఘా వ్యవస్థ, విద్యుత్ సరఫరా, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించే పరికరాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు,అగ్ని ప్రమాదాలు లేదా ఇతర భద్రతాపరమైనసమస్యలు ఎదురైన సందర్భంలో అనుసరించాల్సిన విధి విధానాలపై సంబంధిత సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. గోదాంలో భద్రతా ప్రమాణాలు నిర్దేశిత నిబంధనల మేరకు అమలయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అనంతర ఈవిఎం గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా రిజిస్టర్లు, సందర్శకుల నమోదు పుస్తకాలు తదితర రికార్డులను పరిశీలించారు. గోదాంను సందర్శించే ప్రతి వ్యక్తి వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. భద్రతా సిబ్బంది విధుల నిర్వహణలోఅప్రమత్తంగా ఉండాలని, ఈవిఎంల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ డిప్యూటీ తహశీల్దార్ నితీష్ కుమార్,గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బంది, సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టును తీవ్రంగా ఖండించిన దైద రవీందర్



**నల్లగొండ అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేందుకు నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్ అంశాలపై ప్రశ్నించేందుకు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ నిష్పాక్షికంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని దైద రవీందర్ ఆరోపించారు. విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అరెస్టులకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని కొనసాగిస్తుందని దైద రవీందర్ స్పష్టం చేశారు.

## కరువు కోరల్లో చిక్కుకున్న రైతన్నలు



**ఆలేరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** రుతుపవనాలు బలహీనపడటం వలన నీటి లభ్యత తగ్గడం వల్ల వరి, కూరగాయలు, పత్తి వంటి ప్రధాన పంటల సాగు గణనీయముగా తగ్గిపోయింది. ఇఖరీఫ్ సీజన్లలో వరి, పత్తి పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోపోయినావి. ప్రస్తుతం పత్తి పంట ఒక ఎకరానికి 2 కింటల్స్ కంటే ఎక్కువ దిగుబడి వచ్చే పరిస్థితి లేదు.దీనివల్ల రైతులకు భారీ ఆర్థిక నష్ట వాటిల్లింది. కావున ప్రభుత్వం వెంటనే ప్రతి గ్రామములో పంటల సర్వే చేసి కరువు నివారణ ప్రణాళికలు చేసి ప్రకృతి వైపరీత్యాల క్రింద ఆలేరు మండలము లోని పత్తి పండించే ప్రతి రైతుకు ఎకరాకు 50 వేల రూపాయలు వెంటనే అందించి ఆదు కోవాలని, ఎల్. నో వా వలన ఆలేరు ప్రాంతములో పశుగ్రాసము కొరత తీవ్రముగా ఉంది.కావున పాడి రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే పశువులు కాబేలాలకు వెళ్లే ప్రమాదము ఉంది. కావున ప్రతి పాడి గేదకు దాణా నెలకు ఒక కింటల్ చెప్పున అందించి ఆదు కోవాలని కుండే సంపత్ కుమార్ ప్రభుత్వం ను డిమాండ్ చేసినారు.

## రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టును ఖండించిన ఇందనూరి శ్రీను



**నల్లగొండ అక్టోబర్ 7 (ప్రజాశక్తి ప్రతినిధి) :** శాలిగౌరారం,: ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ కార్యదర్శి ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపీలను అరెస్టు చేయడాన్ని శాలిగౌరారం మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇందనూరి శ్రీను తీవ్రంగా ఖండించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేందుకు నిరంకుశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు, ఈసీఐనెట్ సాఫ్ట్‌వేర్ అంశాలపై ప్రశ్నించేందుకు పార్లమెంట్ నుంచి ఎన్నికల కమిషన్ కార్యాలయం వైపు శాంతియుతంగా ర్యాలీగా వెళ్తున్న విపక్ష నేతలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు.

ప్రధాన ఎన్నికల కమిషనర్ నిష్పాక్షికంగా వ్యవహరించడంలో విఫలమయ్యారని, విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకే అరెస్టులకు పాల్పడ్డారని ఇందనూరి శ్రీను ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నాయకత్వంలో పోరాటాన్ని కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## 8వ వార్డులో కరెంటు స్థంబాలు ఏర్పాటు చెయ్యాలి

**- కౌన్సిలర్ శేక్ తాహెరా బబ్లు**



**భువనగిరి, అక్టోబర్ 7 (ప్రజాశక్తి ప్రతినిధి) :** సామాజిక తెలంగాణ భువనగిరి పట్టణం లోని స్థానిక కరెంట్ ఆఫీస్ లో గ్రీవెన్స్ డే సందర్భంగా,8వ వార్డు,సీతానగర్ ఎల్.టి లైన్ బదిలీ చేసి,వార్డు లో ఉన్న ఇతర విద్యుత్ సమస్యలను పరిష్కారం చేయాలని విద్యుత్ అధికారులకువినతి పత్రం అందజేసిన కౌన్సిలర్ శేక్ తాహేర బబ్లు అనంతరం వారు మాట్లాడుతు,సీతానగర్లో ఎలక్ట్రికల్ కండక్టర్ విత్ వైర్ (40 పోల్స్) కావల్సిఉందని అదేవిధంగా నీలగిరి టాకీస్ వద్ద లోవోల్టేజి సమస్య నిరవారణకు అదనంగా ఒక ట్రాన్స్ఫార్మర్ అవసరం ఉందని వార్డులో విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారని అధికారులకు వివరించారు. సానుకూలంగా స్పందించిన విద్యుత్ అధికారులు త్వరలో 8వ, వార్డు లో విద్యుత్ సమస్యలను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.ఈ కార్యక్రమం కో ఆప్షన్ మెంబెర్ సుజాయత్ అలీ కౌసర్ తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ చైర్మన్ ఉపేందర్ రెడ్డికి సన్మానం



**ఆలేరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ జనగాం ఉపేందర్ రెడ్డిని బుధవారం మోట కొండూరు మండలం చాకంపల్లి గ్రామ సర్పంచ్ వెలుపుల రజిత శ్రీరాములు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీఈవో వెంకటరెడ్డి, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కాటేపల్లి వద్ద కారు, బొలెరో ఢీ





**ఆలేరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలంలోని కాటేపల్లి వంతెన వద్ద బుధవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం జరిగింది. కాటేపల్లి నుంచి వస్తున్న కారు, ఆత్మకూరు వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు ధ్వంసం కాగా, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కారును ఆత్మకూరుకు చెందిన మజ్జిగ నరేష్ నడుపుతుండగా, బొలెరోను సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కృష్ణారెడ్డిపేటకు చెందిన ఎండీ సమద్ ఖురేషీ నడుపుతున్నట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## చిర బోయిన మల్లేష్ యాదవ్ కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన చిన్ననాటి మిత్రులు



**ఆలేరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని తెలంగాణ ఉద్యమ నాయకుడు మాజీ సర్పంచ్ కీర్తిశేషులు చిరబోయిన మల్లేష్ యాదవ్ చిన్ననాటి మిత్రులు ఆర్థిక సాయం అందించడం జరిగింది. ముందుగా కీర్తిశేషులు చిరబోయిన మల్లేష్ యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాయితీ జగదీశ్వర్ రెడ్డి, వగ్గు మురళీ కృష్ణ,మాట్లాడుతూ 1981- 82 బ్యాచ్ చిన్ననాటి నుంచి చదువుకొని మా మిత్రుడు పేద ప్రజల కోసం సర్పంచ్ గా ఎనలేని కృషి చేశారని వారు అన్నారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తాడని వారు పేర్కొన్నారు. ఈరోజు వారి కుటుంబానికి మాకు తోచినంత ఆర్థిక సాయం అందించామని ఇకముందు కూడా వారి కుటుంబాన్ని ఆర్థికంగా, సామాజికంగా, ఆదుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వగ్గు మురళీకృష్ణ, కాయితీ జగదీశ్వర్ రెడ్డి, పగడాల రాజేశ్వరరావు, కల్లూరి ప్రభాకర్ రెడ్డి, ఆకుల వెంకటేశ్వరరావు, రమాదేవి, అన్నపూర్ణ, ఉషారాణి, కేతోజ్ నరేందర్ చారి, ఆకుల చంద్రశేఖర్, వగ్గు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

### రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీల

# అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**డీసీసీ ప్రధాన కార్యదర్శి**



**భువనగిరి, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** సర్ ఓట్ల చోరీ చేసి గద్దెనెక్కిన,మోడీ యోగి అమిత్ శా లు మరియు వారికి సహకరించిన సీ ఈ సి ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్ రాజీనామా చేయాలని అదే విధంగా సర్ ప్రక్రియ ను పూర్తిగా రద్దు చేసి ఇదివరకే జరిగిన,అన్ని ఎన్నికలను తిరిగి నిర్వహించాలని శాంతియుతం గా ఇండియా కూటమితో కలిసి రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ ధర్నా నిర్వహిస్తుంటే పోలీసులు అడ్డుకొని, అక్రమ అరెస్ట్ చేయడం దారుణమని, యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ మజహర్ బీజేపీ ప్రభుత్వం పై మండి పడ్డారు. ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు,ప్రతి ఒక్కరికి ఉంటుందని కానీ ఈరోజు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించి,రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారని ఎన్నికల అధికారి జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు.బీజేపీ ఆర్ ఎస్ ఎస్ ఎన్నికల కమిషన్ ను కాపాడుతుందని,దేశ ప్రజాస్వా మ్యాన్ని కాపాడగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని బి ఆర్ ఎస్ బిజెపి పార్టీ రెండు ఒకటే అని బిజెపి తీసుకునే నిర్ణయాలను బి ఆర్ ఎస్ పార్టీ స్వాగతిస్తూ వస్తుందని ఈరోజు ఇంత పెద్ద ఎత్తున దేశంలో ఇండియా కూటమి ఉద్యమం చేపడుతుంటే కెసిఆర్ ఫామ్ హౌజ్ లో నిద్రపోతుందని రాబోయే రోజుల్లో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని బీజేపీ ఆర్ ఎస్ ఎస్ ను హెచ్చరించారు.

## 15 రోజుల్లో మున్సిపల్ బిల్డింగ్ పనులు ప్రారంభించాలి

**బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్**



**ఆలేరు అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున ఆలేరు మున్సిపల్ బిల్లింగ్ పనులు మాత్రం ప్రారంభించలేదని ఇటీవల స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ పది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని చెప్పిన ఇంతవరకు పనులు ప్రారంభించలేదని ఇప్పటికైనా 15 రోజుల్లో మున్సిపల్ బిల్డింగ్ పనులు ప్రారంభించకుంటే బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్ అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ కేంద్రం ముందు ప్రభుత్వం మంజూరు చేసిన నగర అభివృద్ధి నిధులు 15 కోట్లు ఎమ్మెల్యే మూడు సంవత్సరాలు అవుతున్న టెండర్లు ఖరారు చేయకుండా కాలయాపన చేస్తున్న క్రమంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో టియుఎఫ్ఐడీసీ 15 కోట్లు గతంలో 20 కోట్లు పనులు జరగా మిగిలిన మూడు కోట్ల 90 లక్షల రేవంత్ రెడ్డి ప్రభుత్వం 15 కోట్లు నిధులు మంజూరు చేసినప్పటికీ అప్పటివి ఇప్పటివి ఏవి కూడా పనులు జరగలేదన్నారు. 15 రోజుల్లో ప్రారంభించక పోతే గ్రామపంచాయతీ ప్లేస్లో పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పరమేశ్వర్ పార్టీ సెక్రెటరీ జనరల్ కుండే సంపత్, కౌన్సిలర్లు పాకాల మౌనిక హరీష్, కళ్యాణి మధు, శివ, మాజీ కౌన్సిలర్ రాములు శ్రీకాంత్ సీనియర్ నాయకులు నర్సింలు రవి రాజేష్ రామకృష్ణ ఉప్పలయ్య విజయలక్ష్మి వంశీ గోరెమియా మహేష్ హరికృష్ణ ఫయాజ్ వెంకటేష్ కృష్ణ శివ అరుణ సుజాత మల్లేష్ నర్సింగరావు గణేష్ గట్టు రాజు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## రేవంత్ రెడ్డి చంద్రబాబు అడుగుజాడల్లో నడుస్తున్నారు



**నల్లగొండ అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి ప్రతినిధి) :** కట్టంగూరు: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గురువుగా భావించే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నడుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆరోపించారు. బుధవారం నల్గొండ జిల్లా కట్టంగూరు మండల కేంద్రంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అనుచరులపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించిన లింగయ్య, అదే తరహా రాజకీయాలను తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రారంభించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యమంత్రిని ప్రశ్నించే బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేసి అణచివేయాలని చూస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి భూముల విషయంలో అక్రమాలకు పాల్పడుతున్నారని, డొల్ల కంపెనీల ద్వారా కోట్ల రూపాయలు కూడబెట్టుకుంటున్నారని లింగయ్య ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలకు తాము సమాధానం చెబుతున్నామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించాలని రైతులు, బీఆర్ఎస్ నాయకులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. గోదావరి జలాలను కాళేశ్వరం ద్వారా తరలించి చెరువులు, కుంటలు నింపకపోవడంతో పంటలకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వరి, పత్తి పంటలు ఎండిపోతున్నాయని, రైతులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఇప్పుడు బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చెబుతున్న అభివృద్ధి, రైతుల పరిస్థితికి పొంతన లేదని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సర్పంచ్‌లు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలు, చెరువులు, కుంటలను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సూచించారు.

రేవంత్ రెడ్డి కుటుంబంపై అక్రమ ఆస్తుల ఆరోపణలను ప్రజలకు వివరించే ప్రయత్నం చేసిన మన్నె కిశాంత్‌ను తలుపులు పగులగొట్టి అరెస్టు చేశారని లింగయ్య ఆరోపించారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ప్రభుత్వ భూముల వ్యవహారంలో కూడా ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో అక్కడి దళితులకు భూములు ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు సర్వేల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉన్న మంత్రులు శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు ప్రభుత్వం ఏ దిశగా వెళ్తుందో ఆలోచించి ముఖ్యమంత్రికి సూచనలు చేయాలని చిరుమర్తి లింగయ్య కోరారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం







**- చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ**

**- పోషకాహార లోపాన్ని సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోవాలి**

**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 07(ప్రజా జ్యోతి) :** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్లాంకెట్ హాల్‌లో తొమ్మిదో పోషణ మాసం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి,సకాలంలో అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పోషకాహార, ఆరోగ్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సీడీపీఓ సుబ్బలక్ష్మి, కౌన్సిలర్లు జహీర్, తాహెర్, అంజలి, వీరమ్మ, నాగమ్మ, కళావతి, జ్యోతి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు జూటు బ్యాగుల తయారీ శిక్షణ





**ఆలేరు అక్టోబర్ 7(ప్రజా జ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామంలో కెనరా బ్యాంకు యాదాద్రి భువనగిరి జిల్లా వారి ఆధ్వర్యంలో నడుస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉచితంగా మహిళలకు జూటు బ్యాగుల తయారీ శిక్షణ కార్యక్రమం జిల్లా వెటర్నరీ అనిమల్ హస్బెండరీ ఆఫీసర్ రమేష్ హాజరై మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్ల శోభన్ బాబు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి పరీక్షలు అభినందనీయం



**మునగాల అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి) :** మునగాల మండల పరిధిలోని నారాయణగూడెం గ్రామంలో అరుణ కంటి హాస్పిటల్ సూర్యాపేట వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు గ్రామపంచాయతీ లో ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి అతి తక్కువ ధరకు కంటి అద్దాలను ఇవ్వడం జరిగింది కంటి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని గుర్తించి ఆపరేషన్ చేయించుకోవాల్సిందిగా హాస్పిటల్ సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమం సర్పంచ్ కాంపాటి వెంకటేశ్వర్లు పంచాయతీ సెక్రెటరీ, అరుణ హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కల్లు దుకాణాల్లో అధిక ధరల వసూళ్లు

● కల్తీ కళ్ళు విక్రయాల జోరు ప్రజల బేజారు ● రైతులు, పేద ప్రజల ఆవేదన





**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) అక్టోబర్. 7** ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాలలో కల్తీకల్లు విక్రయాలు జోరందుకున్నాయి, కనివిని ఎరుగని రీతిలో ఇందల్వాయి మండలంలోని కల్తీ కళ్ళు వ్యాపారులు సిండికేట్ గా మరి కల్తీకలను అధిక ధరలకు విక్రయిస్తుంది. దీనిపై సంబంధిత ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇచ్చిన కనీసం స్పందించడం లేదని ఇందల్వాయి మండలానికి చెందిన కళ్ళు విక్రయాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇందల్వాయి మండల కేంద్రంలోని కల్లు దుకాణాల్లో అధిక ధరలకు కల్లు విక్రయిస్తున్నారంటూ రైతులు, పేద ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజంతా కష్టపడి వచ్చిన కూలీలు, రైతులు సేదతీరేందుకు కల్లు దుకాణాలకు వస్తుండగా, నిర్ణయించిన ధరల కంటే అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చెట్టు నుండి సేకరించిన కల్లును మాత్రమే విక్రయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టంగా పేర్కొన్నప్పటికీ సంబంధిత అధికారులు వ్యాపారుల ముడుపులకు ఆశపడి కల్తీకల్లు విక్రయాలకు సహకారం అందిస్తున్నారని ప్రజల ఆరోపిస్తున్నారు, జిల్లా ఎక్సైజ్ కమిషనర్ అవినీతి ఆరోపణ కేసులో జైలు జీవితం గడుపుతున్న దృశ్యం ప్రజలకు సుపరిచితమే, అయినా ఎక్సైజ్ కమిషనర్ స్థాయి నుండి ఎస్సై స్థాయి కానిస్టేబుల్ స్థాయి వరకు అవినీతి ఉచ్చులో మునిగి తేలుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు, రూ.10 ఉండాల్సిన సీసాను రూ.15కు విక్రయిస్తున్నారని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. కల్లు దుకాణాల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి పేద ప్రజలను దోచుకుంటున్నారని వారు ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వం రైతులు, పేద ప్రజల సంక్షేమానికి చర్యలు తీసుకుంటుంటే, మరోవైపు కల్లు దుకాణాల్లో అధిక ధరల వసూళ్లతో ప్రజలపై భారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు కల్లు దుకాణాలను తనిఖీ చేసి, అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతులు, పేద ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కల్లు దుకాణానికి తాళం

● ధర పెంపుపై గ్రామస్థుల ఆగ్రహం ● పాత ధరకే విక్రయించాలని డిమాండ్

**నస్రుల్లాబాద్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** కల్లు ధరను ఒక్కసారిగా పెంచడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు కల్లు దుకాణానికి తాళం వేసిన ఘటన కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ముందస్తు సమాచారం లేకుండా కల్లు సీసా ధరను రూ.10 నుంచి రూ.15కు పెంచడంపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ధర పెంపుపై గ్రామస్థులు దుకాణదారులను ప్రశ్నించినప్పటికీ సరైన సమాధానం రాకపోవడంతో వారంతా ఏకమయ్యారు. అనంతరం కల్లు దుకాణాన్ని మూసివేసి తాళం వేశారు. గతంలో ఉన్న రూ.10 ధరకు కల్లు విక్రయించాలని, ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ధరలు పెంచడం సరికాదని గ్రామస్థులు డిమాండ్ చేశారు.ఇదిలా ఉండగా, బీర్కూర్ మండలంలోని మరో గ్రామంలోనూ కల్లు ధర పెంచడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన కొన్ని రోజుల క్రితం చోటుచేసుకుంది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వరుసగా కల్లు ధరలు పెంచుతుండటంపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# బీబీపేట్ పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 07(ప్రజా జ్యోతి)**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ కామారెడ్డి నియోజకవర్గంలోని బీబీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. నూతన చైర్మన్‌గా సుతారి రమేష్ ప్రమాణ స్వీకారం చేయగా, పాలకవర్గ సభ్యులు కూడా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం చైర్మన్‌తో పాటు నూతన పాలకవర్గ సభ్యులను షబ్బీర్ అలీ అభినందించారు.

**రైతులకు అండగా పనిచేయాలి...!**

ఈ సందర్భంగా మహమ్మద్ అలీ షబ్బీర్



మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడితేనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.రైతులకు పంట రుణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా పాక్స్ సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. సహకార సంఘాలు కేవలం రుణాల పంపిణీకి మాత్రమే పరిమితం కాకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలను



అందించే కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, పంట రుణమాఫీ, ఉచిత విద్యుత్, రైతు బీమా, సాగునీటి వనరుల అభివృద్ధి



తదితర కార్యక్రమాలను అమలు చేస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీబీపేట్ నూతన చైర్మన్ సుతారి రమేష్ ని అభినందించి,రైతులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. ఎలాంటి రాజకీయ భేదాలు లేకుండా ప్రతి రైతుకు సమానంగా సేవలందిస్తూ మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇల్యాస్, జిల్లా గ్రంధాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, బీబీపేట్ సర్పంచ్ సాత్విక సాయి, బీబీపేట్ మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మాజీ డి సి ఎం ఎస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, సొసైటీ చైర్మన్లు ఇంద్రకరణ్ రెడ్డి, గూడెం శ్రీనివాస్, భీంరెడ్డి, సుధాకర్, అనంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు బాలరాజు, మాజీ జడ్పీటీసీ తీర్మాల్ గౌడ్, నరేందర్ రెడ్డి, ఆశబోయిన శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సందీప్, నాయకులు భారత్, టీంకు, డేవిడ్, అనిరుద్, భూమాగౌడ్, మధు యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేష్, ప్రదీప్ మహిళలు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు

## నల్లవెల్లి గ్రామ
# వీఆర్ఏ నీరెడ్డి సాయిలు మృతి

**ఇందల్వాయి (ప్రజాజ్యోతి)అక్టోబర్.7** ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ నీరెడ్డి సాయిలు బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతికి మండల వీఆర్ఏ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల అధ్యక్షుడు బాలగంగారం బాల నారాయణ, చరణ్ రవి, చెక్ పవర్ బాలగంగారం, అనిత తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# ఈవీఎం గోదామును పరిశీలన

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి)** కామారెడ్డి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్రపరిచిన ఈవీఎం గోదాము వద్ద పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కామారెడ్డి జిల్లాలోని ఈవీఎం గోదామును నెలవారీ తనిఖీలో భాగంగా ఎన్నికల విభాగం అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాము వద్ద పోలీసు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పటిష్టమైన బందోబస్తు కొనసాగించాలని సూచించారు. గోదాము పరిసరాలను 24 గంటల పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని, భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.వై. గిరి, తహసీల్దార్ హిమబిందు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రాజేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వడ్డేపల్లి సబ్‌స్టేషన్ ముందర కరెంట్ కోతలపై రైతుల ఆగ్రహం

● సబ్‌స్టేషన్ ముట్టడి



**హత్నూర అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** హత్నూర మండల పరిధిలో ని వడ్డేపల్లి సబస్టేషన్ కేంద్రంలో విద్యుత్ కోతలు, లోవోల్టేజీ సమస్యలపై చింతల్చెరువు కోణంపేట రైతులు బుధవారం నాడు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ సబ్ స్టేషన్ ముందు నిరసన తెలిపారు.వ్యవసాయ మోటార్లకు తరచూ లోవోల్టేజీ రావడంతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ కోతల కారణంగా పంటలకు నీరందక ఎండిపోతూ ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.సమాచారం అందుకున్న విద్యుత్ అధికారి ఏ డి శ్రీనివాసు పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి సబ్‌స్టేషన్‌కు చేరుకుని రైతులకు నచ్చజెప్పి పంటలు కోసే వరకు కరెంటు కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చి నచ్చజెప్పారు.దీంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ ఆందోళనలలో కార్యక్రమంలో విద్యుత్ ఏఈ ఇంచార్జి రాఘవులు విద్యుత్ లైన్మెన్ జగదీష్ విద్యుత్ సిబ్బంది పోలీస్ సిబ్బంది రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## హుండీ దొంగతనం కేసు
# ఛేదించిన సదాశివపేట పోలీసులు

● సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో నిందితుడి అరెస్ట్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో ఇటీవల జరిగిన ఆలయ హుండీ దొంగతనం కేసును పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ఈ నెల 3వ తేదీన సదాశివపేట పట్టణంలోని గురునగర్ కాలనీలో ఉన్న భవాని మాత ఆలయంలోకి పగటిపూట చొరబడిన ఓ దుండగుడు హుండీని పగలగొట్టి నగదును అపహరించాడు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివపేట పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు.సీఐ డి.వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి, సీసీటీవీ ఫుటేజ్ మరియు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేశారు. సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని మల్కాపూర్ గ్రామానికి చెందిన మల్లేపల్లి శ్రీనివాస్ (29)గా పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని, అతడి వద్ద నుంచి దొంగిలించిన నగదును స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల



విచారణలో శ్రీనివాస్ మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసై జల్సాల కోసం దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. గతంలో కూడా సదాశివపేట పరిధిలోని రెండు దేవాలయాల్లో హుండీలను దొంగిలించిన కేసుల్లో ఇతడు జైలుకు వెళ్లొచ్చినట్లు పోలీసులు తెలిపారు.నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ డి.వెంకటేష్ తెలిపారు. సీసీటీవీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలతో వేగంగా కేసును ఛేదించిన పోలీసులను పలువురు అభినందించారు.

# రెండు విడతల డీఏ మంజూరు

● ప్రభుత్వ నిర్ణయంపై టీఎస్‌యూటీఎఫ్ హర్షం



**నారాయణఖేడ్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు రెండు విడతల కరువు భత్యం (డీఏ) పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కంబాపురం అశోక్, ప్రధాన కార్యదర్శి బి. సాయిలు హర్షం వ్యక్తం చేశారు. టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాలు చేపట్టిన పోరాట ఫలితంగానే రెండు డీఏలకు సంబంధించిన ఉత్తర్వులు విడుదలయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల సంఖ్య 128, తేదీ 6 అక్టోబర్ 2026 ప్రకారం 01 జనవరి 2024 నుంచి డీఏను ప్రాథమిక వేతనంలో 33.67 శాతం నుంచి 37.31 శాతానికి పెంచిందని తెలిపారు. అలాగే ఉత్తర్వుల సంఖ్య 130, తేదీ 6 అక్టోబర్ 2026 ప్రకారం 01 జులై 2024 నుంచి డీఏను 37.31 శాతం నుంచి 40.04 శాతానికి పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. పెంచిన డీఏను అక్టోబర్ 2026 వేతనంతో కలిపి నవంబర్ 1, 2026న ఉద్యోగులకు చెల్లించనున్నట్లు తెలిపారు. పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) కింద ఉన్న ఉద్యోగులకు డీఏ బకాయిలను జీపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నారని, సీపీఎస్ ఉద్యోగులకు సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్లు వెల్లడించారు. రెండు విడతల డీఏ మంజూరుకు సంబంధించిన ఉత్తర్వులు విడుదల కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన వారు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీజీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటానికి ఇది ఫలితమని పేర్కొన్నారు. అయితే జూలై 2023 నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఇతర పెండింగ్ సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# రీసర్వే రికార్డులపై రైతుల దృష్టి సారించాలి



**వట్టిపల్లి అక్టోబర్, 7 ప్రజా జ్యోతి** వట్పల్లి మండలం షాహెద్నగర్ (ఘట్పల్లి) గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన పునఃసర్వే (రీ–సర్వే)కు సంబంధించిన భూ రికార్డులను గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రచురిం చినట్లు తహసీల్దార్ జంగేశ్వర్ తెలిపారు. రీసర్వే ద్వారా రూపొందిం చిన రికార్డులను భూ పట్టాదారులు, రైతులు పరిశీలించేం దుకు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. రీసర్వేలో రూపొందించిన భూ రికార్డుల్లో తమ భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, పట్టాదారు వివరాలు, హక్కులకు సంబంధించిన అంశాలను రైతులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని తహసీ ల్దార్ సూచించారు. రికార్డుల్లో ఏవైనా తప్పులు, పొరపాట్లు లేదా హక్కులకు సంబంధించి అభ్యంతరాలు ఉంటే అధికా రుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు సంబంధిత క్లెయిమ్లు, అభ్యంతరాలను సమర్పించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా అభ్యంత రాలను తెలియ జేస్తే వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. రైతులు తమ భూ ములకు సంబం ధించిన రీసర్వే రికార్డులను తప్పనిసరిగా పరి శీలించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా అధికారులకు తెలియజేయాలని తహసీల్దార్ జంగేశ్వర్ కోరారు.

## మిషన్ భగీరథ కార్మికుడి
# కుటుంబానికి ఆర్థిక చేయూత



**రాయికోడ్ అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మిషన్ భగీరథ కార్మికుడు కుస్నూర్ గ్రామానికి చెందిన విశ్వనాథ్ కుటుంబానికి తోటి ఉద్యోగులు ఆర్థిక సహాయం అందించారు.మిషన్ భగీరథ సిబ్బంది తమ వంతుగా రూ.36 వేల నగదును సేకరించి విశ్వనాథ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తోటి ఉద్యోగులు మాట్లాడుతూ.. విశ్వనాథ్ మృతి తమను తీవ్రంగా కలచివేసిందని,ఆయన కుటుంబానికి తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ ఆర్థిక సాయం చేసినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

## బండారి మహిపాల్‌కు
# శాలువాతో ఘనంగా సన్మానం



**మునిపల్లి అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుసరెడ్డిపల్లి గ్రామ యువకుడు బండారి మైపాల్ ఉన్నత చదువుల చదువుకొని స్వతహాగా వ్యాపారాన్ని ప్రారంభించి మరికొంతమంది యువకులకు ఉపాధి కల్పిస్తూ రాష్ట్రస్థాయి ఉత్తమ ఫిలిం మేకర్ అవార్డు అందుకున్నాడు. రామచంద్రాపురం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పమ్మ బీరంగూడ లోని శ్రీ కన్వెన్షన్ హాల్లో బండారి మహిపాల్ కు శాలువాతో ఘనంగా సన్మానించారు. పుష్పమ్మ మాట్లాడుతూ యువత వృత్తి విద్యలో ఆధునిక పద్ధతులకు అనుగుణంగా తన నైపుణ్యతను మెరుగుపరచుకొని అన్ని రంగాల్లో రాణించాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపల్లి పాండు, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షులు గూడెపు మల్లయ్య కురుమ, సంగారెడ్డి జిల్లా బీసీ యువత అధ్యక్షుడు గోరుగంటి రమేష్, కురుమ సంఘం జిల్లా నాయకులు తాటిపల్లి అంబన్న కురుమ, గడ్డమీది సత్యనారాయణ కురుమ బండారి పాండు కురుమ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం
# పీఎం శ్రీ పాఠశాలలో అల్పాహార కార్యక్రమం ప్రారంభం

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) అక్టోబర్ 07:** తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చేపట్టిన విద్యార్థుల అల్పాహార కార్యక్రమాన్ని వెల్దుర్తి పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి పాఠశాల సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యం





మెరుగుపడటంతో పాటు పాఠశాలలో ఏకాగ్రతతో చదువుకునే సామర్థ్యం పెరుగుతుందని వారు తెలిపారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండటంతో పాటు విద్యలో మంచి ప్రతిభ కనబరచాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండం ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రావణ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధురి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# తుక్కాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**కొల్చారం, అక్టోబర్ 07( ప్రజా జ్యోతి)** మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో బుధవారం గ్రామపంచాయతీ ఆవరణలో తుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో సింధు హాస్పిటల్ హైటెక్ సిటీ హైదరాబాద్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ఆంజనేయులు ప్రారంభించారు. సింధు హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ పర్యవేక్షణలో గైకాలజిస్ట్, కార్డియాలజిస్ట్, బిపి, షుగర్ , గుండె, క్యాన్సర్ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం పరీక్ష చేయించుకున్న వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఆంజనేయులు తో పాటు గ్రామంలోని సుమారు 134 మంది పరీక్షలు చేయించుకున్నారని మార్కెటింగ్ మేనేజర్ తెలిపారు. మెరుగైన చికిత్స





అవసరమైన వారిని సింధు హాస్పిటల్ కు రిఫేర్ చేశారు. సింధు ఆసుపత్రి చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి ఆధ్వర్యంలో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సింధు ఆసుపత్రిలో ఉచిత వైద్యం అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఉచిత వైద్య శిబిరం విజయవంతం చేసినందుకు సింధు హాస్పిటల్ వైద్య సిబ్బందికి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరె రవీందర్, పంచాయతీ వార్ సభ్యులు గ్రామ ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# వెలికట్ట కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నిక

**కొండపాక, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** కొండపాక మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వెలికట్ట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అమ్ముల కిషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంచాల కనకారాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, అనంతుల నరేందర్, జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వాసరి లింగారావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రైతుల కోసం రైతు భరోసా తదితర పథకాలు అమలు చేస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ



కార్యక్రమాలను ప్రతి గ్రామంలో ప్రజలకు వివరించేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గజవెల్లి సుదర్శన్, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ కొయ్యడ వెంకటేశం, పావని శశిధర్ రెడ్డి, వెలికట్ట సర్పంచ్ మానస సురేందర్, బొమ్మ మల్లయ్య, కొలుపుల గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్ పెరుగు తిరుపతి, చుక్క యాదయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మంచాల శ్రీనివాస్, మండల కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సిద్దులు, మర్పడగ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, జంజీరపు నర్సింలు, నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధికి సార్ధకత.. కుంటలకు పునర్జీవం

● ఉపాధి హామీ కూలీల శ్రమతో తిమ్మారెడ్డిపల్లి కుంటలకు జలకళ




**కొండపాక అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** –ఉపాధి హామీ పథకం కేవలం కూలీలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాల అభివృద్ధికి బాటలు వేస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాల్లోని ఊర చెరువులు, కుంటలను పునరుద్ధరించే పనులు చేపట్టడంతో కొండపాక మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు శ్రమదానం చేస్తున్నారు.స్థానిక సర్పంచ్ కొయ్యడ వెంకటేశం ఆధ్వర్యంలో కూలీలు కుంటల పూడికతీత, మట్టి తొలగింపు తదితర పనులు చేపట్టారు. కూలీల శ్రమతో కుంటలు రూపురేఖలు మార్చుకుని, ఇటీవల కురిసిన వర్షాలకు నీటితో కళకళలాడుతున్నాయి. దీంతో భూగర్భజలాలు పెరగడంతో పాటు పశువులు, రైతులకు నీటి లభ్యత మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధి పొందుతూ.. గ్రామానికి ఉపయోగపడే పనులు చేపట్టడం పట్ల కూలీలు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# ఆర్అండ్‌బీ అధికారులు.. ఈ గుంతలు పూడ్చేది ఎప్పుడు..?

● చిన్న ఘనపూర్ నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి చౌరస్తా వరకు అధ్వానంగా రహదారి

● ప్రయాణికులు, వాహన చోదకులకు తీవ్ర ఇబ్బందులు.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్

**కొల్చారం, అక్టోబర్ 07( ప్రజా జ్యోతి )** మెదక్–-సంగారెడ్డి ప్రధాన రహదారి రోజురోజుకూ అధ్వానంగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొల్చారం మండల పరిధిలోని చిన్న ఘనపూర్ గ్రామ శివారు నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి చౌరస్తా వరకు రహదారి అనేక చోట్ల గుంతలు గుంతలుగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఈ మార్గంలో పెద్ద సంఖ్యలో బస్సులు, లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే రహదారిపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాలను సురక్షితంగా నడపడం కష్టంగా మారిందని వాహన చోదకులు చెబుతున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు పక్కకు మళ్లడం, ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించుకోవడం ఇబ్బందిగా మారుతోందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు గుంతల కారణంగా ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం



చేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో అవి కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని చెబుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోందని పేర్కొన్నారు. రహదారి గుంతలమయంగా మారడంతో వాహనాల వేగం తగ్గిపోవడంతో పాటు ప్రయాణ సమయం కూడా పెరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు. గుంతల కారణంగా వాహనాల టైర్లు, ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ రహదారిపై ప్రయాణించే వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. చిన్న ఘనపూర్ గ్రామ శివారు నుంచి రంగంపేట, సంగాయిపేట, పోతాంశెట్టిపల్లి



చౌరస్తా వరకు ఉన్న రహదారిని సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే పరిశీలించి మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. కేవలం తాత్కాలికంగా గుంతలను పూడ్చడం కాకుండా రహదారిని పూర్తిస్థాయిలో పరిశీలించి అవసరమైన చోట నాణ్యమైన మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణించే ప్రధాన రహదారి కావడంతో అధికారులు ఇకనైనా స్పందించి రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. "ఆర్అండ్‌బీ అధికారులు.. ఈ గుంతలు పూడ్చేది ఎప్పుడు?" అంటూ ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

# బొడ్డెమ్మలతో సందడి.. పల్లెల్లో పండుగ సందడాయె!

● ఆడపడుచుల ఆటపాటలతో మార్మోగుతున్న పల్లెలు ● బతుకమ్మకు ముందే తెలంగాణ పల్లెబాటలో పండుగ శోభ

**కొండపాక, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:** తెలంగాణ పల్లెల్లో పండుగ సందడి మొదలైంది. ఆడపడుచుల ఆటపాటలు, పూల పరిమళాలతో పల్లె వాతావరణం కొత్త కళను సంతరించుకుంటోంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బొడ్డెమ్మ, బతుకమ్మ, పెద్ద రామాస, దసరా పండుగలను ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. పండుగల పరంపరలో ముందుగా బొడ్డెమ్మను కొలుచుకోవడం





ఆనవాయితీగా వస్తోంది. ఇంటి ఆడపడుచులంతా ఒక్కచోట చేరి బొడ్డెమ్మను ఏర్పాటు చేసి, పసుపు కుంకుమలతో పూజలు చేస్తారు. అనంతరం బొడ్డెమ్మ చుట్టూ తిరుగుతూ సంప్రదాయ పాటలు పాడుతూ ఆటలు ఆడుతుంటే పల్లె వాకిళ్లు సందడిగా మారిపోతాయి.

**ఆటపాటలతో ఆడపడుచుల సందడి**

సాయంత్రం కాగానే పనులన్నీ ముగించుకుని ఆడపడుచులు ఒక్కచోట చేరుతారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఉత్సాహంగా పాల్గొంటారు. ఒకరి పాటకు మరొకరు గొంతు కలుపుతూ, చప్పట్లు కొడుతూ బొడ్డెమ్మ ఆడే దృశ్యాలు పల్లె సంస్కృతిని కళ్లకు కట్టినట్టు చూపిస్తాయి. ఎక్కడ చూసినా నవ్వులు, పాటలు, ఆటలతో పండుగ వాతావరణం కనిపిస్తోంది.

**తరతరాలుగా వస్తున్న సంప్రదాయం**

బొడ్డెమ్మ కేవలం పండుగ మాత్రమే కాదు.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, కుటుంబ అనుబంధాలకు, పల్లె సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. పెద్దలు పాటలు పాడుతుంటే చిన్నారులు వాటిని నేర్చుకుంటూ ఈ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. మారుతున్న కాలంలోనూ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో కొనసాగించడం విశేషం. బొడ్డెమ్మతో మొదలయ్యే ఈ పండుగల సందడి..




బతుకమ్మ, పెద్ద రామాస, దసరా వరకు కొనసాగనుంది. దీంతో తెలంగాణ పల్లెల్లో పూల పరిమళం.. పాటల మాధుర్యం.. ఆడపడుచుల ఆటపాటలతో పండుగ శోభ వెల్లివిరుస్తోంది.

# అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు..!

● ఆటో స్వాధీనం, అధికారులకు అప్పగింత ● మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్

**దుబ్బాక ప్రతినిధి, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందే, కానీ కొంతమంది దళారులు వాటిని అదును చేసుకుని వ్యాపారం కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డు లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల సన్న బియ్యం అందించడంతో, ఇది అదనుగా భావించి అక్రమ దారిలో డబ్బు సంపాదించాలని కొంతమంది దళారులు ఇంటింటికి తిరుగుతూ రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఎక్కువ రేటుకు రైసు మిల్లర్లకు అందించడం జరుగుతుందని మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్ అన్నారు. బుధవారం రోజున దుబ్బాక నుండి చీకోడు రోడ్డు మార్గంలో వెళ్తున్న ఆటోలో ప్రభుత్వం అందించిన రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా దుబ్బాక మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్ పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పజేయడం



జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... నిరుపేదలందరికీ సన్నబియ్యం అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించిందని, కానీ కొంతమంది రైస్ మిల్లర్ నిరుపేదల వద్ద దళారులచే రేషన్ బియ్యం కొనుగోలు చేసి మళ్లీ వాటిని ప్రభుత్వానికి అందించినట్లు తెలిసింది అన్నారు. ఇప్పటికైనా అధికారులు రేషన్



బియ్యంను అక్రమంగా తరలిస్తున్న వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అంతేకాకుండా గతంలో కూడా ఇలా జరిగితే అధికారులు చెప్పిన పట్టించుకోకుండా పోయారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు అందిస్తున్న సన్నబియ్యాన్ని పక్క దారిన పోకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు.

## షాపింగ్ కాంప్లెక్స్ బకాయిలు
# చెల్లించకపోవడంతో దుకాణానికి తాళం

● గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ తాళం పగలగొట్టి దుకాణం తెరిచిన యజమాని

**దౌల్తాబాద్,అక్టోబర్. 07 ( ప్రజా జ్యోతి )** షాపింగ్ కాంప్లెక్స్ వంకాయలు చెల్లించకపోవడంతో దుకాణానికి తాళం వేసిన పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్‌లో కిరాయి బకాయిల వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. కిరాయి బకాయిలు చెల్లించకపోవడంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజగోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది సంబంధిత దుకాణానికి తాళం వేశారు. అయితే సదరు దుకాణదారు బకాయిలు చెల్లించకుండానే పంచాయతీ సిబ్బంది వేసిన తాళాన్ని పగలగొట్టి దుకాణాన్ని తెరిచినట్లు తెలిసింది. కాంప్లెక్స్‌లోని దుకాణాలకు సంబంధించి కొంతకాలంగా కిరాయి బకాయిలు పేరుకుపోయినట్లు గ్రామ పంచాయతీ వర్గాలు పేర్కొంటున్నాయి. బకాయిలు చెల్లించాలని పలుమార్లు సూచించినప్పటికీ స్పందన లేకపోవడంతో నిబంధనల ప్రకారం సంబంధిత దుకాణానికి పంచాయతీ సిబ్బంది తాళం వేసినట్లు సమాచారం. పంచాయతీ అధికారులు తీసుకున్న చర్యను పట్టించుకోకుండా తాళం పగలగొట్టి దుకాణాన్ని తెరవడం చర్చనీయాంశంగా మారింది.

**అధికారుల చర్యకు సవాల్?**

గ్రామ పంచాయతీ ఆధీనంలోని ఆస్తికి సంబంధించిన బకాయిల వసూళ్లలో భాగంగా అధికారులు తాళం వేసిన అనంతరం దానిని పగలగొట్టడం పంచాయతీ అధికారుల చర్యను ధిక్కరించినట్లుగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పంచాయతీ ఆస్తులకు సంబంధించిన నిబంధనలు, అద్దె ఒప్పందాలను ఉల్లంఘించినట్లయితే అధికారులు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే దౌల్తాబాద్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ, కిరాయి బకాయిలు, దుకాణాల వినియోగంపై పలు సందర్భాల్లో చర్చ జరుగుతున్న నేపథ్యంలో తాజాగా తాళం పగలగొట్టిన ఘటన వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. పంచాయతీకి రావాల్సిన కిరాయి బకాయిలను పూర్తిగా వసూలు చేసి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కన్నీరుమున్నీరైన కుటుంబ సభ్యులు.. శోకసంద్రంలో ఐనాపూర్

**కొమురవెల్లి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** మండలంలోని ఐనాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అబ్బోజు విజేందర్ కుమారుడు అబ్బోజు మురళి కార్తీక్ (23) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో ఐనాపూర్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.





మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో కుషాయిగూడలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న కార్తీక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కార్తీక్ మృతి చెందాడు.కార్తీక్ మృతి వార్త తెలియగానే ఐనాపూర్ గ్రామంలో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్తీక్ అంత్యక్రియలకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు హాజరై నివాళులర్పించారు.

## పానాది రోడ్డుపై రాజకీయ రగడ!

సర్వేతో దారి.. రూ.10 లక్షలతో రోడ్డు పనులకు రైతుల సన్నాహాలు





**బషీరాబాద్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామంలో పానాదిరోడు పర్మిషన్ రోడ్డుపై రాజకీయ వివాదం నెలకొన్న సందర్భంగా బుధవారం రోజు హనుమాన్ దేవాలయం దగ్గర గ్రామ రైతులు గ్రామస్తులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాశీంపూర్ మెయిన్ రోడ్డు నుంచి మరల కుంట బావి దగ్గర వరకు ఉన్న పాత పానాది రోడ్డుపై రాజకీయ వివాదం నెలకొంది. పక్క రైతులు రోడ్డును ఆక్రమించుకోవడంతో చాలాకాలంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామ రైతులు తెలిపారు. రోడ్డుకు అధికారులతో సర్వే చేయించి, రూ.10 లక్షల నిధులతో పర్మిషన్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. అయితే కొందరు రాజకీయ నాయకులు పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆరోపించారు. మట్టి తరలింపునకు మైనింగ్ అధికారుల అనుమతి తీసుకున్న అనంతరం రోడ్డు పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తి అయితే రైతులకు రాకపోకల ఇబ్బందులు తొలగుతాయని గ్రామస్తులు రైతులుతెలిపారు ఈకార్యక్రమంలో రాఘవేందర్ నర్సింలు ఎం వెంకటరెడ్డి లక్ష్మి కాంత్ రెడ్డి బీరప్ప విజయ్ పటేల్ కురువ బీరప్ప సాయిలు నారాయణ వెంకటప్ప గోపాల్ ఈసుబ్ కృష్ణారెడ్డి రాములు శ్రీనివాస్ సాయిలు మల్లప్ప నరేందర్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## భారత్-వెస్ట్ ఇండీస్ టి 20 మ్యాచ్ కోసం భద్రతా సమన్వయ సమావేశం





**ఉప్పల్, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి) :** ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో అక్టోబర్ 14.న జరగనున్న భారత్-వెస్ట్ ఇండీస్ ౨20 మ్యాచ్‌ను పురస్కరించుకుని, మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ (సీపీ) బి.సుమతి (ఐపీఎస్) సమగ్ర భద్రత, ట్రాఫిక్, అగ్నిమాపక భద్రత, జనసందోహ నియంత్రణ అత్యవసర ఏర్పాట్లపై సమీక్షించేందుకు హెచ్‌సిఏ, శాంతిభద్రతల (ఎల్‌డఓ) విభాగం, ట్రాఫిక్ పోలీసులు, అగ్నిమాపక శాఖ, జిహెచ్‌ఎంసి, విద్యుత్ శాఖ ఇతర సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

## సాహిత్యం సమాజానికి దిక్సూచి

- ఆచార్య కె.కృష్ణమూర్తి - ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
- ఉప్పల్‌లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో విస్తృతతోపన్యాసం






**ఉప్పల్, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి) :** ప్రభుత్వ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో "సాహిత్యం – సామాజిక ప్రయోజనాలు" అనే అంశంపై విస్తృతతోపన్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని తెలుగు సహాయాచార్యులు జల్దా విశ్వనాథ్ కుమార్ సమన్వయం చేయగా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్ సత్యనారాయణ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహబూబ్ నగర్ నుండి విచ్చేసిన ముఖ్య అతిథి ఆచార్య డా. కె. కృష్ణమూర్తి ప్రధాన ఉపన్యాసం అందించారు. సాహిత్యం కేవలం వినోద సాధనం మాత్రమే కాకుండా సమాజం లోని విలువలను, మానవీయతను, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే శక్తివంతమైన మాధ్యమమని ఆయన పేర్కొన్నారు. సమాజ హితం కోసం తగిన మార్పుల ను తీసుకురావడంలో సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. సాహిత్యం సమాజానికి అద్దం మాత్రమే కాదు, సమాజాన్ని మరింత మానవీయ దిశగా నడిపించే దిక్సూచి కూడా అని అన్నారు.సభాధ్యక్ష ప్రసంగంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.సిహెచ్. సత్యనారాయణ విద్యార్థులు పాఠ్యాంశాలకు పరిమితం కాకుండా సాహిత్య అధ్యయనం ద్వారా వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమ సమన్వయకర్త జల్దా విశ్వనాథ్ కుమార్ అతిథిని పరిచయం చేసి స్వాగతం పలుకుతూ "పుస్తక పఠనంతో పెరిగే ఆలోచనా విశాలత విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దుతుంది." అన్నారు కార్యక్రమంలో అధ్యాపకులు డామెన్ రాజశ్రీ, డా.జి.తిరుపతయ్య, పి.విజయ్ కుమార్, డా.ఆర్. చంద్రసాగర్, డా.సిహెచ్.అంజయ్య విద్యార్థినీ విద్యార్థులు, ఆసక్తిగా పాల్గొని సాహిత్యం సామాజిక ప్రయోజనాలపై విలువైన అంశాలను అవగాహన చేసుకున్నారు. కార్యక్రమం ప్రశ్నోత్తరాలతో ఉత్సాహంగా సాగి, అనంతరం ధన్యవాదాలతో ముగిసింది.

## ఓటరు జాబితా సవరణ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నమోదుపై అవగాహన





- పరిగిలో రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం
- క్లెయిమ్స్, అభ్యంతరాలు, నో మ్యాపింగ్ కేసులు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అంశాలపై దిశానిర్దేశం

**పరిగి, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి) :** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమంలో భాగంగా పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) ఎం. వాసుచంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించి మార్గదర్శకాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ప్రక్రియ, నోటీసుల జారీ, విచారణల నిర్వహణ, అనామలీస్, లాజికల్ ఎర్రర్స్, నో మ్యాపింగ్ కేసుల పరిశీలన, పరిష్కార చర్యలపై వివరించారు. బీఎల్ఓలు తమ పరిధిలోని ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా ధృవీకరించి అవసరమైన పత్రాలను బీఎల్ఓ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అర్హులైన ఓటర్ల నుంచి ఫారం-6, ఫారం-8 దరఖాస్తులను అనెక్సర్-4 డిక్లరేషన్‌తో కలిసి స్వీకరించి ఎన్నికల వ్యవస్థలో నమోదు చేయాలని తెలిపారు.

నో మ్యాపింగ్, అనామలీస్ కేటగిరీల కింద నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాలను బీఎల్ఏలకు అందజేయాలని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారు, విదేశాల్లో నివసిస్తున్న ఓటర్ల తరఫున కుటుంబ సభ్యులు అవసరమైన పత్రాలతో హాజరై విచారణ ప్రక్రియలో పాల్గొనవచ్చని వివరించారు.

"గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు అంశాలపై దిశానిర్దేశం"..

మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఫారం-18 దరఖాస్తులను సెప్టెంబర్ 28 నుంచి నవంబర్ 6 వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ విధానంలో సమర్పించవచ్చని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో సాధారణ నివాసం ఉండి, నవంబర్ 1, 2026 నాటికి మూడేళ్ల క్రితమే డిగ్రీ లేదా సమాన అర్హత పొందిన భారతీయ పౌరులు నమోదు చేసుకోవాలని సూచించారు.

సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు అలాగే ఏఈఆర్‌ఓలు ఎంపీడీవో హరి ప్రియ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, డిటి అనిల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### వికసిత్ భారత్ లక్ష్యంగా సేవా జ్యోతి కార్యక్రమానికి

## కుల్కచర్ల మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీ

**కుల్కచర్ల మండలం అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** మండల కేంద్రంలో వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సేవా కార్యక్రమాల్లో భాగంగా వికారాబాద్‌లో నిర్వహించిన 'సేవా జ్యోతి' కార్యక్రమానికి బైక్ ర్యాలీగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

ఈ ర్యాలీ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కరణం ప్రహ్లాద్ రావు కుల్కచర్ల మండల అధ్యక్షులు గుడాల వెంకటేష్ బైక్ ర్యాలీ నిర్వహించి సేవా జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, వికసిత్ భారత్ లక్ష్య సాధన కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో జిల్లా నాయకులు గణపురం వెంకటయ్య దిశా కమిటీ సభ్యులు జానకిరామ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బృంగి హరికృష్ణ ఎస్ టి మోర్చా జిల్లా అధ్యక్షులు గోవింద నాయక్ జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మైపాల్ బంధ్యయ్య మోనాచారి సూర్యకాంతం చౌడపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ ఉప సర్పంచ్ విజయ్ కుమార్ మైపాల్



మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ బీజేపీ సీనియర్ నాయకులు కర్ణయ్య మల్లేష్ వెంకటేష్ కొండ ఆంజనేయులు రాంపూర్ రామకృష్ణ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అలాగే కుల్కచర్ల, చౌడపూర్ మండలాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ ర్యాలీగా వికారాబాద్‌కు తరలివెళ్లారు.

## పార్టీ సిద్ధాంతాలను నమ్మినోళ్లకు దక్కని ప్రాధాన్యత..!

- అసంతృప్తితో రగిలిపోతున్న కార్యకర్తలు - 2017కు ముందున్న కాంగ్రెస్ కార్యకర్తల హామీ ఏమైంది!
- అధికారంలోకి వచ్చామన్న ఆశలు అడియాసలేనా? - తాండూరు కాంగ్రెస్ కార్యకర్తల గుసగుసలు



**తాండూరు ఆగస్టు 30, ప్రజా జ్యోతి :** దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పార్టీ కష్టకాలంలో ఉన్న కూడ జెండా మోసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి తాండూరు నియోజక వర్గంలోని కొందరు కాంగ్రెస్ కార్యకర్తల్లో వ్యక్తమవు తున్నట్లు తెలుస్తోంది. విజయానికి ఎంతో దగ్గరలో ఉండి కూడా ఓటమిపాలవుతున్న కాంగ్రెస్ పార్టీని ఎలాగైనా గెలిపించాలనే సంకల్పంతో కార్యకర్తలు పట్టు వీడని విక్రమార్కుల పనిచేశారు. తాండూరు అసెంబ్లీ స్థానాన్ని కైవసం చేసుకో వాలనే సంకల్పంతో గతంలో కార్యకర్తలు తీవ్రంగా శ్రమిం చామనే చర్చ జోరుగా సాగుతుంది. తాండూరు అసెంబ్లీ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడంతో పాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు రాజకీయంగా సంస్థాగతం గా తగిన గుర్తింపు లభిస్తుం దని ఆశించిన కార్యకర్తలకు భంగపాటే ఎదురైంది. కాంగ్రెస్ స్థానం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో పలువురు పలుకుబడి ఉన్న నాయకులు ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వచ్చిన వారికి ఇస్తున్న ప్రాధాన్యత ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేసిన తమకు లేదనే భావన కొందరు కార్యకర్తల్లో నెలకొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా కాంగ్రెస్‌ను వీడకుండా పనిచేసిన కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు వస్తాయని ఆశించిన కార్యకర్తల్లో నిరాశ మిగిలింది. ఇదే విషయం అప్పట్లో కార్యకర్తలు నుండి వచ్చిన తీవ్ర వ్యతిరేకతతో అధిష్టానం ఒక కఠినమైన నిర్ణయం తీసుకునే విధంగా ఆదేశాలు ఇచ్చింది.

2017కు ముందు కాంగ్రెస్ పార్టీలో జెండా మోసిన కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్న హామీ ఏమైంది? 2017కు ముందు కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను అధికారంలోకి వచ్చాక మీకు అవకాశాలు కల్పిస్తామని అప్పట్లో పలువురు నాయకులు హామీలు ఇచ్చారని కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన హామీల అమలుపై స్పష్టత లేకపోవడంతో తమలో నిరాశ పెరుగుతోందని కొందరు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతుంది.

పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేసిన వారిని పక్కనపెట్టి, ఎన్నికల సమయంలో లేదా ఆ తర్వాత పార్టీలో చేరిన వారికి ఎక్కువ ప్రాధాన్యత లభిస్తే భవిష్యత్తులో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తల్లో ఉత్సాహం తగ్గే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.

**అధికారంలోకి వచ్చామన్న ఆశలు అడియాసలేనా? :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో తమ రాజకీయ భవిష్యత్తుకు మంచి రోజులు వస్తాయని అనుకున్న కార్యకర్తలకు నిరాశ మిగిల్చారనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆశించిన కార్యకర్తలు ప్రస్తుతం పరిస్థితులను గమనిస్తూ ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. తమ సమస్యలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ సరైన స్పందన లభించడం లేదనే గుసగుసలు కార్యకర్తల్లో వినిపిస్తున్నాయి. కార్యకర్తల అసంతృప్తిని పార్టీ అధిష్ఠానం గుర్తించి కార్యకర్తల్లో ధైర్యం నింపాల్సిన అవసరం ఎంతైనా ఉందని పార్టీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. పార్టీకి బలమైన పునాది కార్యకర్తలేననే నినాదం ఏమైందని ప్రశ్నిస్తున్నారు.

**పార్టీ బలోపేతానికి కార్యకర్తలే కీలకం అనే మాటలు కేవలం :** ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లే కార్యకర్తలకు తగిన గౌరవం, గుర్తింపు, బాధ్యతలు కల్పించాలని పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం తాండూరు కాంగ్రెస్‌లో కార్యకర్తల మధ్య వినిపిస్తున్న ఈ గుసగుసలు రానున్న రోజుల్లో ఎలాంటి రాజకీయ పరిణామాలకు దారితీస్తాయో వేచి చూడాల్సిందే.

## శుభకార్యానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు!

- గుర్తుతెలియని వాహనం ఢీ..
ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- భార్యాభర్తలు, కొడుకు దుర్మరణం..
కూతురికి తీవ్ర గాయాలు
- గొల్లపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..
వాహనం కోసం పోలీసుల గాలింపు





**చేవెళ్ల, అక్టోబరు 07(ప్రజా జ్యోతి) :** ఆ ఇంట్లో శుభకార్యం.. అంతా ఆనందంగా బయలుదేరారు. కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణమైన కొద్దిసేపటికే మృత్యువు రూపంలో దూసుకొచ్చిన వాహనం ఆ కుటుంబాన్ని ఛిద్రం చేసింది. వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో భార్యాభర్తలు, ఆరేళ్ల కుమారుడు అక్కడికక్కడే మృతిచెందారు. పదేళ్ల కుమార్తె తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషాద ఘటన చేవెళ్ల మండలం గొల్లపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మండలం మేడిపల్లికి చెందిన కుమ్మరి మధు (34) తన భార్య సావిత్రి (32), కుమారుడు ధనుష్ (6), కుమార్తె అక్షయ (10)తో కలిసి మంగళవారం సాయంత్రం కుటుంబ శుభకార్యానికి వెళ్లారు. టిఎస్ 07జూ5913 నంబర్ గల గ్లామర్ ద్విచక్ర వాహనంపై మధ్యాహ్నం 4 గంటలకు మేడిపల్లి నుంచి చేవెళ్లలోని చన్వల్లికి బయలుదేరారు. కార్యక్రమం ముగించుకుని రాత్రి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గొల్లపల్లి సమీపంలో ప్రమాదం జరిగింది.

**వెనుక నుంచి ఢీ.. :** రాత్రి సుమారు 9 నుంచి 9.20 గంటల మధ్య మధు కుటుంబం ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఢీకొన్న వేగానికి వాహనంపై ఉన్న నలుగురూ రోడ్డుపై పడిపోయారు. మధు, సావిత్రి, ధనుష్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అక్షయ తీవ్ర రక్తగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు వెంటనే చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

**ఆగకుండా వెళ్లిపోయాడు.. :** ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం ఆగకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. సమాచారం అందుకున్న చేవెళ్ల పోలీ సులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. వాహనం, డ్రైవర్‌ను గుర్తించేందుకు దర్యాప్తు చేపట్టారు. మృతుడు మధు అన్న కుమ్మరి మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**ఆ ఇంట విషాదం.. :** ఒక్క ప్రమాదంతో కుటుంబంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడంతో మేడిపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శుభకార్యానికి వెళ్లిన కుటుంబం ఇలా తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో బంధువులు, గ్రామస్థులు కన్నీరుమున్నీరయ్యారు.

## భూ రీ-సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి

క్షేత్రస్థాయిలో రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ దీపక్ తివారి





**వికారాబాద్ ప్రతినిధి, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** భూ రీ-సర్వే పనులను పారదర్శకంగా, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. బుధవారం వికారాబాద్ మండల పరిధిలోని అత్వెలి గ్రామం, నవాబ్‌పేట్ మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామాల్లో సర్వే నంబర్లు 131, 470లో జరుగుతున్న భూ రీ-సర్వే పనుల పురోగతిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి ఫీల్డ్ విజిట్ నిర్వహించిన కలెక్టర్.. భూముల కొలతలు, హద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన, భూ వివరాల నమోదు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియలో క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రెవెన్యూ, సర్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. అర్హులైన భూ యజమానుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, రికార్డుల్లో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. రీ-సర్వే పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా, ప్రతి దశను పకడ్బందీగా నిర్వహించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే మధుసూదన్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సర్వేయర్ ఆనంద్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం?

- గ్రామ కార్యదర్శి మాట వినకుండా యథావిధిగా ఇంటి నిర్మాణం



**బషీరాబాద్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి :** బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామంలో కొండంపల్లి శ్యామలమ్మ రాములు గ్రామపంచాయతీ అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపడుతున్నారని గ్రామ పాలకవర్గం, గ్రామస్తులు ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొంటూ, సంబంధిత గ్రామ కార్యదర్శి అక్రమంగా ఇంటి నిర్మాణం చేపడుతున్న వారికి చెప్పిన వినకుండా యథావిధిగా ఇంటి నిర్మాణాన్ని చేపడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. గతంలో మండల అధికారులకు తెలియజేయడం జరిగింది ఇట్టి విషయంపై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న నిర్మాణాన్ని నిలిపివేసి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని మండల అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

## డా.దేవరకొండ సత్యనారాయణ (సతీష్)కు భారత్ నిర్మాణ్ యోగదాన్ 2026 అవార్డు

తెలంగాణకు చెందిన డా.దేవరకొండ సత్యనారాయణ (సతీష్)కు గోవాలో భారత్ నిర్మాణ్ యోగదాన్ అవార్డు 2026



**ఉప్పల్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి :** సమాజ సేవా రంగంలో అంకితభావం నిస్వార్థ సేవకు గాను తెలంగాణకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త, హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ సెక్రటరీ డా. దేవరకొండ సత్యనారాయణ (సతీష్)కు ప్రతిష్ఠాత్మక భారత్ నిర్మాణ్ యోగదాన్ అవార్డు 2026 (ఆల్ ఇండియా) లభించింది. ఈ అవార్డు ప్రదానోత్సవం 26 సెప్టెంబర్ 2026న మాక్వినెజ్ ప్యాలెస్ ఆడిటోరియం, పణజిం-గోవాలో ఘనంగా జరిగింది. ఈ అవార్డును ముఖ్య అతిథి అద్యా శ్రీపాద్ యెస్సో నాయక్, కేంద్ర విద్యుత్, కొత్త ఽ పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి, భారత ప్రభుత్వం చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సియోలిమ్ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంటర్టైన్మెంట్ సొసైటీ ఆఫ్ గోవా వైస్ చైర్మన్ డెలిలా మైఖేల్ లోబో బిజెపి గోవా రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ నాయక్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆప్లా వైభవ్ ఫౌండేషన్, మహారాష్ట్ర (వ్యవస్థాపక అధ్యక్షులు వైభవ్ విర్కర్),గోవాకు చెందిన కమ్యూనిటీ లీడర్ ఽ సోషల్ యాక్టివిస్ట్ ఐశ్వర్య సాల్గావ్కర్, ఆర్టి ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు దీపా కేర్కర్ సంయుక్తం గా నిర్వహించారు. సామాజిక కార్యకర్తగా హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నేషనల్ సెక్రటరీగా చేస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు

– విద్యా సంస్థల్లో వసతులపై కలెక్టర్ ఆరా




**మల్లాపూర్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి :** మండలంలోని గిరిజన మినీ గురుకులం, ఆదర్శ పాఠశాలను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి, భోజనం, మౌలిక వసతులను ఆయన నిశితంగా పరిశీలించారు. తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధనా విధానం, విద్యా ప్రగతి, తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి, పాఠశాలలో వారికి అందుతున్న సౌకర్యాలు, భోజనం నాణ్యత తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును అలాగే బోధనా ప్రమాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థులలో విద్యా సామర్థ్యాలు పెంపొందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని, భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యా సంస్థల్లో అవసరమైన అన్ని వసతులను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పల్లికొండ నరేష్, జిల్లా విద్యాధికారి కె.రాము, తహసీల్దార్ రాంచందర్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ భూమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచే ఆర్థిక అవగాహన అవసరం

: టీజీబీ బ్యాంక్ మేనేజర్ విక్రమ్




**బీర్ పూర్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** బీర్ పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బ్యాంకింగ్ అవగాహన సదస్సు మరియు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీబీ బ్యాంక్ మేనేజర్ విక్రమ్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి బ్యాంక్ మేనేజర్ విక్రమ్ మరియు సీ.ఎఫ్.ఎల్ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులకు మరియు అనధికారిక లింకులకు తమ ఓటీపీ లను ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని స్పష్టం చేశారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని అవగాహన కల్పించారు. బ్యాంకులు అందిస్తున్న వివిధ రకాల ఇన్సూరెన్స్ (భీమా) పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక క్రమశిక్షణ, అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరమన్నారు. ఇందులో భాగంగా ఎన్‌బిఎఫ్‌సిలు, ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన 'ఉద్గమ్ పోర్టల్', మరియు డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ ఖాతాలతో పాటు డిజిటల్ లావాదేవీల నిర్వహణపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ బ్యాంకింగ్ అంశాలపై విద్యార్థులు కేవలం అవగాహన పెంచుకోవడమే కాకుండా, తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, సీ.ఎఫ్.ఎల్ కౌన్సిలర్ సౌజన్య, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే విజయ రమణారావు విప్

– సహకారంతో గ్రామాన్ని అన్నిరంగల్లో అభివృద్ధి చేస్తాం.

– సర్పంచ్ గోపు రజిత లక్ష్మారెడ్డి .



**ఎలిగేడు సెప్టెంబర్ 7 (ప్రజాజ్యోతి) :** పెద్దపెల్లి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు విప్ సహకారం గ్రామ ప్రజల ఆశీస్సులతో బురహాన్ మియాపేట గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని సర్పంచ్ గోపి రజిత లక్ష్మారెడ్డి అన్నారు. సర్పంచిగా బాధ్యతలు తీసుకొని పది నెలల కాలంలో సుమారు 30 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆమె తెలిపారు ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు గ్రామశీ లో గ్రామపంచాయతీ బిల్డింగు మధ్యలోనే ఆపివేస్తే దానిని ప్రారంభించి ముగింపు దశకు తీసుకువచ్చాం . త్రాగునీటి సమస్యను గుర్తించి న నిరుపయోగం ఉన్న వాటర్ ప్లాంట్ ను 45 వేల రూపాయలతో రిపేర్ చేయించి ప్రజలకు త్రాగునీరు అందించినాము. పారిశుద్ధ్యం నిర్వహణ ట్రీట్ లైట్లు ఏర్పాట్లు రోడ్లు తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు ప్రజలకు ఎలా ఇబ్బందులు కలవకుండా నీటి సరిపడా శానిటేషన్ తదితర సమస్యలపై దశలవారీగా పరిష్కరిస్తామని సర్పంచి గోపు రజిత లక్ష్మారెడ్డి అన్నారు . ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు విప్ బురహాన్ మియాపేట గ్రామానికి సంబంధించిన డబుల్ రోడ్డు నిర్మాణం , మహిళా బిల్డింగు, ఎస్సీ కమ్యూనిటీ హాల్ కు హామీ ఇచ్చారు. త్వరలోనే ఎమ్మెల్యే విజయరామరావు సహకారంతో బురహాన్ మియాపేట గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి బురహాన్ మియాపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని సర్పంచ్ పేర్కొన్నారు గ్రామ ప్రజల సహకారం ఆశీస్సులతో మరింత అభివృద్ధి సాధించేందుకు నిదాంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు.

# ఓటు, సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌దే

– పటేల్‌కు బదులు నెహ్రూను ప్రధాని చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది

– ఈసీ రాజ్యాంగబద్ధ సంస్థ.. బీజేపీ జేబు సంస్థ కాదు

– కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు





**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** ఓటు చోరీ, సీటు చోరీ పేటెంట్ కాంగ్రెస్‌కే ఉందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. దేశంలో మొట్టమొదటి ఓటు, సీటు చోరీకి కాంగ్రెస్ తెరలేపిందని విమర్శించారు. దేశంలోని పీసీసీలన్నీ సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను ప్రధానిగా ప్రతిపాదించినప్పటికీ, ఒక్క పీసీసీ మద్దతు లేకున్నా జవహర్‌లాల్ నెహ్రూను ప్రధానిని చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని అన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవను పురస్కరించుకుని బీజేపీ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవా జ్యోతి' ర్యాలీ, 'వికసిత్ భారత్ సంకల్ప సభ'లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

**ఈసీపై బురద చల్లొద్దు :** ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన సంస్థ అని, అది బీజేపీ జేబు సంస్థ కాదని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తప్పు చేశారని భావిస్తే కోర్టును ఆశ్రయించాలని సూచించారు. రాజ్యాంగ సంస్థలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదకరమన్నారు. రాహుల్‌గాంధీ ఈసీని కలవాలనుకుంటే అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లాలని, వందల మందితో వెళ్లి దాడులకు పాల్పడితే పోలీసులు అడ్డుకోకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు.

**అనర్హుల ఓట్లు తొలగించడమే లక్ష్యం :**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు అనర్హుల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ లక్ష్యమని చెప్పారు. చనిపోయిన వారి పేర్లు కూడా ఓటర్ల జాబితాలో కొనసాగుతున్నాయని, వాటిని తొలగిస్తే తప్పేమిటని ప్రశ్నించారు. దేశంలో పెద్ద సంఖ్యలో డూప్లికేట్, అనర్హుల ఓట్లు ఉన్నాయని కాంగ్రెస్ నేతలే గతంలో ఆరోపించారని గుర్తుచేశారు. అలాంటి ఓట్లను తొలగించే ప్రక్రియను ఇప్పుడు ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

**మోదీకి చోరీ చేయాల్సిన అవసరం లేదు :** ప్రధాని మోదీకి ఓటు, సీటు చోరీ చేయాల్సిన అవసరం లేదని బండి సంజయ్ అన్నారు. మోదీకి దేశ ప్రజలే కుటుంబమని, బినామీ ఆస్తులు, వారసత్వ రాజకీయాలపై ఆసక్తి లేదన్నారు. ప్రధాని పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా సామాన్యుడిలా ప్రజాసేవలో కొనసాగగల మహనీయుడని కొనియాడారు. 2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలనే లక్ష్యంతో మోదీ పనిచేస్తున్నారని చెప్పారు.

కాంగ్రెస్––బీఆర్ఎస్ చీకటి ఒప్పందం : కేసీఆర్ కుటుంబ భూ వివాదాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలు రాజకీయ డ్రామాగా మారాయని బండి సంజయ్ విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతిపై చర్యలు తీసుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలపై పోరాడే సత్తా బీఆర్ఎస్‌కు లేదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు ఉన్నాయని ఆరోపించారు.

పార్టీ ఏ బాధ్యత ఇచ్చినా పనిచేస్తా : బీజేపీ తనకు ఎన్నో పదవులు, అవకాశాలు కల్పించిందని బండి సంజయ్ అన్నారు. పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదని, పార్టీ ఏ బాధ్యత అప్పగించినా శిరసావహిస్తానని తెలిపారు. కార్యకర్తగా పార్టీ కోసం పనిచేయడమే తన లక్ష్యమన్నారు.

# వయోవృద్ధులు సమాజానికి మార్గదర్శకులు

– వృద్ధుల సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

– అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే





**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి) :** వయోవృద్ధులు తమ జీవిత అనుభవాలతో నవ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే మార్గదర్శకులని, వారిని గౌరవించడం మన బాధ్యత అని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు.

మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం వేడుకలు కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం జరిగాయి.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో వృద్ధాప్యం అనేది ఒక సహజమైన దశ అని, సమాజం దానిని బలహీనతగా చూడకుండా గౌరవించాలని పిలుపునిచ్చారు. మన సంస్కృతిలో పెద్దల సలహాలు, దీవెనలు ఎంతో అమూల్యమైనవని తెలిపారు. జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసి, ఎన్నో త్యాగాలు చేసిన వృద్ధులకు వృద్ధాప్యంలో గౌరవప్రదమైన జీవనం, సరైన సంరక్షణ అందించడం కుటుంబంతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధుల భద్రత, రక్షణ, సంక్షేమం కోసం అనేక చట్టాలు, పథకాలను అమలు చేస్తున్నాయని, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ వీటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేసేందుకు పని చేస్తోందని తెలిపారు. వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం జిల్లాలో ప్రత్యేక వైద్య శిబిరాలను, సేవలను నిరంతరం అందుబాటులో ఉంచుతామని అన్నారు. వృద్ధులు తమ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని, యోగ, వ్యాయామం వంటివి అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమం కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, సీనియర్ సిటిజన్లను శాలువాతో ఘనంగా సత్కరించి, పురస్కారాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య ధికారి రాజగోపాల్ రావు, డిఆర్‌డిఓగీత, మనీష, బ్రహ్మకుమారి, కేశవరెడ్డి, బండ సత్తయ్య, మోసం అంజయ్య, ఆనందం, సుధాకర్, బాలకిషన్, రామ స్వామి, లక్ష్మిపతి, మొహమ్మద్ ఉస్మాన్ పాషా, శంకరయ్య, నారాయణ రెడ్డి, రామేశం,వివిధ వృద్ధాశ్రమాల నిర్వాహకులు, సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో వయోవృద్ధులు పాల్గొన్నారు.

# గ్రామీణుల ఆరోగ్యానికే సర్కార్ పెద్దపీట

– పేదలకు వైద్యం దూరం కాకూడదన్నదే మా లక్ష్యం

– సాతారంలో నూతన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి అడ్లూరి





**మల్లాపూర్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి :** గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ.. చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లే కష్టాన్ని తప్పించేందుకే గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. రోగం వచ్చాక చికిత్స తీసుకోవడం కంటే, ముందుగానే గుర్తించి నివారించడం ముఖ్యమన్న ఆయన, ప్రజలందరూ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నిర్మించిన భవనాలు కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా, నిరంతర సేవలు అందేలా అధికారులు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. కలెక్టర్ సత్యప్రసాద్ సాతారం వాసులకు ఇకపై ప్రాథమిక వైద్యం మరింత చేరువవుతుందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని, అలాగే ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సేవల్లో ఎలాంటి ఆటంకాలు రాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని గుర్తుచేశారు.

కోరుట్ల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం తాను అహర్నిశలు కృషి చేస్తానని వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్థానికంగా ఇలాంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రావడం హర్షణీయమని, గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో నరసింహారావు, డీఎంహెచ్ వో సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్, తహసీల్దార్ రాంచందర్, మండల వైద్యాధికారిణి వాహిని రావ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాట్ల సోమయ్య, గ్రామ సర్పంచ్ పోతవేణి నారాయణ గౌడ్, సాతారం ఎమ్మెల్ హెచ్ పి సరిత, కాంట్రాక్టర్ రంగు రామ గౌడ్, వైద్య సిబ్బంది రామ్ మోహన్, క్రిష్ణ రావ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు అదనపు తరగతి గదుల కై మంత్రికి వినతి

**కోరుట్ల రూరల్, అక్టోబర్ 7(ప్రజా జ్యోతి) :** సాతారం గ్రామంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మారం గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి కలిసి, ధర్మారం ప్రభుత్వ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాతారం గ్రామంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను ధర్మారం గ్రామ సర్పంచ్ రంజిత్ రెడ్డి కలిసి, ధర్మారం ప్రభుత్వ పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అలాగే గ్రామాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలను సానుకూలంగా పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగరావు, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



**కరీంనగర్, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి):** జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్‌రెడ్డి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి సమగ్ర నివేదికలను పంపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా ఈవీఎంల రక్షణ, భద్రతకు చేపడుతున్న ఏర్పాట్లను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరును పరిశీలించడంతో పాటు ఈవీఎం, వీవీప్యాట్ గదుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఈ తనిఖీలో కాంగ్రెస్ ప్రతినిధి మడుపు మోహన్, బీఆర్ఎస్ ప్రతినిధి సత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, సీపీఎం ప్రతినిధి మిల్కూరి వాసుదేవారెడ్డి, టీడీపీ ప్రతినిధి ఎరబెల్లి రవీందర్, ఎంఐఎం ప్రతినిధి మజిత్ హుస్సేన్‌తో పాటు ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సదానందం కుటుంబానికి రూ.3.65 లక్షల ఆర్థిక సాయం



**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 7(ప్రజాజ్యోతి) :** జిల్లా కలెక్టర్ డ్రైవర్ సదానందం సతీమణి నీరజాక్షి ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన నేపథ్యంలో, కరీంనగర్ జిల్లా ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో రూ.3.65 లక్షల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం తిమ్మాపూర్‌లోని సదానందం నివాసంలో కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు కుటుంబాన్ని పరామర్శించి తమ సానుభూతి తెలిపారు. ఉద్యోగులు ఫోన్‌పే, గూగుల్‌పే తదితర మార్గాల్లో అందించిన విరాళాలతో ఈ మొత్తాన్ని సమకూర్చినట్లు తెలిపారు.

ఆపదలో ఉన్న ఉద్యోగ కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన ఉద్యోగ ఐక్యత, మానవత్వానికి నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో, టీజీవో, డ్రైవర్ల, రెవెన్యూ, ట్రెజరీ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు



**రాయికల్, అక్టోబర్ 07 (ప్రజా జ్యోతి) :** మండలంలోని రామాజీపేట ప్రభుత్వ పాఠశాలలో 2001–2 బ్యాచ్ కు చెందిన 10వ తరగతి విద్యార్థులు అంతా ఒక్కటై తోటి స్నేహితుని కుటుంబానికి అండగా నిలిచారు.పాఠశాలలో చదివిన రవీందర్ రోడ్డు ప్రమాదానికి గురై కాలు శస్త్ర చికిత్స జరగడంతో స్నేహితునికి అండగా నిలిచేందుకు తోటి మిత్రులంతా కలిసి మిత్రుడు రవీందర్‌కు రూ.21000 వేలు అందించి అండగా నిలిచారు. కష్టకాలంలో తోటి మిత్రుని ఆర్థిక పరిస్థితి గుర్తించి అండగా నిలిచిన స్నేహితులందరికి రవీందర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం మారుతున్న సమాజంలో ఆర్థిక వ్యత్యాసాల మధ్య ప్రేమ, అనుబంధ, స్నేహ సంబంధాలు క్షీణించిపోతున్న తరుణంలో స్నేహితులు ఆడ మగ భేదం లేకుండా అంతా కలిసి తోటి స్నేహితుడు కుటుంబానికి అండగా నిలవడం పట్ల గ్రామస్తులు, నాయకులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితుల బృందం సభ్యులు వాసరి రవి,ద్యాగ రమేష్, అయిండ్లెని జీవన్ రెడ్డి,ఇద్దం గంగారెడ్డి, బొమ్మకంటి శ్రీనివాస్, పందిరి శ్రీనివాస్, ఎనుగంటి రవి, చంద్రపాల్ తోటి స్నేహితుల బృందం పాల్గొన్నారు.

## ముస్తాబాద్ మాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**ముస్తాబాద్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి) :** ముస్తాబాద్ మాల సంఘం నూతన అధ్యక్షులు, కార్యవర్గాన్ని అక్టోబర్ 5న ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మీస శ్రీనివాస్ (తండ్రి: పెద్దులు), ఉపాధ్యక్షుడిగా శ్యాగల రాజయ్య (తండ్రి: రామయ్య), ప్రధాన కార్యదర్శిగా తలారి నర్సయ్య (తండ్రి: రాజయ్య), కోశాధికారిగా గొట్టె బాలనర్సయ్య, రచయితగా మీస బాబు (తండ్రి: పరశురాములు) ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మీస నర్సింలు (పాండు), జంగం జనవ్వలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం 2026 అక్టోబర్ 5 నుంచి 2027 అక్టోబర్ 5 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మీస శ్రీనివాస్ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న మాల సంఘం సభ్యులకు, నూతన కార్యవర్గ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి అందరి సహకారంతో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మట్టా



**సత్తుపల్లి అక్టోబర్07(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని బేతుపల్లి గ్రామానికి చెందిన ఏసూరి లక్ష్మి ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేసింది. సకాలంలో ఇల్లు నిర్మించుకొని బుధవారం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసి, రాష్ట్ర సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ ను విశిష్ట అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై నూతన గృహాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే నిరుపేదల సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారని, అభివృద్ధి అనేది కాంగ్రెస్తోనే సాధ్యమవుతుందని, ప్రతి నిరుపేద కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి చెందాలని, తొందరగా నిర్మాణం పూర్తి చేసుకున్నందుకు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ నాయకులు దొడ్డా శ్రీనివాసరావు, అభిమానులు ఉన్నారు.

## రోడ్డు విస్తరణ పనులలో చిరు
# వ్యాపారులకు జీవనోపాధి కల్పించాలి

- సీపీఎం జిల్లా కమిటి సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకరరావు



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** నాలుగు రోడ్ల విస్తరణ పనుల అభివృద్ధికి మేము వ్యతిరేకులం కాదని, దశాబ్దా కాలం నుండి రోడ్డు పక్కన పండ్లు, పూల కోట్లు,టిఫిన్ సెంటర్లు ,టీ కొట్లు,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, కూరగాయల, బడ్డీలు తోపుడు బల్లాలపై పలు వ్యాపారలు చేసే కార్మికులు రోడ్డు పక్కన వ్యాపారాలు చేస్తూ జీవనం కొన సాగిస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పుకు అధికారులు మార్కింగ్ ఇచ్చి షాపులు తొలగించాలని ఒత్తిడి చేస్తున్నారని వీటిని తొలగించి మేము ఎక్కడ వ్యాపారాలు చేసుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం వీధి చిరు వ్యాపారులకు చట్టప్రకారం గుర్తించి, గుర్తింపు కార్డులు సర్టిఫికెట్లు అందించి రక్షణ కల్పించాలని వేడుకున్నారు. రోడ్డు వెడల్పు పనులు చేపట్టకముందే మండల కేంద్రశీ ప్రధాన రింగ్ సెంటర్ ( చౌరస్తాలో) వ్యాపారుల కోసం స్థలం కేటాయించి షటర్లు నిర్మించి వ్యాపారుల,కార్మికుల జీవనోపాధికి భంగం కలగకుండా రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దూదిగం బసవయ్య,దివ్వెల వీరాంజనేయులు, నక్కా పుల్లారావు చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

## ఈనెల 12న
# ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా

**కొత్తగూడెం కలెక్టరేట్ ,అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాలోని ఐటీఐ ఉత్తీర్ణులైన అన్ని ట్రేడ్ల అభ్యర్థులకు జిల్లా పరిధిలోగల వివిధ పరిశ్రమలలో అప్రెంటీస్ శిక్షణ కల్పించేందుకు ఈ నెల 12వ తేదీన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ జి.రమేష్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మేళా కొత్తగూడెం ప్రభుత్వ ఐటీఐ నందు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు, అభ్యర్థులు ముందుగా **www.apprenticeshipindia.org.in** లో తమ పేరు నమోదు చేసుకోవాలని, ఆధార్ కార్డు జిరాక్స్, బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరు కావాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ ప్రధానాచార్యులు, పరిశ్రమల యాజమాన్యాలు తమ పరిధిలోని ఖాళీల వివరాలతో 12న ఐటీఐకి హాజరు కావాలని కోరారు. ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఐక్య కూటమిని గెలిపించాలి

- సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు



**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** ఆర్టీసీ గుర్తింపు ఎన్నికల్లో ఎస్ డబ్ల్యూ ఎఫ్, టీ డబ్ల్యూ, ఐ ఎన్ టి యు సి ఐక్య కూటమి సంఘాల అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఐక్య సంఘాల నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. బుధవారం ఉదయం ఆర్టీసీ డిపోలో జరిగిన ప్రచార కార్యక్రమంలో నక్షత్రం, బాణం గుర్తులపై ఓట్లు వేసి ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని కార్మికులను కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ఆర్టీసీ విలీన ప్రక్రియ సజావుగా జరగాలన్నా ఐక్య కూటమి అభ్యర్థులను గెలిపించాలని నాయకులు ప్రచారం చేశారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఐక్య సంఘాల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ బండారు శరత్ బాబు, సీఐటీయూ జిల్లా నాయకులు ఎంపీ నర్సారెడ్డి, వై. వెంకట్ రామారావు, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, ఐక్య కూటమి నాయకులు జే.ఆర్. బాబు, బి. బాలకృష్ణ, జి. యుగంధర్, కే. యాకయ్య, ఐ.వి. బాబు, వి.ఎన్. రావు, కేకే. ప్రసాద్, కే. ప్రతాప్, డీఎన్. రావు, సీహెచ్. కవిత, డి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి
# ఆలయ పూజారి వసతిగృహానికి ముందడుగు

- విఆర్కె స్టీల్ ఇండస్ట్రీస్ చైర్మన్ పెంటా శ్రీనివాస్ విశ్వకర్మ దంపతులు రూ.50,000/- వేలు విరాళం



**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని గోల్డ్స్మిత్ కాలనీలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న పూజారి వసతిగృహానికి దాతలు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా వి ఆర్ కె స్టీల్ ఇండస్ట్రీస్ చైర్మన్ పెంటా శ్రీనివాస్ విశ్వకర్మ, విజయభాను దంపతులు తమ వంతు సహాయంగా రూ.50,000 విరాళాన్ని అందజేశారు. తమ జ్యేష్ఠ కుమారుని పుట్టినరోజు సందర్భంగా గతంలో ప్రకటించిన విధంగానే రూ.50,000ల విలువైన చెక్కును వీరబ్రహ్మేంద్రస్వామి వారి సన్నిధిలో ఆలయ కమిటీ అధ్యక్షులు అనుగోజు నాగభూషణంకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్-- విజయభాను దంపతులకు, వారితో పాటు విచ్చేసిన వెన్సో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బంగారు తాతారావు దంపతులకు ఆలయ కమిటీ తరఫున శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అరిటికట్ల రాము, కడార్ల రాము, బొడ్డోజు శ్రీను, వేల్పుకొండ సతీష్, ఆలయ కమిటీ కోశాధికారి ఆలేటి నాగేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు. పూజారి వసతిగృహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభం నుంచి బాధ్యతగా తీసుకుని నిధుల సమీకరణలో కీలక పాత్ర పోషిస్తున్న బులియన్ మర్చంట్స్ స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి దార్ల బ్రహ్మానందాచార్య, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ అనుగోజు నరసింహాచారి సమక్షంలో ఈ విరాళ కార్యక్రమం జరిగింది.

# పత్తి తీసుకొచ్చే రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- 8-12 శాతం లోపు తేమ ఉండేలా పత్తిని సిద్ధం చేసుకోవాలి
- జిల్లాలో 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై
- 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్లతో తేమ శాతం పరీక్షించుకోవాలి
- కౌలు రైతులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** 2026--27 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ద్వారా పత్తిని కనీస మద్దతు ధర క్రింద విక్రయించేందుకు రైతులు పత్తిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుని తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి కొనుగోళ్ల సమయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై 2026--27 సీజన్లో ఖమ్మం జిల్లాలో పత్తి కొనుగోళ్ల కోసం 8 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా నోటిఫై చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఖమ్మం, మద్దులపల్లి, మధిర, వైరా ప్రాంతాల్లోని నోటిఫైడ్ జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిని తీసుకువచ్చే ముందు తమకు సంబంధించిన కొనుగోలు కేంద్రం, జిన్నింగ్ మిల్లు వివరాలను ముందుగానే తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. నోటిఫై చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తిని విక్రయించి కనీస మద్దతు ధర ప్రయోజనం పొందాలని తెలిపారు. తేమ శాతాన్ని ముందుగానే పరీక్షించుకోవాలి. పత్తిలో తేమ శాతం నాణ్యత, ధరపై ప్రభావం చూపుతున్నందున రైతులు పత్తిని మార్కెట్కు తీసుకువచ్చే ముందు తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని 129 రైతు వేదికల్లో మాయిశ్చర్ మీటర్ల ద్వారా పత్తిలో తేమ శాతాన్ని పరీక్షించుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు తాము పండించిన పత్తిని సాధ్యమైనంత వరకు 8 శాతం లోపు తేమ ఉండేలా ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. 8 శాతానికి మించి తేమ ఉన్నప్పుడు ప్రతి అదనపు ఒక్క శాతం తేమకు రూ.86.67 చొప్పున ధరలో తగ్గింపు ఉంటుందని అధికారులు తెలిపారు. పత్తిని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకుని తీసుకురావడం ద్వారా ధరలో కోతను నివారించవచ్చని అన్నారు. కౌలు రైతులు తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కౌలు రైతులు సిసిఐ ద్వారా కనీస మద్దతు ధర క్రింద పత్తిని విక్రయించేందుకు అవసరమైన తాత్కాలిక రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముందుగానే పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారి, మండల వ్యవసాయ అధికారి లేదా జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించి అవసరమైన వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు. సిసిఐ ద్వారా పత్తి విక్రయించే సమయంలో రైతు ఆధార్ ధృవీకరణ తప్పనిసరిగా చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. బయోమెట్రిక్ ద్వారా ఆధార్ ఆథెంటికేషన్ చేయించుకోవాలని, వేలిముద్రలు సరిపోని సందర్భాల్లో ఐరిస్ స్కాన్, ముఖ ధృవీకరణ లేదా ఓటిపి విధానం ద్వారా ఆధార్ ధృవీకరణ చేసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఓటిపి విధానం వినియోగించాలంటే ఆధార్కు మొబైల్ నంబర్ అనుసంధానం అయి ఉండాలని సూచించారు. ఆధార్ నంబర్ లేని రైతులు ఆధార్ నమోదు గుర్తింపు పత్రంతో పాటు పాన్ కార్డు,పాస్పోర్ట్, ఓటరు గుర్తింపు కార్డు, ఫోటోతో కూడిన బ్యాంకు లేదా పోస్ట్ ఆఫీస్ పాస్బుక్,డ్రైవింగ్ లైసెన్స్ లేదా ప్రభుత్వం గుర్తించిన ఇతర గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ 2026--27 సీజన్లో సిసిఐ ద్వారా కనీస మద్దతు ధర క్రింద పత్తిని విక్రయించేందుకు రైతులు 'కపాస్ కిసాన్' మొబైల్ యాప్ను వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. మొబైల్ నంబర్, ఓటిపి ద్వారా యాప్లో లాగిన్ అయి సిసిఐ కి పత్తి విక్రయించేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు కేంద్రాల వివరాలు,పత్తి విక్రయ వివరాలు,తక్పట్టి,చెల్లింపులు తదితర వివరాలను తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు. రైతులందరూ ఈ యాప్ను డౌన్లోడ్ చేసుకుని కనీస మద్దతు ధర పథకం ప్రయోజనాలను పొందాలని సూచించారు. రైతుల సందేహాల నివృత్తికి వాట్సాప్ హెల్ప్లైన్ 8897281111, 'కపాస్ కిసాన్' యాప్ టోల్ఫ్రీ నంబర్ 18005995779 ను సంప్రదించాలని తెలిపారు. పత్తి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు,పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, రైతులకు నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం, కొనుగోలు కేంద్రాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియపై ముందుగానే అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు కూడా చివరి సమయంలో ఇబ్బందులు పడకుండా తేమ శాతాన్ని పరీక్షించుకోవడం, అవసరమైన రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం,ఆధార్ ధృవీకరణకు సంబంధించిన పత్రాలు సిద్ధంగా ఉంచుకోవడం, తమకు సంబంధించిన జిన్నింగ్ మిల్లు,కొనుగోలు కేంద్రం వివరాలను తెలుసుకోవడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# పెద్ద చెరువు నిండినా.. పట్టణానికి దాహమే

- రోజు విడిచి రోజు నీరు.. నల్లాల నుంచి మురికి నీరు
- మున్సిపల్ తాగునీటి సరఫరా పై పర్యవేక్షణ కరువు.. ప్రజల అగ్రహారం





**కల్లూరు, అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** కల్లూరు పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు పట్టణానికి ప్రధాన నీటి వనరుగా ఉన్న కల్లూరు పెద్ద చెరువు నీటితో నిండుగా ఉన్నప్పటికీ తాగునీటి సరఫరా మాత్రం అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోజు విడిచి రోజు కొన్ని ప్రాంతాల్లో రెండు రోజులకు ఒకసారి మాత్రమే నీటి సరఫరా చేస్తుండటంతో తాగునీటి కోసం ప్రజల అవస్థలు పడుతున్నారు.

**నల్లా నీరు వస్తుందా.. మురికి నీరా?**

మున్సిపాలిటీ ద్వారా సరఫరా అవుతున్న నీటిలో పలుచోట్ల నలకలు మురికి కలిసిన నీరు వస్తోందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి పైపులైన్ల పరిస్థితి ట్యాంకుల శుభ్రత నీటి నాణ్యత పై అధికారులు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మిషన్ భగీరథ పైపుల అనుసంధానం పై స్పష్టత ఏది?**

మిషన్ భగీరథ పైపుల నుంచి స్థానిక పైప్ లైన్లకు జరిగిన అనుసంధానం సరఫరా వ్యవస్థలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలపై కూడా స్పష్టత లేకపోవడంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. మీరు ఎందుకు సక్రమంగా రావడం లేదని ప్రశ్నిస్తే మిషన్ భగీరథ ట్యాంకులు నిండలేదని పైపులైన్లు పగిలిపోయాయని సిబ్బంది తరచూ చెబుతున్న సాకు అని పట్టణ ప్రజలు అంటున్నారు. అయితే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకుండా ప్రతిసారి సాకులతో కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**వాటర్ ట్యాంకుల శుభ్రత పై నిఘా ఏది?**

తాగునీటి సరఫరా చేసే వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారా? నీటి నాణ్యతను పరీక్షిస్తున్నారా? పైపులైన్ల లీకేజీలు పగుళ్లను గుర్తించి వెంటనే మరమ్మత్తులు చేస్తున్నారా? అనే అంశాలపై ప్రజల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రజలకు తాగునీరు అందించడం మున్సిపాలిటీ ప్రాథమిక బాధ్యత కాగా సరఫరా వ్యవస్థపై పర్యవేక్షణ ఎందుకు కొరవడిందని పట్టణవాసులు నిలదీస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

కల్లూరు పట్టణంలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు పెద్ద చెరువు నీటితో నిండుగా ఉన్న సమయంలోను పట్టణ ప్రజలకు కాపురెడ్డి ఇబ్బందులు ఎదురవడం పట్ల అధికారులు సమగ్రంగా పరిశీలించారని కోరుతున్నారు. నీటిని ట్యాంకుల శుభ్రత పైపులైన్ల మరమ్మత్తులు మిషన్ భగీరథ అనుసంధానం వీటి నాణ్యత పరీక్షలు ప్రాంతాల వారీగా సరఫరా షెడ్యూల్ను పర్యవేక్షించి సక్రమంగా నీటిని అందించాలని పట్టణం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# 61 మంది ఈపీ ఆపరేటర్ల ప్లే డే మస్టర్ భత్యం చెల్లించాలి

- జేవీఆర్ ఓసీ యాజమాన్యానికి జేఏసీ వినతి



**సత్తుపల్లి అక్టోబర్07(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి జేవీఆర్ ఓ.సీలో 2026 ఫిబ్రవరి 1వ తేదీకి సంబంధించి 4 మస్టర్లు లేకపోవడంతో, 3 మస్టర్లలో పనిచేస్తున్న 61 మంది ఈపీ ఆపరేటర్లకు యాజమాన్యం ప్రత్యేక అనుమతితో ప్లే డే నిర్వహించింది. అయితే ప్లే డే నిర్వహించి ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత కార్మికులకు ఆ రోజు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడంపై కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల స్ట్రక్చర్ సమావేశాల్లో చర్చించడం జరిగిందని, అలాగే డైరెక్టర్లకు సైతం వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఇప్పటి వరకు ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడంపై గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సత్తుపల్లి జేవీఆర్ ఓసీ కార్మికులు, వివిధ కార్మిక సంఘాల నాయకులు కలిసి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ)గా ఏర్పడి యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, యాజమాన్యం ప్రత్యేక అనుమతితో ప్లే డే విధులు నిర్వహించేందుకు అనుమతించిన 61 మంది ఈపీ ఆపరేటర్లకు సంబంధించిన ప్లే డే మస్టర్ను వెంటనే నమోదు చేసి, పెండింగ్లో ఉన్న మస్టర్ భత్యాన్ని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలలుగా ప్లే డే మస్టర్ భత్యం చెల్లించకపోవడం వల్ల, సంబంధిత కార్మికులకు ఆర్థిక నష్టం జరుగుతోందని, యాజమాన్యం ఈ సమస్యను ఇకపై ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్మికుల హక్కుగా రావాల్సిన భత్యాన్ని వెంటనే చెల్లించి సమస్యకు ముగింపు పలకాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాన్ని గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్ ఆధ్వర్యంలో, గుర్తింపు సంఘం ఫిట్ సెక్రటరీ నరసింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘ నాయకులు ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు, టీబీజీకేయస్ నాయకులు రఘువీర్, హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ ఆంజనేయులు, ప్రాతినిధ్య సంఘ ఫిట్ సెక్రటరీ సీతారామరాజు, మురళీకృష్ణ, సుధాకర్, అస్గర్ ఖాన్, నరేందర్, పీవీ రాజు, సందీప్, ఇక్బాల్ తదితర వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం సైబర్ క్రైమ్ సీఐగా నరేష్



**లక్ష్మీ దేవిపలి, అక్టోబర్07 (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్గా విధులు నిర్వహిస్తున్న జితేందర్ను కొత్తగూడెం వన్టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్గా పనిచేస్తున్న నరేష్ను కొత్తగూడెం సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్గా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ మేరకు ఇరువురు అధికారులు త్వరలో నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు..

# రిటైర్డ్ ఉపాధ్యాయురాలు లక్ష్మీ రామమ్మకు ఘన సన్మానం

- ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైజ్ పర్సన్స్ సంఘంలో సభ్యత్వం



**భద్రాచలం, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి):** భద్రాచలం సీతారాం నగర్ కాలనీలోని లక్ష్మీ రామమ్మ స్వగృహంలో ఆమెను కలిసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలిపిన ఆల్ ప్రిన్సెస్ ఇన్ ట్రిటేట్ పర్సన్స్ సోషియేషన్ ఉపాధ్యక్షులు టి. శివప్రసాద్, తన మాజీ సహోపాధ్యాయురాలైన లక్ష్మీ రామమ్మకు నూతన వస్త్రాలను బహుకరించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీ రామమ్మ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్లో సభ్యత్వం ఇవ్వాలని కోరగా, స్పందించిన ఆయన ఆమెను సంఘంలోకి ఆహ్వానించి సభ్యత్వం అందజేశారు. దీంతో ఆమె ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్లో చేరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బందు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు టి. ప్రసాద్, ఇతర సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# నాపై దేశ ప్రజలకే ఎక్కువ హక్కు ఉంది

మొదటిపేజీ తరువాయి..

సాధించిన ప్రతి విజయం తనను మరింత ఉన్నత లక్ష్యాల వైపు నడిపించిందని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.ప్రధాని మోదీ మాట్లాడుతూ, "దేశం నాకు ఎంతో ఇచ్చింది, కాబట్టి దేశం పట్ల నా బాధ్యత చాలా ఎక్కువ ఉంది. నాపై ప్రజలకే అత్యధిక హక్కు ఉంది. ఈ 25 ఏళ్ల అనుభవమే నా గొప్ప ఆస్తి. ఈ ఆస్తి మోదీకి కాదు, దేశానికి చెందుతుంది. మాతృభూమిలోని ప్రతి బిడ్డకు దానిపై హక్కు ఉంది" అని అన్నారు.బాధ్యతలను ఒక లక్ష్యంగా మార్చుకున్నామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కార్యాచరణే తన మతమని, భగవద్గీత బోధించిన 'కర్మణ్యే వాధికారస్తే' మార్గంలోనే నడుస్తున్నానని చెప్పారు. తాను ఎప్పుడూ కీర్తి ప్రతిష్టల గురించి పట్టించుకోలేదని, కేవలం దేశం కోసం పని చేయడమే తన కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాతికేళ్ల పాటు ప్రభుత్వం అధినేతగా కొనసాగుతానని తాను అసలు ఊహించలేదని, తన కెరీర్ ఇలా సాగుతుందని అసలు ఊహించలేదు అన్నారు. "దేశం నాకు చాలా ఇచ్చింది. అందుకే దేశం పట్ల నా బాధ్యత అందరికంటే ఎక్కువగా ఉంటుంది. భారత్‌లోని ప్రతి పౌరుడికీ నాపై అత్యంత హక్కు ఉందని నేను హృదయపూర్వకంగా నమ్ముతున్నాను" అన్నారు. ప్రధానమంత్రి మాట్లాడుతూ, "నేను దేశప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. 7 అక్టోబర్ 2001న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు, ఎప్పటికైనా ఈ ఘట్టం వస్తుందని అనుకోలేదు. ఈరోజు ప్రభుత్వ అధినేతగా నిరంతరం సేవ చేస్తూ నేను 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాను. ఇది ప్రజల నిరంతర ఆశీర్వాదాల ఫలితం. బీజేపీ, ఎన్డీఏ, ప్రజాస్వామ్యం పట్ల గౌరవం ఉన్న రాజకీయ సహచరులందరికీ నేను కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నేను దేశ ప్రజల పాదాలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను" అన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు దసరా బొనాంజా

మొదటిపేజీ తరువాయి..

డీఏ 53 శాతానికి పెంచారు. 2006 పే స్కేలు ఉద్యోగులకు డీఏ 246 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. యూజీసీ, ఏఐసీఐఐ ఉద్యోగులకు సైతం ఈ ప్రయోజనాలు వర్తించనున్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6,91,000 ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం కలగనుంది. 2024 జనవరిలో విడుదల కావల్సిన 3.64 అదే ఏడాది జులైలో ఇవ్వాల్సిన 2.73 శాతం డీఏను మంజూరు చేసింది. రెండు కలిపి 6.37 శాతం పెరిగి డీఏ 40.04 శాతానికి చేరింది. అక్టోబరు నెల జీతం నుంచి పెరిగిన డీఏ అందనుంది. 2024 జనవరి 1 నుంచి కొనసాగుతున్న పార్ట్‌టైం అసిస్టెంట్లు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లకు నెలకు రూ.100 చొప్పున పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు రావల్సిన బకాయిలను ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో జమ కానున్నాయి. సీపీఎస్ ఉద్యోగులకు బకాయిల్లో పది శాతం ప్రాన్ అకౌంట్లలో జమ చేసి మిగతావి వాయిదాల్లో చెల్లిస్తారు.సీపీఎస్ ఉద్యోగులకు 90శాతం బకాయిలతో పాటు పెన్షనర్లు, ఫుల్ టైమ్ కాంటింజెంట్ ఉద్యోగులకు మొదటి డీఏ 33, రెండో డీఏ 27 వాయిదాల్లో చెల్లిస్తారు. రెండు డీఏ బకాయిలు మొత్తం కలిపి రూ.6,174 కోట్లు కాగా పెరిగిన కరవుభత్యంతో ప్రభుత్వానికి ఏటా సుమారు రూ.2,500 కోట్లు అదనపు వ్యయం కానుంది. డీఏల మంజూరుపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. మిగతా నాలుగు డీఏలను కూడా త్వరగా విడుదల చేయడంతో పాటు పీఆర్సీ తెప్పించి 51 శాతం ఫిట్‌మెంట్ అమలు చేయాలని పెండింగ్ బిల్లుల కోసం నెలకు రెండు వేల కోట్ల రూపాయలు విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, చావ రవి, సదానందం తదితరులు కోరారు.

# ఈజీ మనీ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి): ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇస్తే డబ్బులు వస్తాయి.. కమీషన్ తీసుకోండి.. ఈజీ మనీ! సోషల్ మీడియా, మెసేజింగ్ యాప్స్‌లో ఇలాంటి మెసేజ్‌లు చూసి చాలామంది పెద్దగా పట్టించుకోరు. కానీ ఇలాంటి చిన్న ఆఫర్లే చివరకు భారీ సైబర్ క్రైమ్ నెట్‌వర్క్‌లో భాగం చేసే ప్రమాదం ఉంది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో నిర్వహించిన భారీ మల్టీ-స్టేట్ ఆపరేషన్ ఇప్పుడు ఇదే విషయాన్ని బయటపెట్టింది. ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏకకాలంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో 18 మంది మహిళలు సహా 101 మంది నిందితులు అరెస్టయ్యారు. వీరి ద్వారా సుమారు 17 కోట్ల మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. సెప్టెంబర్ 23 నుంచి రెండు వారాల పాటు కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరిలో ఈ ఆపరేషన్ కొనసాగింది. అసలు ఈ నెట్‌వర్క్‌లో ముఖ్యమైన పాత్ర పోషించింది మ్యూల్ బ్యాంక్ అకౌంట్స్. అంటే.. సైబర్ మోసగాళ్లు తమ పేర్లపై కాకుండా ఇతరుల బ్యాంక్ ఖాతాలను డబ్బులు స్వీకరించడానికి, ట్రాన్స్‌ఫర్ చేయడానికి ఉపయోగించుకోవడం. ఇందుకోసం కొందరు ఏజెంట్లు కమీషన్ తీసుకుని బ్యాంక్ ఖాతాలను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు దర్యాప్తులో తేలింది. అరెస్టయిన 101 మందిలో 19 మంది ఏజెంట్లు, 81 మంది మ్యూల్ అకౌంట్ హోల్డర్లు ఉన్నారు. అంటే నా అకౌంట్ మాత్రమే కదా.. నేను ఏం చేశాను? అనే నిర్లక్ష్యం ఎంత ప్రమాదకరమో ఈ కేసు చెబుతోంది. అంతేకాదు.. ఈ నిందితుల బ్యాక్‌గ్రౌండ్ చూస్తే సైబర్ క్రైమ్ అంటే కేవలం చదువు లేని వాళ్లు లేదా నిరుద్యోగులే చేస్తారనే అపోహ కూడా తప్పని అర్థమవుతోంది. అరెస్టయిన వారిలో వ్యాపారులు, ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు, డ్రైవర్లు, సేల్స్-మార్కెటింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఒక టాటా క్యాపిటల్ ఉద్యోగి కమీషన్ కోసం సైబర్ మోసగాళ్లకు మ్యూల్ అకౌంట్లు సమకూర్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటుండగా, ఒక ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగి తన బ్యాంక్ అకౌంట్‌ను మోసపూరిత లావాదేవీలకు ఉపయోగించేందుకు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. మరో నిందితుడికి దేశవ్యాప్తంగా 50 సైబర్ క్రైమ్ కేసులతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. ఇంకొకరికి 60 కేసులతో సంబంధం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 101 మందిలో 50 మందికి దేశవ్యాప్తంగా ఐదుకు పైగా నేర సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తులో మరో షాకింగ్ విషయం కూడా బయటపడింది. మ్యూల్ అకౌంట్ల ద్వారా వచ్చిన డబ్బును ఏటీఎంల నుంచి విత్‌డ్రా చేయడం, ఇతర ఖాతాలకు బల్క్ ట్రాన్స్‌ఫర్లు చేయడం, విదేశీ లావాదేవీలకు ఉపయోగించడం వంటి మార్గాల్లో తరలించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ పనికి అకౌంట్ హోల్డర్లు, మధ్యవర్తులకు మోసపూరిత మొత్తంలో 5 శాతం వరకు కమీషన్ ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అంటే సోషల్ మీడియాలో కనిపించే 'అకౌంట్ ఇవ్వండి.. కమీషన్ తీసుకోండి' అనే ఈజీ మనీ ఆఫర్ వెనుక ఎంత పెద్ద నెట్‌వర్క్ ఉండొచ్చో ఊహించుకోవచ్చు. ఈ ఆపరేషన్‌లో ఏడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 51 కేసులకు సంబంధించి అరెస్టులు జరిగాయి. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,172 నేర సంబంధాలు గుర్తించగా, అందులో 206 తెలంగాణకు సంబంధించినవిగా గుర్తించారు. ఇక యువత ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఓటీపీ, సిమ్, కేవైసి వివరాలు, సోషల్ మీడియా ప్రొఫైల్ కూడా నేరగాళ్లకు ఆయుధాలుగా మారొచ్చు. పార్ట్‌టైమ్ జాబ్, ఇన్‌స్టంట్ ఇన్‌కమ్, ట్రేడింగ్ ప్రాఫిట్, క్రిప్టో రిటర్న్స్, టాస్క్ కంప్లీట్ చేసి డబ్బు సంపాదించండి అంటూ వచ్చే ప్రతి ఆఫర్ నిజం కాదు. ముఖ్యంగా డిజిటల్ అరెస్ట్ పేరుతో పోలీసులు, కస్టమ్స్, కొరియర్ అధికారులు అంటూ వీడియో కాల్స్ చేసి డబ్బులు అడిగితే వెంటనే అప్రమత్తం కావాలి. ఎవరైనా మీ అకౌంట్‌ను ఉపయోగించుకోవడానికి కమీషన్ ఆఫర్ చేసినా.. ఒక్కసారి మాత్రమే అని చెప్పినా.. ఒప్పుకోకండి. ఎందుకంటే మీ అకౌంట్‌లో జరిగిన ట్రాన్సాక్షన్‌కు మీరు కూడా సమాధానం చెప్పాల్సి రావచ్చు. తెలియని లింకులపై క్లిక్ చేయకండి, ఓటీపీలు లేదా బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకండి, సోషల్ మీడియాలో వచ్చిన అకౌంట్లకు డబ్బులు పంపకండి. ఏదైనా సైబర్ మోసం జరిగితే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేయండి ఫిర్యాదు చేయండి. ఈ ఆపరేషన్ చెప్పే అసలు మెసేజ్ ఒక్కటే.. ఈజీ మనీ అనిపించే ప్రతి ఆఫర్.. ఈజీ మనీ కాకపోవచ్చు. ఒక్క బ్యాంక్ అకౌంట్ ఇవ్వడం కూడా మీ జీవితాన్ని సైబర్ క్రైమ్ కేసులోకి లాగొచ్చు.

..............

# విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించం

మొదటిపేజీ తరువాయి..

పోలిస్తే గణనీయంగా పెరిగిందన్నారు. కర్ణాటకలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లలోపే ఉండగా.. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉందని తెలిపారు. ఈ రాష్ట్రాల కంటే తెలంగాణలో విద్యుత్ వినియోగ



డిమాండ్ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ.. వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడంలో కీలకపాత్ర పోషించిన విద్యుత్ సంస్థల సిబ్బందిని భట్టి విక్రమార్క అభినందించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలు అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ స్థాయిలో డిమాండ్ ఉన్నప్పటికీ సరఫరాను కొనసాగించగలిగామని తెలిపారు. ఇదే సమయంలో రాష్ట్ర విద్యుత్ రంగంపై కొందరు నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క విమర్శించారు. తెలంగాణ స్టేట్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ , ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ , విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. అలాగే రాష్ట్ర విద్యుత్ సంస్థలను పబ్లిక్‌గా లిస్ట్ చేయడం లేదా వాటిని ప్రభుత్వ రంగం నుంచి తప్పించే ప్రతిపాదన కూడా లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మరింత బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. నెహ్రూ అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రస్తావించిన భట్టి.. మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో పాటు బలమైన ప్రభుత్వ రంగ సంస్థలు కాంగ్రెస్ విధానంలో కీలక భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేస్తూనే రాష్ట్ర అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తామని తెలిపారు.
యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్ర విమర్శలు చేశారు. పవర్ ప్లాంట్ నిర్మించే ముందు దానికి అవసరమైన బొగ్గు లభ్యత, కేటాయింపులు, సరఫరా ఒప్పందాలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెప్పారు. యాదాద్రి ప్లాంట్‌కు సింగరేణి నుంచి గ్రేడ్-9 బొగ్గు సరఫరా చేస్తామని గతంలో ఒప్పందం చేసుకున్నప్పటికీ.. అవసరమైన స్థాయిలో బొగ్గు సరఫరా జరగలేదని భట్టి ఆరోపించారు. అసలు బొగ్గు కేటాయింపులు లేకుండానే ప్లాంట్ నిర్మాణం చేపట్టారని విమర్శించారు. నైనీ బొగ్గు బ్లాక్‌కు సంబంధించిన అంశాన్ని కూడా డిప్యూటీ సీఎం ప్రస్తావించారు. గత ప్రభుత్వ హయాంలో మైనింగ్ ప్రక్రియ నిలిచిపోయిందని.. తాము కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించి మైనింగ్‌ను ప్రారంభించామని తెలిపారు. గత ఏడాది 2 యూనిట్లు, ఈ ఏడాది మరో 2 యూనిట్లను ప్రారంభించామని భట్టి విక్రమార్క చెప్పారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, పత్రాలను త్వరలో మీడియా ముందు ఉంచుతామని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను ఆధారాలతో ప్రజలకు వివరిస్తామని చెప్పారు. వారానికి ఒక అంశం చొప్పున గత ప్రభుత్వ నిర్ణయాలను బయటపెడతామని పేర్కొన్నారు. మరోవైపు.. విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరుతూ హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఇటీవల లేఖ రాశారు. ట్రాన్స్‌కోతో పాటు జెన్‌కో, డిస్కమ్‌లు, సింగరేణి వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. ట్రాన్స్‌కో రాష్ట్ర విద్యుత్ వ్యవస్థకు వెన్నెముక లాంటిదని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఐపీఓ పేరుతో సంస్థలో 26 శాతం వాటాను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ట్రాన్స్‌కోతో మొదలయ్యే ప్రక్రియ భవిష్యత్తులో జెన్‌కో, డిస్కమ్‌లు, సింగరేణికి కూడా విస్తరించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని చెబుతూ.. తెలంగాణలో మాత్రం అదే విధానాన్ని అవలంబిస్తే రాహుల్ గాంధీ స్పందించాలని హరీశ్‌రావు కోరారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు కూడా లేఖ ప్రతులను పంపినట్లు హరీశ్ రావు తెలిపారు. ఇలా తెలంగాణలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరిన సమయంలోనే ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థల భవిష్యత్తుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఒకవైపు ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదన లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేస్తుండగా.. మరోవైపు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను బీఆర్ఎస్ నేతలు అనుమానిస్తున్నారు. దీంతో డిస్కమ్‌లు, ట్రాన్స్‌కో, జెన్‌కో భవిష్యత్తుపై రాజకీయ చర్చ మరింత వేడెక్కింది.

## రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల యజమానులకు గుడ్‌న్యూస్!

### త్వరలో భారీగా తగ్గనున్న రిజిస్ట్రేషన్ ఫీజులు

హైదారాబాద్, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి):
రాష్ట్రంలో ప్రైవేటు బస్సుల 'వలస' రిజిస్ట్రేషన్లను ఆపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అధిక ట్యాక్స్‌ల భారంతో ఈశాన్య, ఇతర రాష్ట్రాల పేరుతో నడుస్తున్న బస్సుల రిజిస్ట్రేషన్‌ను 'టీజీ' బాట పట్టించేవిధంగా అధికారుల కమిటీ పలు కీలక సిఫార్సులను చేసింది. 12 సీట్లకు పైబడిన కాంట్రాక్ట్ క్యారేజెస్(ప్రైవేటు బస్సులు) ఆయా బస్సుల్లో ఒక్కో సీటుకు ప్రస్తుతం రాష్ట్ర మోటారు వాహన పన్ను(తెలంగాణ మోటార్ వెహికల్ ట్యాక్స్) కింద ప్రతి త్రైమాసికానికి(మూడు నెలలు) పన్ను రూ.4 వేలు ఉండగా, రూ.1,800కి తగ్గించాలని సూచించింది. ఈ మేరకు ఇందుకు సంబంధించిన ప్రతిపాదన ప్రభుత్వానికి మంగళవారం వెళ్లింది.హైదరాబాద్ నగరం నుంచి పొరుగు రాష్ట్రాల్లోని నగరాలకు నిత్యం వందల సంఖ్యలో బస్సులు వెళుతుంటాయి. ఆయా బస్సులను ఓనర్సు మోటారు వాహన పన్ను స్వల్పంగా ఉన్న రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. 2020-21 నుంచి 2025-26 మధ్య కాలంలో తెలంగాణకు చెందిన 123 ప్రైవేటు బస్సుల రిజిస్ట్రేషన్ ఇతర రాష్ట్రాల్లో జరిగింది. అందులో సగానికిపైగా నాగాలాండ్‌లోనే ఉండడటమనేది గమనార్హం. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి త్రైమాసిక పన్నుతో ఆదాయం ఏటా పెరగాల్సిందిపోయి క్రమంగా తగ్గుతూ వచ్చింది. బస్సుల సంఖ్య 233 నుంచి 110కి పడిపోవడంతో తెలంగాణ ఆదాయానికి గండి పడింది.ఈ నేపథ్యంలో త్రైమాసిక పన్ను(మూడు నెలల పన్ను) రూ.1,800కి తగ్గిస్తే తొలుత ఆదాయ నష్టం వచ్చినప్పటికీ ఆ తర్వాత పెరుగుతుందని రవాణాశాఖ అధికారుల కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.

# 5.50 శాతానికి రెపో రేటు పెంపు

మొదటిపేజీ తరువాయి..

జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి



చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు.
మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

# పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

మొదటిపేజీ తరువాయి..

ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్



లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, శశాంక, అనుదీప్, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓ, ఎండీ, అజిత్ రెడ్డి, నిఖిల్ చక్రవర్తి, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

మొదటిపేజీ తరువాయి..

రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం ప్రతి ప్రధాన పండుగకు 1.5 వరకు టికెట్ ధరలను ఉమ్మడి కార్పొరేషన్గా ఉన్నప్పటి నుండి అమలు చేస్తుంది. టీజిఎస్ఆర్టీసీ ఏర్పడిన నాటి నుండి ప్రతి ప్రధాన పండుగకు దీన్ని అమలు చేస్తుంది.ఈ దసరా పండుగకు నడిపే ప్రత్యేక బస్సులకు రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం 1.5 వరకు టికెట్ ధరలను టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సవరించింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఈ నెల 9, 10,16,17 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 25,26 తేదీల్లో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయి. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి.




Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967